

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

సెప్టెంబరు 2025
వెల రూ. 20/-
పుటలు - 56

SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:56, Issue: 04
September - 2025, Price Rs.20/-.

## తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు

(23-09-2025 నుండి 02-10-2025 వరకు)

ఆంధ్రప్రదేశ్ గౌరవముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబునాయుడు గారు
19-07-2025న తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామివారిని ఆలయమర్యాదలతో దర్శించుకున్నారు.


'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా
శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆలయాన్ని శుభ్రం చేశారు.











# గీతాశ్లోకార్థసారం

శ్లో : యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతమ్ ।
సుఖినః క్షత్రియాః పార్థ లభన్తే యుద్ధమీదృశమ్ ॥

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-32వ శ్లోకం)

ప్రతిపదార్థం: పార్థ= ఓ అర్జునా!; యదృచ్ఛయా= తనంతతాను (కోరకుండ); ఉపపన్నమ్= సంప్రాప్తమైంది; అపావృతమ్= తెఱవబడిన; స్వర్గద్వారమ్ చ= స్వర్గద్వారమున్నునగు; ఈదృశమ్= ఇట్టి; యుద్ధమ్= యుద్ధాన్ని; (యే) క్షత్రియాః= ఏ క్షత్రియులు; లభన్తే= పొందుతున్నారో; (తే=వారు) సుఖినః= సుఖవంతులు (ధన్యులు)

భావం: ఓ అర్జునా! అప్రయత్నముగనే లభించినట్టిదీ, తెఱవబడిన స్వర్గద్వారంవంటిదీ, స్వర్గాన్ని గలుగజేసేదీ అయిన ఇలాంటి యుద్ధాన్ని ఏ క్షత్రియులు పొందుతారో వారు నిజంగా సుఖవంతులే అవుతారు.

---

## గగనము జగములు గడగడ వడఁకె



ఇటు గరుడని నీ వెక్కినను
పటపట దిక్కులు బగ్గనఁ బగిలె

ఎగసిన గరుడని యేపున 'ధా' యని
జిగిదొలఁక చబుకుచేసినను
నిగమాంతంబులు నిగమసంఘములు
గగనము జగములు గడగడ వడఁకె

బిరుసుగ గరుడని పేరెము దోలుచు
బెరసి నీవు గోపించినను
సరుస నఖిలములు జర్జరితములై
తిరుపున నలుగడ దిరదిరఁ దిరిగె

పల్లించిన నీపసిఁడి గరుడనిని
కెల్లున నీ వెక్కినయపుడు
ఝల్లనె రాక్షస సమితి నీమహిమ
వెల్లి మునుఁగుదురు వేంకటరమణా ॥

(ఆధ్యాత్మసంకీర్తన సంపుటం 01- సంకీర్తన 92)

దుష్టశిక్షణ, శిష్టరక్షణార్థమై శ్రీనివాసుడు గరుడవాహనంపై అధిరోహించిన ఘట్టాన్ని ఈ సంకీర్తనలో అన్నమయ్య వర్ణించాడు. "స్వామీ! వేంకటరమణా! నీవు గరుడుణ్ణి ఎక్కగానే పటపటమంటూ వింతవింత శబ్దాలతో దిక్కులన్నీ పగిలాయి. గరుడునిపై స్వారీ చేస్తూ కోపంతో దాన్ని తోలగా లోకాలన్నీ గిరిగిర తిరిగాయి. ప్రస్తుతం బంగారుగరుడునిపై నీవు విహరిస్తుండగా రాక్షససమూహం భీతి చెందింది. ఓ వేంకటరమణా! ఇలా భక్తులు నీ మహిమల్లో మునకలేస్తారు కదా!



# దేవాలయాలలో ఇవి పాటించండి!

01) పాదరక్షలు ధరించి భగవంతుని సన్నిధిలోకి ప్రవేశించకూడదు.

02) దేవునికి ఉత్సవాలు జరుగుతుంటే నమస్కరించకుండా ఉండకూడదు.

03) ఒక చేతితో నమస్కరించకూడదు.

04) దేవుని ఎదుట ఆత్మప్రదక్షిణం చేసుకోకూడదు.

05) ఎంగిలి చేతితో నమస్కరించకూడదు.

06) లౌకికవిషయాలు, అనవసర మాటలు మాట్లాడకూడదు.

07) గట్టిగా ఏడవడం, నవ్వడం చేయకూడదు.

08) ఒకరికి "నీకు ఈ ఉపకారం చేస్తాను" అని ప్రతిజ్ఞ చేయకూడదు.

09) స్త్రీలతో పరిహాసాలు చేయకూడదు.

10) ఆలయాల్లో ఉన్నప్పుడు మన ధ్యానం, ధ్యాస, దేవతామూర్తులపైన తప్ప ఇతర విషయాల మీద ఉండకూడదు.

11) శాలువ, కంబళీ కప్పుకోకూడదు.

12) ఆలయంలో ఇతరులను తిట్టడం, పొగడడం చేయకూడదు.

13) ఇతరులకు దేవుని ఎదుట నమస్కారం చేయకూడదు.

14) గురువులు, ఆచార్యుల ప్రసక్తి వచ్చినపుడు వారిని పొగడకుండా ఉండకూడదు.

15) భగవంతునికంటే అధికులు ఎవరూ లేరని భావన చేసుకోవాలి.

16) కాళ్లు చాపుకుని కూర్చోవడం, అర్చకుల్ని హీనభావంతో చూడడం చేయకూడదు.


17) భగవంతుని కైంకర్యాల్లో పాల్గొనే శక్తి ఉంటే తప్పక పాల్గొనాలి.

18) అన్యమత ప్రచారం చేయకూడదు.

19) సంప్రదాయ వస్త్రాలను ధరించాలి.

20) ఆలయప్రసాదాల్ని దుర్వినియోగం చేయకూడదు.

21) ఆలయపుష్కరిణి, కోనేరులలో వస్త్రాలు ఉతకకూడదు.



చిత్రసౌజన్యం: ప్రముఖ తమిళ సినీనటులు శ్రీ శివకుమార్



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥


తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 56 సెప్టెంబరు, 2025 సంచిక : 04


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| పురాణ పురుషా గోవిందా!! | డా॥ఆకెళ్ళ విభీషణశర్మ | 07 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 12 |
| మూడో అడుగు! | శ్రీ డి.వి.ఆర్.భాస్కర్ | 14 |
| మంచి జరగాలంటే..! | డా॥కె.వి.రాఘవాచార్య | 16 |
| ఈ కావ్యంలో ఎన్నో విశేషాలు!! | శ్రీమతి డి.వి.లక్ష్మి | 22 |
| అనుమానం ఉండకూడదు! | శ్రీ తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి | 24 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఎ.కృష్ణమాచార్యులు | 26 |
| తిరుమలలో ఇవి కూడా చూడండి! | 'గ్రీన్ జర్నలిస్ట్' శ్రీ బి.వి.రమణ | 27 |
| అమ్మలగన్న అమ్మ | శ్రీమతి చెవుటూరి కుసుమకుమారి | 31 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 34 |
| ఎప్పటికీ ఋణపడే ఉంటాం! | శ్రీ బి.గురుకుమార్ రెడ్డి | 35 |
| బాధలు పోగొట్టే తల్లి! | కుమారి ఆర్.జయశ్రీ కాశీకర్ | 37 |
| కన్నవారి ఋణం తీర్చుకునే అవకాశం! | శ్రీమతి పి.రమాదేవి | 39 |
| విశ్వనాయకుడు | డా॥పోరంకి దక్షిణామూర్తి | 41 |
| సమర్పించేది కురులు- అనుగ్రహించేది సిరులు | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 42 |
| అమ్మ అన్ని కొరతలు తీర్చుతుంది | డా॥నల్లాని రాజేశ్వరి | 45 |
| ప్రాప్తంకొద్దీ ఫలితం (వేమన శతకం) | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 47 |
| గురువు పైకి కఠినంగా ఉన్నా.. (చిత్రకథ) | కథ: 'కళారత్న' డా॥కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు: శ్రీ తుంబలి శివాజీ | 48 |
| ఇలా చేస్తే గుండె పదిలం | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 50 |
| క్విజ్ | | 51 |
| బాలవినోదం | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| శ్రీపదకేళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవం
వెనుకచిత్రం: జగదేకమాతలు (చిత్రసౌజన్యం: శ్రీ పంచకర్ల రమేష్)


గౌరవ సంపాదకులు
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.
ప్రచురణకర్త-సంపాదకులు,
ప్రధాన సంపాదకులు (ఎఫ్.ఏ.సి.)
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,
ఉపసంపాదకులు
'కళారత్న' డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., తెలుగు & ఇంగ్లీషు, ఎం.ఫిల్., పిహెచ్.డి.,
ముద్రాపకులు
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఎడ్.,
ఉపకార్యనిర్వహణాధికారి, (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.
ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359



విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-



వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.



24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# వేయికన్నులు చాలవుగా...

దివ్యశక్తులున్నవాళ్లు దేవతలు. వాళ్లకు 'ఖేచరులు'- ఆకాశంలో సంచరించేవాళ్లనే పేరుంది. వాహనాలు లేకపోయినా సంకల్పమాత్రంతో విశ్వమంతా సంచరించే దివ్యశక్తులు వాళ్ల సొంతం. కానీ, దేవతలందరికీ ప్రత్యేకంగా వాహనాలున్నాయి. విగ్రహారాధన, ఉత్సవాలూ, వాహనసేవలూ- ఇవన్నీ మనం తరించడానికే! వహించేది- వాహనం. దేవతలవాహనాలు- వాళ్ల శక్తులకు ప్రతీకలు. కనుక వాహనవిశేషాల్ని తాత్త్వికదృష్టితో గ్రహించాలి.

విష్ణువుకు గరుత్మంతుడు వాహనం. ఇతడు వేదమయుడు. కనుకనే విష్ణువును వహించేశక్తి పొందాడు. విష్ణుదేవుని వేదమయశక్తియే- వాహనమైన గరుత్మంతుడుగా రూపొందింది. శక్తియొక్క రూపాంతరమే వాహనం. వాహనమే ఆ దేవుని ధ్వజపటంగానూ ఉంటుంది. శివునివాహనం వృషభం (ఎద్దు). వృషభమంటే ధర్మమని అర్థం. కనుక ధర్మమే శివునికి వాహనం. అట్లే దుర్గాదేవికి సింహం వాహనం. సింహం పరాక్రమానికి సంకేతం. ఇట్లే హనుమద్వాహనం దాస్యభక్తికీ, విశ్వాసానికీ సంకేతం. ఏనుగు శుభదర్శనానికీ, మహాబలానికీ సంకేతం. శేషుడు భారవహనశక్తికి సంకేతం. కల్పవృక్షం- కోర్కెలు తీర్చడానికీ, సర్వభూపాలవాహనం- భగవంతుని విశ్వేశ్వరత్వానికీ, అశ్వం- వేగానికీ, రథం దేవాలయ రూపానికీ (సంచార దేవాలయం), విశ్వానికీ, మానవదేహానికీ సంకేతాలు.

ఉత్సవాలలో ఆయా వాహనాలపై ఉండే ఉత్సవమూర్తుల్ని దర్శించడంవల్ల వాహనంగా ఉండేవి ఏయే గుణాలకూ, శక్తులకూ సంకేతాలో గ్రహించి, భక్తులు అందుకు అధిష్ఠానమైన భగవంతుణ్ణి హృదయంలో నిల్పుకుంటేనే, తామూ వాహనాలుగా మారి, శ్రీవారిని వహించే శక్తిసామర్థ్యాలూ, అనుగ్రహమూ పొందగలుగుతారు. చక్రవర్తులు నడిచి రాగల్గినా వాహనంపైనే వస్తారు. అది వాళ్ల చక్రవర్తిత్వలక్షణం! హోదా! దేవతలవాహనాలు కూడా దివ్యశక్తి గలవే కనుక అవీ ఆకాశంలోనే పయనిస్తాయి.

శ్రీవారిబ్రహ్మోత్సవాల్లో అనేక వాహనసేవలుంటాయి. ఈ సేవల్ని దర్శించడంతో శ్రీవేంకటేశ భగవానుడు సర్వదేవతాస్వరూపుడూ, సకలశక్తిమంతుడూ, సర్వవ్యాపకుడూ, భక్తకల్పతరువూ, అపారకృపాసాగరుడూ అనే విషయాలు మనకు గోచరిస్తాయి. శ్రీవారి అనంతత్వం మాటలకూ, మనస్సుకూ అందనిది. ఆత్మకు మాత్రమే ఆ శ్రీనివాస పరమాత్మతత్త్వం తెలుస్తుంది. దేవతల వాహనాలు- జీవులను సంస్కరించి, పరిశుద్ధుల్ని చేసి, తమదేవతల సన్నిధికి తీసుకువెళ్లే జ్ఞానవాహికలు. కనుకనే దేవతలు తమశక్తుల్ని వాహనరూపంలో మనకు గోచరింపజేస్తూ, మన మనసుల్ని ఆకర్షించి, తమ కృపామృతాన్ని మనపై వర్షిస్తున్నారు. 'ఉత్సవవాహనాలు'- అంటే ఆనందాన్ని కల్గించేవీ, వహించేవీ- అని అర్థం! ప్రతీకోపాసనలో సవాహనంగా భగవన్మూర్తిని ధ్యానించడం ఒక విశిష్టత.

అన్ని ఉత్సవాలకన్నా ఉత్కృష్టమైనవి శ్రీవారి బ్రహ్మోత్సవాలు. ప్రతి ఏటా ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా రమణీయంగా, భక్తుల కన్నులపండువగా జరుగుతాయి. ఈ వేడుకలు చూడడానికి వేయికన్నులు చాలవు. బ్రహ్మోత్సవాలలో తిరుమల సర్వాంగసుందరంగా రూపుదిద్దుకుంటుంది. మనుషులతో పాటు దేవతలకూ స్వాగతం పలకటానికి తి.తి.దేవస్థానం సంరంభంతో సమాయత్తమౌతుంది. గోవిందనామగానం, విద్యుద్దీపాలంకారం, తోరణసమాహారం, భక్తజనకోలాహలంతో తిరుమల అపరవైకుంఠమే అనిపిస్తుంది. సర్వదేవతలు సమధికోత్సాహంతో, భక్తితో పాల్గొనే ఈ బ్రహ్మోత్సవాలకు అందరికీ ఆహ్వానం! రండి! తరలిరండి! తనువు, మనసు తన్మయం చెందే భక్తిభావంతో ఆబాలగోపాలం కదలి ఆ గోవిందుడికి సాగిలపడి మొక్కుదాం!

కన్నులున్నందుకు వెంకన్నను దర్శిద్దాం!
నోరున్నందుకు శ్రీనివాసుణ్ణి స్మరిద్దాం!!
కాళ్లున్నందుకు ఏడుకొండలపైకి నడుద్దాం!!!

సర్వాలంకారశోభితుడై, స్వర్ణరథారూఢుడై అంబరమంటే సంబరాలతో అలరారే ఆ ఆదిదేవుడిని అందరం దర్శిద్దాం! తరిద్దాం!

**వినా వేంకటేశం ననాథో ననాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**

శ్రీవేంకటేశ్వరస్వామి తరతరాల మానవాళి అనంతవిశ్వాసం. అర్చామూర్తిగా అందమైన కటివరదహస్తాలతో శేషాచలంపై వెలసిన కలియుగప్రత్యక్షదైవం. దుష్టశిక్షణ, శిష్టజనుల పరిరక్షణకోసం వివిధరూపాల్లో అవతరించిన జగద్రక్షకుడు, ఈ యుగంలో సాలగ్రామ శిలాంతర్యామిగా తిరుమలక్షేత్రంలో నిత్య పూజలను అందుకుంటున్నాడు. కలియుగవైకుంఠమైన తిరుమల వంటి పుణ్యక్షేత్రంకానీ, శ్రీవేంకటేశ్వరుని వంటి కరుణాభరణు డైన దైవంకానీ ఏకాలంలోనూ లేదు, ఉండదు. ఈ సత్యాన్ని స్పష్టంగా పురాణాలు చాటి చెప్పాయి. కేవలం పురాణాలేకాక, సమస్త ఆర్షవాఙ్మయం శ్రీవేంకటేశ్వరస్వామి వైభవ, ప్రాభవాలను వివరిస్తున్నాయని, పురాణాలే ఉద్ఘోషిస్తున్నాయి.

**వేదేషు చ పురాణేషు, వేంకటేశ కథామృతమ్,**
**వర్ణితం చేతిహాసేషు, భారతాద్యాగమేషు చ॥ (1-9)**


వేదాలలో, పురాణాలలో, ఇతిహాసాలలో, ఆగమాలలో, శ్రీవేంకటేశ్వరస్వామివారి అమృతంవంటి కమనీయమైన కథలు వర్ణించబడ్డాయని "ఆదిత్యపురాణం" తెలియజేస్తోంది. తిరుమల మహిమను ఆ పుణ్యదివ్యదేశంలోని తీర్థాల అమోఘశక్తులను కలియుగనాథుడైన శ్రీవేంకటరమణుని వైభవాన్ని పురాణాలలోని "వేంకటాచల మాహాత్మ్యం" అపూర్వంగా చాటుతోంది.

వరాహపురాణం, పద్మపురాణం, గరుడపురాణం, బ్రహ్మాండ పురాణం, మార్కండేయపురాణం, వామనపురాణం, బ్రహ్మ పురాణం, స్కాందపురాణం, మహాభారతంలోని హరివంశ పురాణం(శేషధర్మం), భవిష్యోత్తరపురాణం, అగ్నిపురాణం, ఆదిత్యపురాణం, భాగవతపురాణం తిరుమలక్షేత్ర ఘనతను అవిష్కరిస్తున్నాయి.

శ్రీవేంకటేశ్వరస్వామి సమస్తవిలాసాలను, భగవత్త త్త్వాన్ని విశ్లేషిస్తున్న ఈ పురాణాలు ప్రాయికంగా స్వామి కల్యాణ గుణాలను, భక్త సంరక్షణాలీలలను, దివ్యనామావళులను అభివర్ణిస్తున్నాయి. తిరుమలక్షేత్రంలో చేయాల్సిన దానధర్మాలు, శ్రీవారి సర్వసమానత, యోగసిద్ధులు, వ్రతాలు, భౌగోళికత ఇలా ఎన్నో నైతిక, ధార్మిక, పరతత్త్వచింతనా విషయాల్ని పురాణాలు అనేకవిధాలుగా సమీక్షించాయి. శ్రీవారిపై పౌరాణిక స్తోత్రాలు అపూర్వంగా పురాణాల్లో గోచరిస్తున్నాయి. భక్తి భావనాసంపదతో దేవతలు, మహర్షులు, మహారాజులు, సామాన్యులు చేసిన స్తోత్రాలు వెలలేనివి, ప్రత్యక్షరస స్రవంతు లకు తావలమైనవి.

### వరాహపురాణం

ధరణీదేవి- వరాహస్వామి సంవాదరూపమైన ఈ పురాణంలోని ప్రథమభాగంలో 33వ అధ్యాయం నుండి 66వ అధ్యాయం వరకు, ద్వితీయభాగంలో 1నుండి 10 అధ్యాయాల వరకు శ్రీవేంకటాచలమాహాత్మ్యవర్ణన లభిస్తుంది. ఇందులో




# పురాణపురుషా గోవిందా!!

- డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ

శ్వేతవరాహకల్ప ఆవిర్భావం, స్వామిపుష్కరిణీమాహాత్మ్యం, శ్రీ వేంకటేశ్వరమహోత్సవప్రశంస, పాండవ జరాహర-ఫల్గునీ-జాబాలి-సనకసనందన-కాయరసాయను తీర్థాలమాహాత్మ్యం ప్రతిపాదించబడింది. ఇక ద్వితీయభాగంలో కూడా ఎన్నోతీర్థాల మాహాత్మ్యం తెలియజేయబడింది. ఇతర పురాణాలలో లభించని వ్యూహలక్ష్మీస్తుతి, శ్రీ వేంకటేశ్వర అష్టోత్తరశతనామావళి ఇందు లోనే ఉన్నాయి. అతిమనోహరమైన పద్మావతీ శ్రీనివాసుల కల్యాణ వృత్తాంతం, ఆకాశరాజు, తొండమానుడువంటి భక్తుల పూర్వజన్మవృత్తాంతాలు, శేషాచలసానువుల వైభవాన్ని ఆలకిం చడంవల్ల, చదవడంవల్ల సిద్ధించే పుణ్యఫలం ప్రధానంగా వివరించబడ్డాయి. కలియుగంలో సమస్త వర్ణ, వర్గ, జాతులకు శ్రీనివాసభక్తి సిద్ధిస్తుందని వరాహపురాణంలో సూతుడు ప్రబోధించాడు.

ఈ పురాణంలోని ప్రధానస్తోత్రాలు- శ్రీనివాసుణ్ణి దశ రథమహారాజు కీర్తించడం, శ్రీనివాసుణ్ణి సన్నుతిచేస్తూ చతుర్ముఖ బ్రహ్మచేసిన స్తోత్రం, సప్తర్షుల శ్రీనివాసప్రార్థన, బ్రహ్మదేవుడు కరుణావిభుడిగా శ్రీనివాసునిపై చేసిన స్తోత్రం, ఆగస్త్యఋషి చేసినప్రార్థన, సనకసనందనులు చేసిన ప్రార్థన, సూతమహర్షి చేసిన ప్రార్థన మహోజ్వలమైనవి.

## పద్మపురాణం

దేవల- దేవసందర్శన సంవాదరూపంలో ఉన్న ఈ పురాణంలో 24వ అధ్యాయం నుండి 84 అధ్యాయం వరకు శ్రీవేంకటాచలమాహాత్మ్యం లభిస్తోంది. పద్మపురాణంలో శ్రీవేంకటా చలప్రశంస, ఆకాశగంగ ఆవిర్భావం, పద్మసరోవరవర్ణన, స్వామి పుష్కరిణీ, పాండవతీర్థం, పద్మసరోవరం వంటి తీర్థాలప్రాశస్త్యం, శ్రీనివాస ప్రాదుర్భావం, శ్రీవరాహస్వామి ఆవిర్భావం, నీలకంఠా శ్రమవైభవం, నారాయణగిరిప్రభావం, లక్ష్మీదేవి ఆవిర్భావం, మొదలైనవి ప్రధానంగా వివరించబడ్డాయి. ఈ పురాణంలో శుకమహర్షి చేసిన శ్రీనివాస సన్నుతి, దశావతారప్రశంస, సాకారవర్ణన విశిష్టమైనవి. బ్రహ్మాదులు చేసిన క్షీరాబ్ధిశాయి స్తోత్రం, శేషాచలంపై శ్రీనివాసస్వామి దివ్యసాక్షాత్కారంకోసం బ్రహ్మాదులు చేసిన స్తోత్రం ఆనందనిలయవిమానంపై స్వామి సాక్షాత్కార స్తోత్రం మహాప్రశస్తమైనవి.

## గరుడపురాణం

గరుడపురాణం శ్రీమహావిష్ణువుకు గరుడునికి మధ్య జరిగిన సంవాదరూపమైంది. ఈపురాణంలోని 63వ అధ్యాయం శ్రీ వేంకటాచలమాహాత్మ్యాన్ని వివరిస్తుంది. ఇందులో ఆకాశ గంగ, పాపనాశనం, తుంబురుతీర్థంవంటి జలరాశుల పవిత్రతను, ప్రశస్తి వర్ణితం. శ్రీనివాస స్వామిపై అరుం ధతి చేసిన అతిమనోహరమైన స్తోత్రం వెలలేనివి.

## బ్రహ్మాండపురాణం

బ్రహ్మాండపురాణం భృగు- నారద సంవాదరూపమైంది. ఇందులో మొదటి నుండి పదకొండు అధ్యాయాలవరకు శ్రీవేంకటాచలమాహాత్మ్యం లభిస్తుంది. ఈ పురాణంలో వేంకటాచలానికున్న పేర్లూ, వాటి మహిమ, శేషుడు తపమాచరించి కొండగా మారడం, వ్యాఘ్రపాద వృత్తాంతం, క్రీడాచల సౌందర్యవర్ణన, నారాయణుడనే భక్తుని వృత్తాంతం, వృషభాసురుని యుద్ధప్రీతి, ఆంజనేయుని జన్మవృత్తాంతం, శ్రీనివాసస్వామి బ్రహ్మో త్సవం, అస్థికూటప్రభావ వృత్తాంతం,

### ధ్వజారోహణం (24-09-2025, సాయంత్రం)

**తమిళంలో ధ్వజస్తంభాన్ని 'కొడిక్కంబం' అని అంటారు. 'కొడి' అంటే జెండా. జెండా ఎగురవేసే స్తంభమని భావం. బ్రహ్మోత్సవప్రారంభసూచకంగా గరుడధ్వజపటాన్ని**



**పూజించి, ఆ పటాన్ని ధ్వజస్తంభం మీదికి ఎత్తించడం సంప్రదాయం. అలాగే బ్రహ్మో త్సవం ముగింపు సందర్భంగా "ధ్వజావ రోహణ" జరుపుతారు.**

**దేహమనే ఆలయానికి నాభివంటిది ధ్వజస్తంభం. శ్రీవారిఆలయంలో బ్రహ్మో త్సవం యజ్ఞహోమాలతో ప్రారంభమౌ తుంది. ధ్వజారోహణ సమయంలో శ్రీమలయప్పస్వామి ఉభయనాంచారు లతో తిరుమలరాయమండపానికి వేం చేస్తారు. గరుత్మంతుని రూపం చిత్రించిన నూతనకేతనాన్ని శ్రోత్రియులు వేదం పఠిస్తుండగా, మంగళవాద్యాలు మోగుతుండగా, ఆలయధ్వజస్తంభంపై ఎగురవేస్తారు. దీంతో బ్రహ్మోత్సవం మొదలైనట్టే! ఉత్సవాలకు బ్రహ్మసారథ్యం సంకేతంగా ఎలాంటి ఉత్సవమూర్తులు లేని ఖాళీ బ్రహ్మరథాన్ని ప్రతిరోజూ మలయప్పస్వామివారి ఊరేగింపు ముందు నడిపిస్తారు.**

సింహాదుని వృత్తాంతం మొదలైనవి ప్రధానంగా కనిపిస్తాయి. ఈ పురాణంలో నారాయణ విప్రుడి శ్రీనివాసస్తోత్రం, వృషభాసురుడు చేసిన స్తోత్రం, చక్రవర్తి చేసిన స్తోత్రం, దేవతలందరూ శ్రీనివాసుని చేసిన స్తోత్రం అతివిశిష్టమైనవి.

## మార్కండేయపురాణం

సూతమహర్షి- శౌనకాది ఋషులకు జరిగిన సంవాద రూపమైంది ఈ పురాణం. ఇందులో మొదటి నుండి ఐదు అధ్యాయాలలో శ్రీవేంకటాచలమాహాత్మ్యం ఉంది. ప్రధానంగా మార్కండేయమహర్షి తీర్థయాత్రావిధి, అగస్త్యుడు వర్ణించిన శేషాచలప్రశస్తి, బ్రహ్మ, రుద్రాదులు చేసిన శ్రీనివాసస్వామి వర్ణన. కుమారధారతీర్థ వైభవ వర్ణన ప్రధానమైనవి. ఈ పురాణంలో మార్కండేయుడు చేసిన శ్రీనివాసస్తుతి. స్కందుడు చేసిన శ్రీనివాసస్తోత్రం, శ్రీనివాసుని దర్శించిన వేళ భక్త్యావేశంతో స్కందుడు తిరిగి చేసిన స్తోత్రం మధురాతిమధురం.

## వామనపురాణం

ఇది పులస్త్య- నారద సంవాదరూపమైంది. ఈ పురాణంలోని 20వ అధ్యాయంనుండి 44వ అధ్యాయంవరకు శ్రీ వేంకటాచలమాహాత్మ్యం అభివర్ణించబడింది. ఈ పురాణంలో ప్రయాగమాహాత్మ్యం, కుమారస్వామి తిరుమలపై చేసిన తపస్సు, చక్రాది పదిహేడు తీర్థాల ప్రశస్తి, ఋషులకు శేషాచలంపై గోచరించే అద్భుతాలు, పుణ్యతీర్థాలు, స్వామిపుష్కరిణీ ప్రశంస, శంఖుడనే చక్రవర్తి వృత్తాంతం, ఉపరిచర వసువు గొప్పదనం, శేషాద్రి వాయువ్యభాగం నారాయణాద్రిగా గోచరించడం, అన్నదానప్రశంస, బ్రహ్మోత్సవవైభవం, జనక మహారాజు వృత్తాంతం ప్రధానమైనవి. ఇక వాయుదేవుడు చేసిన శ్రీనివాసస్వామి విశ్వరూపస్తుతి, బ్రహ్మదేవుడు చేసిన శ్రీహరిస్తోత్రం, శంభుడు చేసిన శ్రీనివాసస్తుతి, అగస్త్యమహర్షిచేసిన భగవత్‌స్తుతి, సప్తర్షులు చేసిన శ్రీనివాసస్తుతి, సనకాదులు చేసిన సన్నుతి, దిక్పాలకులు చేసిన స్తోత్రం, శ్వేతద్వీపసిద్ధులు చేసిన శ్రీనివాసస్తోత్రం, దేవతలు చేసిన శ్రీనివాస విజయోపచార స్తోత్రం అత్యంతమహిమాన్వితమైనవి.


తల్లీ, తండ్రీ
మనకు
శ్రీవేంకటేశ్వరుడే!!!

## బ్రహ్మపురాణం

బ్రహ్మ-మరీచి సంవాదరూపమైన ఈ పురాణంలో రెండు భాగాలున్నాయి. మొదటి ఖండంలోని మొదటి అధ్యాయంనుండి 20వ అధ్యాయంవరకు; రెండవ ఖండంలో 50, 51వ అధ్యాయాలలో శ్రీవేంకటాచలమాహాత్మ్యం సుప్రతిష్ఠితమైంది. ఈ పురాణంలో దుర్వాసుడు, దిలీపుడికి వేంకటాచలమాహాత్మ్యం వివరించడం, వాయువుకు, ఆదిశేషునికి మధ్య మహాకలహం, ఆదిశేషుని ఘోరతపస్సు, స్వామిపుష్కరిణీ మొ॥ తీర్థాల మాహాత్మ్యం, తొండమాన్ రాజు మాహాత్మ్యం, శ్రీవేంకటాద్రిపై దీపప్రజ్వలనం చేయడంవల్ల లభించేపుణ్యం, సర్వాబద్ధుని వృత్తాంతం, వేంకటాచలానికి వశిష్ఠుని రాక, అష్టషష్టి, ఘోణ, ధనదాది తీర్థాలు, ప్రత్యేకించి తుంబరుతీర్థ ప్రశంస వర్ణించబడ్డాయి. 7వ అధ్యాయంలో ఆరు శ్లోకాలలో దుర్వాస మహర్షి చేసిన భగవద్రూపవర్ణన స్తోత్రం అతి విలక్షణమైన స్తోత్రరత్నం.


**పెద్దశేషవాహనం**
**(24-09-2025, రాత్రి)**

**స్వామి నిత్యసూరివర్గంలో శేషుడొకడు. స్వామికి క్షీరసాగరంలో, పరమపదంలో గృహంగా, శయనమందిరంగా, పడుకగా, ఆసనంగా, పానుపుగా, వస్త్రంగా, దిండుగా, గొడుగుగా ఆయా అవసరాలకు తగినట్లు మారి, తన శరీరం మొత్తం శ్రీనివాసునకు అర్పించి కైంకర్యం చేసేమూర్తి. స్వార్థంలేని దాసకైంకర్యానికి 'శేషుడు' ప్రతీక. స్వామివారు కొలువుదీరిన ఏడుకొండల్లో శేషాద్రి ఒకటి, ధరించేది శేషవస్త్రం. అందుకే ఈ ఉత్సవాలలో శేషుడికి ప్రాధాన్యతనిస్తూ తొలిరోజు స్వామి వారు దేవేరులతో పెద్దశేషవాహనాన్నే అధిష్ఠించి తిరువీధులలో భక్తులను కటాక్షిస్తారు.**



**చిన్నశేషవాహనం**
**(25-09-2025 ఉదయం)**

**బ్రహ్మోత్సవంలో రెండవరోజు ఉదయం మలయప్ప మాత్రం ఊరేగేవాహనం చిన్న శేషవాహనం. ఈ వాహనంలో ఐదుపడగల శేషుడు ముఖ్యుడు. శ్రీరంగనాథస్వామి ఉత్సవ విగ్రహం కొంతకాలం తిరుమలలో ఉండేదని ప్రసిద్ధి. ఈ స్వామి గౌరవసూచకంగా చిన్నశేష వాహనం ఆచరణలోనికి వచ్చింది. అందువల్లే మలయప్ప మాత్రం ఊరేగడం! ప్రపంచ తత్త్వానికి సంకేతంగా పంచఫణాత్మకమైంది చిన్నశేషవాహనం. శేషునిపై ఊరేగే స్వామి వారిని దర్శిస్తే దుష్టశక్తులవల్ల కలిగే దుష్ఫలాలు తొలగి, భక్తులు సుఖశాంతులతో ఆనంద జీవు లౌతారు. శేషసర్పదర్శనం మహాపుణ్యప్రదం.**

## స్కాందపురాణం

ఈ పురాణం ఈశ్వర– స్కంద సంవాద రూపమైంది. ఈ పురాణంలోని ప్రథమభాగంలో 1నుండి 17వ అధ్యాయం వరకు, ద్వితీయ భాగంలో 37వ అధ్యాయంలో, తృతీయ భాగంలో మొదటినుండి 10 అధ్యాయాలలో, చతుర్థభాగంలో మొదటి రెండు అధ్యాయాలలో శ్రీవేంకటాచలమాహాత్మ్యం అభివర్ణించబడింది. ప్రధానంగా ఈ పురాణంలో పరీక్షిత్తు వృత్తాంతం, సుమతి, దృఢమతి, భద్రమతి, రామానుజుడు, పద్మనాభుడు, కేశవుడు, అర్జునుడు, శంఖనృపుడు, అంజన మొదలైన వారి వృత్తాంతాలు, రామకృష్ణ తీర్థం, ఆకాశగంగ, కటాహచక్ర, జాబాలి, ఘోణ, శంఖచక్ర, ఆకాశగంగ వంటి తీర్థాల ప్రశంస, శ్రీవేంకటాచలవర్ణన, సువర్ణముఖివైభవవర్ణన, అగస్త్య ఋషి ఆశ్రమానికి బ్రహ్మదేవునిరాక, సృష్ట్యాదివర్ణన విశేషంగా గోచరిస్తాయి. వేంకటాచలంలో చేయదగ్గ దానాల వర్ణన ఈ పురాణంలో స్పష్టంగా ప్రతి పాదితం. ఈ పురాణంలోని రామానుజ విప్రుడి స్తోత్రాలు అద్భుతమైన భక్తిరసస్ఫూర్తిని కలిగిస్తాయి.



చల్లగ కరుణించే
దైవం శ్రీనివాసుడు

## భాగవతపురాణం

శ్రీమద్భాగవతమహాపురాణంలో తిరుమలక్షేత్రప్రశస్తి గౌణంగా ప్రతి పాదించబడింది. కలిదోషాలను వేదవ్యాసుడు భాగవతంలో వివరించాడు. అలసులు, మందబుద్ధులు, అల్పతరాయువులు, సాధుద్వేషులు, ఉగ్రరోగ సంకలితులు, వేదాన్ని, అన్నాన్ని విక్రయించేవారు ఇలా మానవులు మహాపాప కర్ములై ఉంటారు. అయితే భాగవతం ఈ దుస్థితికి పరిష్కారాన్ని కూడా సూచిం చింది. పరీక్షిన్మహారాజు కలిని నిగ్రహించిన సందర్భంలో, కలి దీనవదనంతో ప్రార్థించి పరీక్షిత్తుద్వారా కొన్ని స్థానాలను పొందుతాడు. జూదం, దానం, అసత్యభాషణం, మదం, కామం, రజోగుణం, వైరప్రవృత్తి వంటివి ప్రధానమైనవి. ఈ సందర్భంలో ధర్మం ఎక్కడ నివసిస్తుందో, యజ్ఞం ఎక్కడ జరుగుతుందో, స్వయంవ్యక్తమూర్తియై యజ్ఞస్వరూపుడైన మహావిష్ణువు ఎక్కడ ఆరాధింపబడుతాడో అక్కడకు కలి వెళ్లకూడదని పరీక్షిత్తు శాసించాడు.

తిరుమల ధర్మదేవత తపస్సుచేసి ధన్యత నొందిన ప్రదేశం. అందుకే వృషాద్రి అని పేరు. "వృష" శబ్దానికి ధర్మమని అర్థం. వేదాలే శిలలైన తిరుమల యజ్ఞవిష్ణువు సప్తాంగాలతో సమకూరిన ప్రదేశమని కృష్ణయజుర్వేదంలోని మైత్రాయణీసంహిత "యజ్ఞేదేవేభ్యో" అనే మంత్రం ద్వారా స్పష్టపరచింది. ఇక ఆగమాలు శ్రీవేంకటేశ్వరస్వామి స్వయం వ్యక్తమూర్తిగా అవతరించిన కలియుగ ప్రత్యక్షపరమేశ్వరుడని నిరూపిస్తున్నాయి. తిరుమలేశుని సాలగ్రామ శిలాంతర్యామి త్వాన్ని, కలిదోషహరణాత్వాన్ని వేదం ద్వారా భాగవతం సుస్పష్టపరుస్తోంది.

## హరివంశపురాణం

మహాభారత ఖిలపర్వం హరివంశపురాణం. అందులోని శేషధర్మో పాఖ్యానంలో 48వ అధ్యాయంలో, భీష్మ– ధర్మరాజుల సంవాదంగా 'శ్రీ వేంకటా చల మాహాత్మ్యం' ఉంది. నారదాది ఋషులు శ్రీనివాసుణ్ణి సేవించడానికి శేషాచలానికి వెళ్లడం, వేంకటాచలంలోని మహాభక్తులచరిత్రలు, శ్రీనివాస సేవాదీక్ష ఇందులో అభివర్ణితం.

## భవిష్యోత్తరపురాణం

ఈ పురాణంలోని రెండుభాగాల్లోనూ, శ్రీవేంకటాచల మాహాత్మ్యం ప్రతిపాదితం. మొదటిభాగంలోని మొదటి 14 అధ్యాయాల్లోనూ, రెండవభాగంలోని 80వ అధ్యాయంలోనూ శ్రీవేంకటాచలమాహాత్మ్యం అభివర్ణించబడింది. ఈ 80వ అధ్యాయం శ్రీవేంకటేశ్వరభక్తులకు శిరోధార్యమైంది. చిత్తహరమైంది. శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రత్యక్షంగా దర్శనం చేసుకుంటున్నవేళ భాగవతులు ఈ అధ్యాయాన్ని పఠిస్తున్నారు. శ్రీనివాసవిభూతి ఈ రహస్యాధ్యాయంలోని ప్రత్యక్షరంలో నిబిడీకృతం. ప్రధానంగా ఈ పురాణంలో శ్రీనివాసాద్రి మాహాత్మ్యం, వృషభాచల, శేషాచలాది నామాలు ఏర్పడ్డ నేపథ్యం, శ్రీవారు తిరుమలచేరిన వైనం, శ్రీనివాస వనవిహారం, పద్మావతీజననం, శ్రీనివాసపద్మావతీ సమాగమం, వారి ప్రణయం, పరిణయం, తొండమానుడు, వసుదానుల కలహం, తిరుమల ఆలయనిర్మాణం, బ్రహ్మోత్సవాలు, భీముని వృత్తాంతం ఇందులోని అపూర్వమైన అంశాలు. ఇందులో శ్రీ శుకుడు, తొండమానుడు చేసిన స్తుతులు ప్రసిద్ధమైనవి. విశేషించి శుకమహర్షి ఈ పురాణంలో చేసిన అత్యంతమహిమాన్వితమైన దశావతారస్తుతి, శ్రీనివాససాక్షాత్కారస్తుతులు భాగవతులకు నిత్యస్మరణీయాలు.

## ఆగ్నేయపురాణం

వశిష్ఠ–నారద సంవాదరూపమైన ఈ పురాణంలోని 15వ అధ్యాయంలో శ్రీవేంకటాచలమాహాత్మ్యం ప్రతిపాదితం. శ్రీవేంకటేశ్వరస్వామి "దివ్యకవచస్తోత్రం" వేంకటరమణుడి స్వరూపాన్ని, దివ్యభూషణాలను 14 శ్లోకాలలో వివరిస్తోంది.

## ఆదిత్యపురాణం

సూత–శౌనక ఋషుల సంవాదరూపమైన, ఈ పురాణంలోని మొదటి ఐదు అధ్యాయాలలో శ్రీవేంకటాచల మాహాత్మ్యం ప్రతిపాదించబడ్డ తీరు అద్భుతావహం. శ్రీనివాసవిలాసవైభవం, దేవశర్మవృత్తాంతం, శ్రీనివాసస్వామి విగ్రహ విశ్వరూపాది వర్ణన, దేవశర్మ శ్రీనివాసస్వామిచే కటాక్షించబడటం ఇందులోని ప్రధానాంశాలు.

ఈ విధంగా పురాణాలు, ఉపపురాణాలు శ్రీవారి సగుణ, నిర్గుణనామ స్మరణలను, స్వరూపవర్ణనలను, దివ్యలీలలను, సేవలను, దానాలను, తిరుమలలోని తీర్థాలను, తిరుమల క్షేత్రపవిత్రతను బహుముఖంగా విశదపరిచాయి.

### హంసవాహనం
**(25-09-2025, రాత్రి)**

**బ్రహ్మోత్సవంలో రెండవరోజు రాత్రి మలయప్ప ఊరేగే వాహనం హంసవాహనం. వీణాపాణి, చదువులరాణి సరస సద్గుణనికురంబగా ప్రశస్తి కెక్కిన శారదాంబకు ప్రతిరూపంగా కల్పించిన రూపమే ఈ హంసవాహనం. హంస పాలలోని నీళ్లను వదలి, పాలను త్రాగే విధంగా భగవంతుడు పాపాలను క్షమించి, వాత్సల్యంతో దగ్గరికి చేరదీస్తాడని చెప్పడంకోసం ఈ హంసవాహనం. పరమాత్మ హంసవాహనంపై అనుగ్రహించడం జ్ఞానమార్గానికి తగిన అవధారణను చేకూరుస్తుంది. ఆత్మానాత్మ వివేకసూచకం హంసవాహనం. తిరుమంగైయాళ్వార్లు హంసవాహనాన్ని స్తుతించారు.**



### 2025, అక్టోబరు నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 01 | తిరుమల శ్రీవారి రథోత్సవం, మహానవమి |
| 02 | విజయదశమి, గాంధీజయంతి |
| 09 | అట్లతద్ది |
| 20 | నరకచతుర్దశి, దీపావళిపండుగ |
| 21 | కేదారగౌరీవ్రతం |
| 24 | తిరుమలనంబి శాత్తుమొఱ |
| 25 | నాగులచవితి |
| 27 | మనవాళమహాముని శాత్తుమొఱ |
| 28 | సేనైమొదలియార్ వర్షతిరునక్షత్రం |
| 30 | వేదాంతదేశికుల శాత్తుమొఱ; పిళ్లైలోకాచార్య, పొయ్‌గై ఆళ్వార్, అత్రి మహర్షుల వర్షతిరునక్షత్రాలు; తిరుమల శ్రీవారి పుష్పయాగం |
| 31 | పూదత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం, యాజ్ఞవల్క్య జయంతి |

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

గతసంచిక తరువాయి..

పాపాలను తన దర్శనమాత్రాన తొలగించగలిగింది వేంకటగిరి. గిరులలో వేంకటాద్రి సర్వశ్రేష్ఠమైంది. 'వేం' అన్నది పాపంకాగా, పాపమనే కట్టెలను 'కట' అనే రెండక్షరాలు కాల్చివేస్తాయి. అందుకే 'వేంకటగిరి' అని పేరు.

ఎవరైతే ప్రాతఃకాలంలో వేంకటాద్రిని స్మరణం చేస్తారో, వారికి నూరు గంగా స్నానఫలితాలు దక్కుతాయి. వారు వేయి రామేశ్వరసేతుయాత్రలు చేసినంత పుణ్యఫలాలు పొందుతారు. ఇవన్నీ విన్న జనకుడు వేంకటాద్రికి తక్షణమే వెళ్లాలని నిశ్చయించు కున్నాడు. ప్రముఖమంత్రులతో, కులపురహితునితో వేంకటాద్రి చేరి, స్వామి పుష్కరిణిలో పవిత్రస్నానం చేసి ఆ తీర్థాన్ని ఆనుకుని ఉన్న భూవరాహస్వామిని సేవించి, శ్రీనివాస సాన్నిధ్యంలో కొన్నిరోజులు వసించి, ఆపై మిథిలానగరం చేరుకున్నాడు.

వేంకటాద్రి దర్శనం వల్ల కలిగిన పుణ్యఫలితం కారణంగా జనకమహారాజు తన కుమార్తె సీతాదేవి వివాహాన్ని అంగరంగవైభవాదులతో అందరూ మెచ్చేలా చేశాడు. ఆ సమయంలో ఊర్మిళను లక్ష్మణుడు; మాండవిని భరతుడూ, శ్రుతకీర్తిని శత్రుఘ్నుడూ వివాహమాడారు. ఇదంతా వేంకటాద్రిమాహాత్మ్యం కథను భక్తితో వినడంవల్లనే సాధ్య మైందని జనకుడు సంతోషపడ్డాడు.


**సింహవాహనం** (26-09-2025 ఉదయం)

బ్రహ్మోత్సవంవేళ మూడవరోజు ఉదయం మలయప్ప, యోగనరసింహస్వామి రూపంలో ఊరేగేవాహనం సింహవాహనం. వనరాజు, మృగరాజు సింహం. గాంభీర్యా నికి, దక్షతకు ప్రతీక సింహం.



దుష్టశిక్షణ, శిష్టరక్షణలో భాగంగా దుర్మార్గు డైన హిరణ్యకశిపుని వధించి, ప్రహ్లాదుని రక్షించడానికి శ్రీమహావిష్ణువు ధరించిన అవతారం నరసింహావతారం. ఈ వృత్తాం తాన్ని భక్తులకు కనులకు కట్టినట్లు చూపిం చేందుకై 'సింహ' వాహన ఉత్సవం నిర్వహి స్తారు. వజ్రకిరీటం, చెవులకు రవ్వలపోగు, శ్రీవత్సం, లక్ష్మీకౌస్తుభం - ఈనాటి అలం కరణలోని ప్రత్యేకత.

తిరుమంగైయాళ్వారు ఈ వాహనాన్ని స్తుతించారు. అజ్ఞానంతో ప్రవర్ధించే దుష్టుల్నీ హరించడంలో నేనూ, సింహమూ సమానప్రయత్నంలో ఉంటామని స్వామి నిరూపించడం ఈ వాహన ఉద్దేశం.



ఈ వృత్తాంతాన్ని సూతుడు మనవి చేయగా శౌనకాది మునులు "మహామునీ! బ్రహ్మదేవుడు శ్రీవేంకటాద్రీశ్వరునికి పవిత్రహృదయంతో రథోత్సవం చేశాడని ముందుగా మీరు సెలవిచ్చారు. కమలా క్షుడు ఎంతకాలం శేషాద్రిమీద నివాస మున్నాడ"ని మునులు ప్రశ్నించారు. అందుకు సమాధానంగా సూతుడు "మునులారా! శ్రీహరి కలియుగాంతం దాకా శేషాద్రి మీదనే గడిపాడ"ని సమా ధానం చెప్పాడు.

శ్రీవేంకటేశ్వరుడు ప్రాకృతజనుల మధ్యనే ఉండి అప్రాకృతజనుల మధ్యనే ఉండి అప్రాకృతప్రభలతో అందరినీ ఆక ర్షించాడు. తాను కొండమీదున్నా, వైకుంఠ వైభవాన్ని తలుచుకుంటూ కాలం గడి పాడు. శ్రీ, భూ, నీళాదేవులతో స్వామి మాయాని గూఢవిమానమెక్కి వైకుంఠ

పురం చేరుకున్నాడు. అక్కడి నిత్యముక్తులను చూచి ఆనందించాడు. అప్రాకృత మణిమయ అంతఃపురంలో శేషతల్పంపై పవళించాడు. ఆ సమయంలోనే శేషాద్రి లోని వరాహస్వామి విశ్వకర్మ నిర్మితమైన పట్టణాన్ని అంతర్ధానం చేయించాడు. ఆపై, వృషభాసురునితో యుద్ధంచేయడానికి కదిలాడు. ఇలా అనేక సంవత్సరాలు గడవగా, నారదుడు వేంకటాద్రికి వచ్చి శ్రీనివాసస్వామి వైకుంఠానికి మరలి వెళ్లాడనే వృత్తాంతాన్ని తెలుసుకుని, సరాసరి సత్యలోకానికి వెళ్లి బ్రహ్మదేవుని దర్శించాడు. "చక్రాయుధుడైన స్వామి శేషాద్రిని శ్వేతవరాహునికి అప్పగించి, వైకుంఠపురానికి వెళ్లిపోయాడని చెబితే బ్రహ్మదేవుడు చాలా బాధపడ్డాడు. "నారదా! శేషాచలంమీద నారాయణుడున్నంతకాలం భూజనులు సాత్త్వికులుగానే జీవించారు.

శ్రీహరి వైకుంఠం చేరుకోవడంతో ఆ స్వామికి నేను సంకల్పించిన రథోత్సవాన్ని వరాహదేవుడొక్కడే నిర్వహించలేడు. ఆ శ్రీనివాసుడే శేషాద్రిలో తప్పక ఉండాలి. అందుకనుగుణంగా వసుదేవ, దశరథుల తేజస్సులను తింత్రిణీ వృక్షాలుగా(చింతచెట్లుగా) నేను సృష్టిస్తాను. దేవకి కళను, కౌసల్యకళను ఒక పుట్టలాగా తీరుస్తాను. ఆ పుట్టలో శ్రీనివాసుడు చేరేలాగా ఏదైనా ఒక ఉపాయం ఆలోచించు. వనజాక్షుడు ఆ కొండ చేరిన తర్వాత మునుపటిలాగే నేను జనహితంగా రథోత్సవాన్ని నిర్వహిస్తాను.

భూలోకంపై శ్రీనివాసుడు లేని కారణంగా మానవులు దుష్కర్ములయ్యారు. కలిమాయకు లోబడ్డారు, సత్కర్మలకు దూరమయ్యారు. స్వామే మరలా రాకుంటే భూలోకవాసుల్ని యముడు నరకంలో పడేస్తాడు. అంచేత ఎలాగైనా శ్రీహరిని మరల శేషపర్వతం చేరే లాగున ఉపాయం ఆలోచించు?" అనగానే నారదుడు బ్రహ్మపాదాలకు నమస్కరించాడు. ఆ పై గంగానదీ తీరంలో యాగాలు చేస్తున్న కశ్యపాదుల దగ్గరికి కదిలివెళ్లాడు. వీణ మీటుతూ నారాయణ స్మరణచేసుకుంటూ యజ్ఞవాటికకు విచ్చేసిన నారదుణ్ణి కశ్యపాదులు విశేషమర్యాదలతో గౌరవించారు. ఆ సందర్భంలో నారదుడు అమాయకంగా మునివరులను చూచి–

"మహాత్ములారా! లోకసంక్షేమార్థం మీరెన్నో యాగాలు చేస్తున్నారు. ఈ యాగాల ఫలితాలను ఎవరికి అర్పిస్తున్నారో చెప్పవలసింది"గా కోరాడు. ఈ హఠాత్ ప్రశ్నకు మునులు తెల్లమొహం వేశారు.



వేడుకుంటే
దయ తలిచే దైవం
శ్రీ వేంకటరమణుడు

ఆపై భృగుమహర్షితో యాగఫలభోక్తను గురించి సుదీర్ఘంగా తర్కించారు. అయినా సమాధానం చెప్పలేక పోయేసరికి నారదుడు తన వీణలో అష్టాక్షరీ మంత్రాన్ని పలికిస్తూ– "ప్రజాపతులారా! మీరు సత్రక్రతువులు చేసి, సర్వ లోకాలలో ప్రజాభివృద్ధిచేశారు. అందువల్ల మేలయ్యింది. అసలు మోక్షప్రదుడు ఎవ్వడనుకుంటున్నారు, బ్రహ్మనా? పద్మాక్షుడా? లేక పరమశివుడా? వీరిలో ముక్తి ప్రదుడైన మూర్తికి యజ్ఞఫలాన్ని అర్పించి సంతుష్టి పొందండి" అని చెప్పి ఆ ప్రదేశం నుండి నిష్క్రమించి, త్రిలోక సంచారానికి కదలివెళ్లాడు. బ్రహ్మదేవుడు కూడా శేషాద్రిలో ఒక పుట్టను, రెండు తింత్రిణీ వృక్షాలను సృష్టించాడు. *(ఇంకా ఉంది)*



**ముత్యపుపందిరివాహనం**
**(26-09-2025, రాత్రి)**

**బాలకృష్ణుని అవతారరూపంలో ఈ వాహనంమీద మలయప్పస్వామి ఉభయ నాంచారులతో తిరువీథులలో సంచరిస్తారు.**

**స్వచ్ఛమైన శుద్ధసత్త్వగుణానికి 'ముత్యం' సంకేతం. 'ముక్త' శబ్దానికి ముత్యమనే కాక- విడువబడింది, మోక్షం అనే అర్థాలు ఉన్నాయి. కనుక, ముత్యాలరూపంలో స్వామిని పరివేష్టించి ఉండేది- ముక్తికాంక్షాపరులైన నిత్యసూరులు. నిత్యసూరులందరూ ముత్యాల వలె శుద్ధసత్త్వులు. వాళ్లు సర్వదా శ్రీవారిని సేవిస్తూ, సత్త్వగుణ శోభితులై ఆనందిస్తూ ఉంటారు. మోక్షం కావాలంటే శ్రీవిష్ణువును అర్థించాలి కనుక నిర్మలాంతః కరణంలో, ముత్యాలవలే శుద్ధులై స్వామిని సేవిస్తే జీవులు ముక్తజీవులు అవుతారనే విశేషాన్ని ఈ ముత్యాలపందిరి సూచిస్తోంది.**

ఈ నెల 4వ తేది శ్రీవామనజయంతి...

# మూడో అడుగు!

– శ్రీ డి.వి.ఆర్.భాస్కర్

బలిచక్రవర్తి మహాబలవంతుడు. జన్మరీత్యా రాక్షసుడైనప్పటికీ సత్యం, దానం, ధర్మం అనే గుణాల వల్ల సత్ప్రవర్తనతో మహాదాతగా, గొప్పవాడిగా పేరు తెచ్చుకున్నాడు. అయితే రాక్షస సహజమైన ప్రవృత్తి వల్ల దేవతలపై దండెత్తి, వారిని జయించి, నిర్దయగా వారిని వెళ్లగొట్టి, వారి రాజ్యాలను ఆక్రమించుకుని అందరినీ తన చెప్పుచేతుల్లో ఉంచుకున్నాడు. అంతటితో తృప్తిపడక ఇంద్రపదవిమీద కన్నేశాడు. ఇంద్రపదవి కావాలంటే బలపరాక్రమాలతో పాటు యజ్ఞయాగాదులు కూడా చేయాలని, నూరు అశ్వమేధయాగాలు చేస్తే ఇంద్రపదవి లభిస్తుందని రాక్షసుల గురువైన శుక్రాచార్యులవారి సూచనమేరకు 99 అశ్వమేధయాగాలు చేశాడు. మరొక్కమారు అశ్వమేధం చేస్తే చాలు ఇంద్రపదవి బలిచక్రవర్తి వశమౌతుంది.

దాంతో ఇంద్రుడికి భయం పట్టుకుంది. బలిచక్రవర్తి ఒక్కడు మంచివాడు కావచ్చు కానీ మిగిలిన రాక్షసులు అలా కాదు కదా, తమ రాజు అండ చూచుకుని లోకాలన్నింటినీ నానాయాతనలకు గురిచేస్తారు. కదా, మరి అప్పుడేం చేయాలి? అనుకుంటూ దుష్టశిక్షకుడు, శిష్టరక్షకుడు అయిన విష్ణుమూర్తిని ఆశ్రయించాడు ఇంద్రుడు.

విష్ణువు అతడికి అభయమిచ్చాడు. దీనికితోడు రాక్షసులచేతిలో పరాజితులైన దేవతలతల్లి అదితి తన కుమారుల దీనస్థితికి తల్లడిల్లి, భర్త అయిన కశ్యపునితో మొరపెట్టుకుంది. కశ్యపుడు ఆమెకో దివ్యవ్రతాన్ని చెప్పి ఆచరింపజేశాడు. ఆ వ్రతఫలితంగా సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే ఆమె కడుపున వామనుడై పుట్టారు. బలిచక్రవర్తి నూరో అశ్వమేధ యాగం చేస్తున్న సమయానికి ఆ యాగానికి వెళ్లాడు. బ్రహ్మ తేజస్సుతో ముచ్చటగొలుపుతున్న ఆ బాలవటువును చూచిన బలిచక్రవర్తి ఏమి కావాలో కోరుకోమన్నాడు. మూడంటే మూడడుగులచోటు కావాలన్నాడు వటువు. అతను, అంత అల్పమైన, చిత్రమైన కోరిక కోరినందుకు అబ్బురపడ్డ బలిచక్రవర్తి మరేదైనా కోరుకోమన్నాడు. తనకు మూడడుగుల చోటు తప్ప మరేదీ వద్దన్నాడు వామనుడు. ఆబాల బ్రహ్మచారి కోరికకు అబ్బురపడుతూనే సరేనని అంగీకరించాడు బలి. అప్పుడు రాక్షసగురువు శుక్రాచార్యుడు బలి చక్రవర్తితో "ఆ వచ్చినవాడు సాక్షాత్తూ విష్ణువేనని, నీ రాజ్యాన్ని అపహరించి, నిన్ను పరాభవం చేయడానికే వచ్చాడని, కొన్ని సందర్భాల్లో అసత్యం చెప్పినా దోషం కాద"ని చెప్పి, ఆ దాన కార్యక్రమాన్ని వారించేందుకు ప్రయత్నించాడు.



తోడు నీడై
కరుణచూపే దైవం
శ్రీనివాసుడు

బలి అందుకు అంగీకరించలేదు. సాక్షాత్తూ విష్ణువే తన ముందు వామనుడై చేతులు చాచి అర్థించడం, దానికి తాను సరే ననడం తనకెంతో గర్వకారణమని



**కల్పవృక్షవాహనం** (27-09-2025 ఉదయం)

బ్రహ్మోత్సవంవేళ నాలుగోరోజు ఉదయం మలయప్ప శ్రీదేవీభూదేవులతో ఊరేగే వాహనం కల్పవృక్షవాహనం. ఇది 'రాజమన్నార్ అవతారం'. కల్పవృక్షం, కామధేనువు, చింతామణి మొదలైనవి కోరిన కోరికలను ప్రసాదిస్తాయని నమ్మకం. తనను శరణుజొచ్చిన భక్తులకోరికలను స్వామి నెరవేరుస్తారని చెప్పడానికే కల్పవృక్ష వాహనంపై స్వామిని ఊరేగిస్తారు. కల్పవృక్షం సకలఫల ప్రదాయకం. అన్నివృక్షాలు ఆయా ఫలాలనిస్తే కల్పవృక్షం అన్ని వృక్షాల ఫలాలను కోరిన వెంటనే ఇవ్వగలదు. అలాంటి కల్పవృక్షాలకు ప్రభువు శ్రీనివాసుడు అని అంతరార్థం. ఈ కల్పవృక్షవాహనోత్సవం భూలోకాన్ని దేవలోకంగా శోభిల్లజేసే మహోత్సవం.

అతిశయంతో అంటూ వామను డడిగిన మూడడుగుల భూమిని ఇచ్చేందుకు దానపాత్ర చేత పుచ్చుకున్నాడు. కనీసం అప్పుడైనా ఆపుదామని శుక్రాచార్యుడు సూక్ష్మరూపంలో దానపాత్రలో ప్రవేశించి, దాని నుంచి నీరు పడకుండా అడ్డుకున్నాడు. అప్పుడైనా అసలు విషయం గ్రహించని బలి అలాగే చూస్తుండిపోవడంతో వామనుడు పాత్రకు ఏదో అడ్డుపడిందంటూ తన చేతనున్న దర్భపుల్లతో పొడిచాడు. దాంతో శుక్రాచార్యుడు కన్నుపోయి, ఒంటి కంటి వాడయ్యాడు. దానధార నేలమీద పడడంతోటే వామనుడు త్రివిక్రమ రూపం ధరించి, అభోవీధివరకు వ్యాపించాడు. ఒక అడుగుతో నేలను, రెండోఅడుగుతో ఆకాశాన్ని ఆక్రమించేసి, మూడో అడుగు ఎక్కడ వేయాలని అడిగాడు. బలిచక్రవర్తి తన శిరస్సు చూపడంతో, పాతాళానికి అణగదొక్కేశాడు.


**సర్వభూపాలవాహనం** (27-09-2025, రాత్రి)

ఏడడుగుల ఎత్తు, పూర్తిగా బంగారురేకులతో నిర్మించిన వాహనం 'సర్వభూపాలవాహనం'. 'సమరభూపాల వాహన' మన్న పేరు శాసనంలో కనబడుతుంది. మట్ల కుమార అనంతరాయలు ఇచ్చిన వాహనాలలో ఇది ఒకటి.



సమస్తరాజలాంఛనాలతో ఈ వాహన సేవ ఉంటుంది. అన్ని భువనాలకు ప్రభువు, బ్రహ్మరుద్రేంద్రాది దేవతలకు అధిపతి అయిన శ్రీనివాసుడు సర్వభూపాలవాహనంపై అధిష్ఠించి దర్శనభాగ్యాన్ని కల్పించడం "శ్వాశ్వత సార్వభౌములం మేము" అని విర్రవీగే మదాంధులకు గుణపాఠం చెప్పి, సర్వోత్తమత్వాన్ని సర్వాధారత్వాన్ని, సర్వస్వామ్యత్వాన్ని ప్రతిపాదించడమే ఈ వాహన అంతరార్థం.

ఇక్కడ ఒక సందేహం తలెత్తవచ్చు. దానశీలిగా పేరు పొందిన బలిచక్రవర్తిని పాతాళానికి తొక్కెయ్యడం ఎంతవరకు సమంజనమని... బలి ఎంతో మంచివాడు, మరెంతో సత్యసంధుడు కావచ్చు, శౌర్యపరాక్రమాలలో ముల్లోకాలలోనూ ఎవరికీ సాటిలేని వాడు కావచ్చు. అయితే రాక్షసగుణాలు కలవాడు. దేవతలందరినీ జయించి, వారిని తరిమికొట్టాడు. భవిష్యత్తులో ఇంద్రపదవి లభిస్తుందనే వరం ఉన్నప్పటికీ, ఇంద్రపదవిని చేజిక్కించుకునేందుకు ఇప్పటినుంచే ప్రయత్నాలు చేశాడు. అంతటితో తృప్తిచెందక భవిష్యత్తులో బ్రహ్మ కావడంకోసం రహస్యంగా అనేక యాగాలు చేశాడు. సాక్షాత్తూ విష్ణుమూర్తే తన నుంచి దానం గ్రహిస్తున్నాడని అతిశయించాడు. అందుకే విష్ణువు వామనమూర్తిగా మారి అతని అహాన్ని పాతాళానికి తొక్కేశాడు.



అయితే, అతని మంచితనానికి, సత్యసంధతకు సంతోషించి, పాతాళలోకానికి చక్రవర్తిని చేశాడు. ఏడాదికో సారి అంటే దీపావళి అమావాస్య మరునాడు భూలోకానికి వచ్చి, తన ప్రజలను చూసేలా వరమిచ్చాడు. అదే బలిపాద్యమి. ఎంతటి గొప్పవాడైనప్పటికీ అతని ఉన్నతిని అణచివేయడానికి అహం ఒక్కటి ఉంటే చాలు అనేందుకు ఇదే ఉదాహరణ.

# మంచి జరగాలంటే..!

- డా|| కె.వి.రాఘవాచార్య

ఈ కలియుగంలో నామసంకీర్తనం వల్లనే భగవదనుగ్రహం కలుగుతుంది. ఇందుకు భగవంతుని గుణ, రూప, క్రియా మహిమలను వర్ణించే స్తోత్రాలు సహాయకారిగా ఉంటాయి. ఈ స్తోత్రాలు భగవద్విభూతిని, భగవంతునితత్త్వాన్ని వర్ణిస్తుంటాయి. అలాంటి స్తోత్రాలలో శ్రీనివాసతారావళి ఒకటి.

కలియుగదైవం శ్రీవేంకటేశ్వరుని రూప, గుణ మహిమల్ని వర్ణించిన పన్నెండుపురాణాలలో ఆదిత్యపురాణం ఒకటి. ఇందులోని ఐదు అధ్యాయాల్లో శ్రీవేంకటేశుని వైభవ మాహాత్మ్యాలు వర్ణించబడ్డాయి. ఇందులో దేవశర్మ కథ ప్రధానం. శ్రీవేంకటాచలయాత్ర చేసిన దేవశర్మ, స్వామిని దర్శించుకున్నప్పుడు చేసిన స్తోత్రాలే శ్రీనివాసతారావళి. ఈ స్తోత్రాలను పారాయణంచేసిన దేవశర్మ స్వామివారి అనుగ్రహంతో దారిద్ర్య బాధలనుండి విముక్తుడై అష్ట ఐశ్వర్యసంపన్నుడై ఇహపర సుఖాల్ని పొందాడు. తారలంటే నక్షత్రాలు. అవి ఇరవై ఏడు. అలా ఇరవైఏడుశ్లోకాలతో పరిపూర్ణమైన చిన్నకావ్యం తారావళి. ఈ తారావళిస్తోత్రం, దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం శ్రీమహావిష్ణువు ధరించిన దశావతారాల వైభవాన్ని వైవిధ్యభరితంగా వర్ణించింది. ఈ స్తోత్ర పారాయణం సర్వ పాపహరం, సకలపుణ్యప్రదం.



స్వామి దీవెనలు
భక్తుల కొరతలు
తీర్చుతాయి

## ధ్యానం

**శ్రీ వేంకటాచలాధీశం శ్రియాధ్యాసిత వక్షసం**
**శ్రితచేతన మందారం శ్రీనివాసమహం భజే**

శ్రీవేంకటమనే పర్వతానికి ప్రభువు, లక్ష్మీదేవిని వక్షఃస్థలంపై ధరించినవాడు, ఆశ్రితులకు కల్పవృక్షం అయిన శ్రీనివాసుణ్ణి ఎల్లప్పుడూ కొలుస్తాను.

**శ్రీవేంకటేశంమత్స్వామిన్ జ్ఞానానంద దయానిధే।**
**భక్తవత్సల భో విశ్వకుటుంబి న్నధునాఽవమామ్॥**

ఓ వేంకటేశా! జ్ఞానం, ఆనందం, దయ అనువాటికి ఆశ్రయుడవు. ఓ భక్తవత్సలా! ఈ ప్రపంచమంతటినీ స్వకుటుంబంగా భావించి ధరించేవాడవు నీవే. నా స్వామియైన వేంకటేశా! నన్ను రక్షించి, అనుగ్రహించు.

**శ్రవణాత్సర్వపాపఘ్నం మననాత్పుణ్య వర్ధనం**
**స్వధ్యానాత్సిద్ధిదం విష్ణుం ప్రేక్షణాత్మోక్షదం భజే॥**

మహిమలను విన్నంత మాత్రానికే సర్వపాపాలను పోగొట్టేవాడు. వాటిని మరలమరలా తలపోయడంవల్ల పుణ్యాన్ని వృద్ధి చేసేవాడు, మరలమరలా వాటిని ధ్యానించడం వల్ల

**మోహినీ అవతారం** (28-09-2025 ఉదయం)

బ్రహ్మోత్సవంలో ఐదవరోజు ఉదయం మలయప్పవారు 'మోహినీ'రూపంలో దంతాల పల్లకీలో తిరువీధులలో ఊరేగుతారు. తోడుగ శ్రీకృష్ణస్వామి మరొక పల్లకీవాహనంలో కొంచెం వెనుక వస్తారు. ఉత్సవమూర్తి మామూలుగా నిలబడే భంగిమలో కాకుండా ఆసీనులైన భంగిమలో కనిపించడం విశేషం. స్త్రీలు ధరించే అన్ని ఆభరణాలతో స్వామివారిని అలంకరించడం ఒక ప్రత్యేకత. సాధారణంగా వరదభంగిమలో కనిపించే స్వామివారి కుడిహస్తం మోహినిఅలంకరణలో అభయహస్తముద్రతో ఉండడం ఒక ప్రత్యేకత. స్వామివారికి పట్టుచీర, కిరీటంపైన రత్నఖచితమైన సూర్యచంద్రసావేరి, నాసికకు వజ్రఖచితమైన ముక్కుపుడక, బులాకి, శంఖచక్రాలస్థానంలో రెండు వికసించిన స్వర్ణకమలాలు అలంకరిస్తారు. క్షీరసాగరం మథించిన తర్వాత, వచ్చిన అమృతాన్ని అతిలోక మోహనమైన స్త్రీరూపం ధరించి, దేవతలకు ప్రదానం చేసిన జగన్మోహనరూపమే మోహినీ అవతారం. భౌతికంగా జగన్మోహకత్వాన్నీ, ఆధ్యాత్మికంగా మాయాతీతశుద్ధ సత్త్వస్వరూప సాక్షాత్కారాన్నీ సిద్ధింపజేసే అవతారమిది.



సమస్తసిద్ధులను ఇచ్చేవాడు, చూసినంతమాత్రానికే మోక్షాన్నిచ్చే విష్ణుదేవుణ్ణి సేవిస్తాను.

## తారావళి

01) శ్రీ వేంకటేశం లక్ష్మీశం అనిష్టఘ్న మభీష్టదం
చతుర్ముఖాఖ్యతనయం శ్రీనివాసం భజేఽనిశమ్॥

(రెండుసార్లు పఠించాలి)

ఓ వేంకటాచలపతీ! లక్ష్మీనాథా! నువ్వు భక్తుల అనిష్టాలను తొలగించి అభీష్టాలను ఇచ్చేవాడవు. నాలుగు ముఖాల బ్రహ్మ నీకుమారుడు. ఓ శ్రీనివాసా! నిన్ను ఎల్లప్పుడూ సేవిస్తాను.

02) యదాపాంగలవేనైవ బ్రహ్మాద్యాః స్వపదం యయుః
మహారాజాధిరాజానం శ్రీనివాసం భజేఽనిశమ్॥

ఎవరి కృపాకటాక్షాలచే బ్రహ్మాది దేవతలు ఉత్తమ స్థానాలైన సత్యలోకాదులకు ఆధిపత్యాన్ని పొంది ఉన్నారో, ఆ బ్రహ్మాదులనే రాజులకు చక్రవర్తి అయిన శ్రీనివాసుణ్ణి ఎల్లప్పుడూ సేవిస్తాను.

03) అనంతవేద సంవేద్యం నిర్దోషం గుణసాగరం
అతీంద్రియం నిత్యముక్తం శ్రీనివాసం భజేఽనిశమ్॥

అనంతాలైన వేదాలచే తెలియదగినవాడు, దోష గుణాలు లేనివాడు, జ్ఞానానందాది శుభగుణాలతో పరిపూర్ణుడు, నేత్రాది ఇంద్రియాలకు కనిపించనివాడు, నిత్య ముక్తుడు ఐన శ్రీనివాసుణ్ణి ఎల్లప్పుడూ సేవిస్తాను.

04) స్మరణాత్ సర్వపాపఘ్నం స్తవనాత్ ఇష్ట వర్షిణమ్
దర్శనాన్ముక్తిదం చేశం శ్రీనివాసం భజేఽనిశమ్॥

నామస్మరణచే సమస్తపాపాలను హరించేవాడు, స్తోత్రం చేయుటచే భక్తులకు అభీష్టాలను ఇచ్చేవాడు, దర్శనం వల్ల ముక్తి నిచ్చువాడు, సర్వస్వామి అయిన శ్రీనివాసుణ్ణి ఎల్లప్పుడూ కొలుస్తాను.

05) అశేష శయనం శేష శయనం శేషశాయినం
శేషాద్రీశ మశేషం చ శ్రీనివాసం భజేఽనిశమ్॥

ప్రపంచంలోని అన్నివస్తువులయందు శయనించి ఉన్నవాడు, సకలచేతనులహృదయాలలో శయనించి ఉన్నవాడు, ఆదిశేషునిపై శయనించి ఉన్నవాడు, శేషాచలానికి ఆధిపతి, సర్వమూ తానే అయిన శ్రీనివాసుణ్ణి సేవిస్తాను.

06) భక్తాను గ్రాహకం విష్ణుం సుశాంతం గరుడధ్వజం
ప్రసన్నవక్త్రనయనం శ్రీనివాసం భజేఽనిశమ్॥

తన భక్తులను అనుగ్రహించేవాడు, అంతటా వ్యాపించి ఉన్నవాడు, సజ్జనులకు సుఖాలను కలిగించేవాడు, గరుత్మంతుడు ధ్వజంగా కలవాడు, భక్తులను అనుగ్రహించేటపుడు

### గరుడవాహనం (28-09-2025 రాత్రి)

బ్రహ్మోత్సవాలలో అయిదోరోజురాత్రి మలయప్పస్వామి ఊరేగేవాహనం గరుడవాహనం. మూలవిరాట్టుకున్న మకరకంఠి, లక్ష్మీహారం మొదలైన వాటిని ఉత్సవమూర్తులకు అలంకరించడం ఈ వాహనం నాటి ప్రత్యేకత. తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుండి ఆండాళ్ అలంకరించుకున్న పూలమాలను స్వామికి అర్పించడం మరో ప్రత్యేకత.



అలాగే, కాలినడకన చెన్నైనుండి తెచ్చిన గొడుగుల్ని ఈ స్వామి గ్రహించడం, ఊరేగించడం ఇంకొక ప్రత్యేకత. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారు ఆనవాయితీగా పట్టువస్త్రాలు పంపడం, స్వామివారు ధరించడం మరొక ప్రత్యేకత.

కొత్తగొడుగులనీడలో, బంగారుగరుడునిపై వేంచేసి, వరదహస్తుడైన స్వామిని తిరువీథులలో ఊరేగించడం రమణీయ దృశ్యం. పదిరోజులు జరిగే బ్రహ్మోత్సవాలలో ఇది శిఖరాయమానం. గరుత్మంతుడు నిత్యసూరి, స్వామికి దాసుడు, సఖుడు, వాహనం, పతాక చిహ్నం. గరుత్మంతునికి తెలియని స్వామి రహస్యాలు లేవు. గరుడుని 'పెరియతిరువడి' అనడం శ్రీవైష్ణవ సంప్రదాయం.

వేదపురుషుడైన శ్రీనివాసుడు వేదాలకు ఆత్మవంటివాడైన గరుడునిపై అధిష్ఠించి ఉండగా, వైఖానస ఆగమోక్త అర్చకస్వాములు రాజోపచారాలు చేస్తుండగా ఆకాశంలో దేవతలు బారులు తీరి స్వామిపై పుష్పవర్షం కురిపిస్తారనేది ప్రతీతి. తొండరడిప్పొడిఆళ్వారు, తిరుమంగైయాళ్వారు స్తుతించిన వాహనమిది.



స్వామి దయవల్లే ప్రపంచానికి వెలుగు

ప్రసన్నాలైన నేత్రాలు, ముఖంగల వాడైన శ్రీనివాసుణ్ణి నిత్యం సేవిస్తాను.

**07) భక్త భక్తి సుపాశేన బద్ధ సత్పాదపంకజం**
**సనకాది ధ్యానగమ్యం శ్రీనివాసం భజేஉ నిశమ్॥**

తన భక్తుల యొక్క భక్తి అనే దారంచే బంధింపబడ్డ పాద పద్మాలు కలవాడు, సనకసనంద నాదియోగులకు ధ్యానంచే కను పించేవాడు అయిన శ్రీనివాసుణ్ణి ఎల్లప్పుడూ సేవిస్తాను.

**08) గంగాదితీర్థ జనక పాదపద్మం సుతారకం**
**శంఖచక్రాభయ వరం శ్రీనివాసం భజేஉ నిశమ్**

గంగాది పుణ్యతీర్థాలకు జన్మస్థానమైన పాదపద్మాలు కలవాడు, భక్తులను సంసారసముద్రం నుండి తరింపజేసేవాడు, శంఖు, చక్ర, అభయ, వరదముద్రలను నాలుగు చేతులలో ధరించినవాడు అయిన శ్రీనివాసుణ్ణి ఎల్లప్పుడూ సేవిస్తాను.

**09) సువర్ణముఖి తీరస్థం సువర్ణేద్యం సువర్ణదం**
**సువర్ణాభం సువర్ణాంగం శ్రీనివాసం భజేஉ నిశమ్**

సువర్ణముఖీనది తీరంలో నివసించేవాడు, సువర్ణాలు గల వేదాలచే స్తుతింపబడ్డవాడు, భక్తులకు సంపదల్నిచ్చువాడు. బంగారుఛాయవంటి ప్రకాశం కలవాడు, సువర్ణమయమైన కిరీట, కుండలాద్యాభరణాలచే అలంకరింపబడ్డ శరీరభాగాలు గల శ్రీనివాసుణ్ణి నిత్యం సేవిస్తాను.

**10) శ్రీవత్స వక్షసం శ్రీశం శ్రీలోలం శ్రీకరగ్రహం**
**శ్రీమంతం శ్రీనిధిం శ్రీద్యం శ్రీనివాసం భజేஉ నిశమ్**

శ్రీవత్సం వక్షఃస్థలంలో కలవాడు, లక్ష్మీదేవికి భర్త, లక్ష్మీవిలాసాలలో ఆసక్తిగలవాడు, శ్రీదేవిని వివాహమాడిన వాడు, శ్రీమంతుడు, శ్రీనిధి, శ్రీదేవిచే స్తుతింపబడ్డవాడు అయిన శ్రీనివాసుణ్ణి సేవిస్తాను.

**11) వైకుంఠవాసం వైకుంఠత్యాగం వైకుంఠ సోదరం**
**వైకుంఠదం వికుంఠాజం శ్రీనివాసం భజేஉ నిశమ్**

వైకుంఠవాసుడు, భక్తుల కోసం వైకుంఠాన్ని విడిచి వేంకటాద్రికి వచ్చినవాడు, వైకుంఠుడు అనే పేరుగల సోదరుడు కలవాడు, భక్తులకు ఎల్లప్పుడూ మోక్షాన్ని ఇచ్చేవాడు, రైవత మన్వంతరంలో శుభ్రుని భార్య అయిన వికుంఠా అనే తల్లి గర్భంలో జన్మించినవాడైన శ్రీనివాసుణ్ణి సదా సేవిస్తాను.

## దశావతారస్తుతి

**12) వేదోద్ధారం మత్స్యరూపం స్వచ్ఛాకారం యదృచ్ఛయా**
**సత్యవ్రతోద్ధరం సత్యం శ్రీనివాసం భజేஉ నిశమ్**

తన ఇష్టప్రకారం మత్స్యరూపాన్ని ధరించి, వేదాలను అపహరించిన సోమకాసురుణ్ణి సంహరించి వేదాలను ఉద్ధ రించినవాడు, జలప్రళయకాలంలో సత్యవ్రతుడనే రాజర్షిని



**హనుమద్వాహనం** **(29-09-2025, ఉదయం)**

బ్రహ్మోత్సవాలలో ఆరవనాటిఉదయం స్వామివారు ఊరేగే వాహనం హనుమద్వాహనం. త్రేతాయుగంనాటి రాముడు వేంకటేశ్వరుడని నిరూపించడం ఈ వాహనంలోని పరమార్థం. వైష్ణవులు హనుమంతుణ్ణి 'సిరియతిరువడి' అంటారు. గరుత్మంతుడు పెరియ తిరువడి. భృత్యుల్నికూడా మన్నించడం, వారికి ఉపకారం చేయడం రాజుల సహజధర్మం. శ్రీరాముడే దేవుడని నిత్యమూ కొలిచినభక్తుడు హనుమంతుడు. తన భక్తితత్పరతను చాటిన హనుమంతుడిద్వారా భక్తులు స్ఫూర్తిపొందడానికి వీలుగా హనుమంతవాహనంపై స్వామి ఊరేగడం ప్రత్యేకత.

తిరుమలగిరుల్లో అంజనాద్రి ఒకటి. ఆంజనేయునిపై శ్రీనివాసుడు అభిరామగుణాకరుడిగా, జగదేకధనుర్ధారిగా, రఘురాముడిగా, సీతారాముడిగా పరివర్తన చెంది రామరాజ్య స్థాపన కోసం సేవాభావంతో నన్ను సేవించండి, ప్రతిఫలాపేక్షరహిత సేవేముక్తికి మార్గం అనే అంతరార్థాన్ని ప్రబోధిస్తూ భక్తుల ముందుకు వచ్చేదే ఈ హనుమద్వాహనసేవ పెరియాళ్వారు స్తుతించిన వాహనమిది.

రక్షించి సత్యుడని పేరుపొందినవాడు అయిన శ్రీనివాసుణ్ణి సేవిస్తాను.

**13) మహాగాధ జలాధారం కచ్ఛపం మందరోద్ధరం**
**సుందరాంగం చ గోవిందం శ్రీనివాసం భజేఽనిశమ్ ॥**

మిక్కిలిలోతైన సముద్రానికి ఆధారమైనవాడు, దేవతలు, రాక్షసులు, అమృతంకోసం పాలసముద్రాన్ని మథించి నపుడు కవ్వంగానున్న మంథరపర్వతాన్ని కూర్మరూపియై ఉద్ధరించినవాడు, ఏ అవతారమందైనా సుందరశరీరంగల గోవిందుడైన శ్రీనివాసుణ్ణి సేవిస్తాను.

**14) వరం శ్వేత వరాహాఖ్యం సంహారం ధరణీధరం**
**స్వదంష్ట్రాభ్యాం ధరోద్ధారం శ్రీనివాసం భజేఽనిశమ్**

శ్రేష్ఠమైన శ్వేతవరాహరూపాన్ని ధరించి, భూమిని పాతాళానికి తీసుకుపోయిన హిరణ్యాక్షుణ్ణి సంహరించినవాడు, తన కోరతో పాతాళాన పడి ఉన్న భూమిని ఉద్ధరించిన శ్వేత వరాహవదనం, మానవశరీరరూడైన శ్రీనివాసుణ్ణి సేవిస్తాను.

**15) ప్రహ్లాదాహ్లాదకం లక్ష్మీనృసింహం భక్తవత్సలం**
**దైత్య మత్తేభ దమనం శ్రీనివాసం భజేఽనిశమ్**

రాక్షసులనే ఏనుగులకు సింహం వంటివాడు, హిరణ్యకశిపుని సంహరించి, ప్రహ్లాదుని సంతోషపరిచినవాడు, భక్తులపై వాత్సల్యం గలవాడు, లక్ష్మీనరసింహరూపుడైన శ్రీనివాసుణ్ణి ఎల్లప్పుడూ కొలుస్తాను.



**16) వామనం వామనం పూర్ణకామం భామనమాణవం**
**మాయినం బలి సమ్మోహం శ్రీనివాసం భజేఽనిశమ్**

శోభనాలైన కల్యాణగుణాలచే భక్తులను ఆకర్షించేవాడు. సంపూర్ణంగా తీరిన మనోరథాలు గలవాడు, సుందరమైన బాలబ్రహ్మచారియై బలిచక్రవర్తిని మోహింపజేసిన వామనరూపి అయిన శ్రీనివాసుణ్ణి సేవిస్తాను.

**17) చంద్రాననం కుందదంతం కురాజఘ్నం కుఠారిణం**
**సుకుమారం భృగు ఋషేః శ్రీనివాసం భజేఽనిశమ్**

చంద్రునితో సరితూగు ముఖం గలవాడు, మల్లెమొగ్గల వంటి దంతాలు గలవాడు, దుష్టక్షత్రియులను గొడ్డలితో సంహరించినవాడు, భృగువంశంలో జన్మించిన పరశురామ రూపుడైన శ్రీనివాసుణ్ణి నిత్యం కొలుస్తాను.



**స్వర్ణరథరంగ డోలోత్సవం** **(29-09-2025, సాయంత్రం)**

**స్వర్ణరథం స్వామివాహనాలలో చేరిన నూతనవాహనం. రథోత్సవం ఒక ఉత్సవం మాత్రమే కాదు, భక్తజనుల హృదయాలలో తాత్త్వికబీజాలను విత్తే ఒక యజ్ఞం. సింగారించిన స్వామి రథాన్ని దర్శించిన వారికి జన్మజరా దుఃఖరహితమైన మోక్షం లభిస్తుంది.**

**గజవాహనం** **(29-09-2025, రాత్రి)**

**బ్రహ్మోత్సవంలో ఆరవరోజురాత్రి మలయప్ప ఊరేగే వాహనం 'గజవాహనం'. మొసలిబారికి చిక్కిన ఏనుగును మహావిష్ణువు రక్షించడం 'గజేంద్రమోక్షం'. అలాగే శరణాగతులైన వారిని తాను రక్షిస్తానని చెప్పడంకోసం 'గజవాహనం'. 'గజం' అహంకారానికి ప్రతీక. అహంకారాన్ని అణచిన మనిషి ఆరాధ్యుడౌతాడు. అహంకారం భగవంతునిదగ్గర 'దాసోఽహ' మంటుంది. తొండరడిప్పొడియాళ్వారు స్తుతించిన వాహనమిది. గజరాజు వలే హృదయగజాన్ని స్వామికి వాహనంగా చేసే భక్తులు ధన్యులు, కృతార్థులు!**





ఆర్తులకు అభయమిచ్చి దీవించే సన్నిధానం శ్రీస్వామివారి ఆనందనిలయం

**18) శ్రీరామం దశ దిగ్వ్యాప్తం దశేంద్రియనియామకం**
**దశాస్యఘ్నం దాశరథిం శ్రీనివాసం భజేఽ నిశమ్**

పది దిక్కులలో వ్యాపించి ఉన్నవాడు, పది ఇంద్రియాలను శాసించినవాడు, దశముఖుడైన రావణుని సంహరించినవాడు, దశరథుని కుమారుడైన శ్రీరాముని రూపం గల శ్రీనివాసుణ్ణి ఎల్లప్పుడూ సేవిస్తాను.

**19) గోవర్ధనోద్ధరం బాలం వాసుదేవం మదూత్తమం**
**దేవకీతనయం కృష్ణం శ్రీనివాసం భజేఽ నిశమ్**

బాలుడైనప్పటికీ గోవర్ధనపర్వతాన్ని పైకెత్తి, గో, గోప సంఘాన్ని రక్షించినవాడు, వసుదేవునిపుత్రుడు, యాదవులలో ఉత్తముడు, దేవకీతనయుడు, కృష్ణరూపుడైన శ్రీనివాసుణ్ణి నేను నిత్యం సేవిస్తాను.

**20) నందనందన మానందమింద్రనీలం నిరంజనం**
**శ్రీయశోదాయశోదం చ శ్రీనివాసం భజేఽ నిశమ్**

నందగోపుని కుమారుడు, ఆనందాన్ని కలిగించువాడు, ఇంద్రనీలంవంటి శరీరవర్ణం గలవాడు, దోషరహితుడు, యశోదాదేవికి కీర్తిని కలిగించినవాడు, కృష్ణరూపుడైన శ్రీనివాసుణ్ణి ఎల్లప్పుడూ కొలుస్తాను.

**21) గోవృందావనగం బృందావనగం గోకులాధిపం**
**ఉరుగాయం జగన్మోహం శ్రీనివాసం భజేఽ నిశమ్॥**

గోసంఘాన్ని రక్షించినవాడు, బృందావనక్షేత్రంలో సంచరించినవాడు, గోకులానికి అధిపతి, వేదాలచే స్తుతింప బడ్డవాడు, జగత్తును మోహింపజేసేవాడు, శ్రీకృష్ణరూపుడైన శ్రీనివాసుణ్ణి నిత్యం సేవిస్తాను.

**22) పారిజాత హరం పాపహరం గోపీ మనోహరం**
**గోపీవస్త్రహరం గోపం శ్రీనివాసం భజేఽ నిశమ్॥**

పారిజాతవృక్షాన్ని అపహరించినవాడు, భక్తుల పాపాలను హరించేవాడు, గోపికలమనస్సులను రంజింప జేసిన వాడు, గోపికలవస్త్రాల్ని అపహరించినవాడు, గోవులను కాచిన వాడైన శ్రీకృష్ణరూపుడైన శ్రీనివాసుణ్ణి సదా సేవిస్తాను.

**23) కంసాంతకం శంసనీయం సశాంతం సంసృతి చ్ఛిదం**
**సంశయ చ్ఛేది సంవేద్యం శ్రీనివాసం భజేఽ నిశమ్॥**

కంసుని వధించినవాడు, బ్రహ్మాది దేవతలచే స్తుతింప బడ్డవాడు, శాంతిసౌఖ్యాల్ని ఇచ్చేవాడు, భక్తులకు జన్మ మృత్యు రూపమైన సంసారాన్ని తొలగించి ముక్తినిచ్చేవాడు, భక్తుల సంశయాల్ని పోగొట్టి తత్త్వజ్ఞానాన్ని బోధించేవాడైన శ్రీనివాసుణ్ణి సదా సేవిస్తాను.

**24) కృష్ణాపతిం కృష్ణ గురుం కృష్ణా మిత్ర మభీష్టదం**
**కృష్ణాత్మకం కృష్ణసఖం శ్రీనివాసం భజేఽ నిశమ్॥**

సత్యభామకు భర్త, అర్జునునకు గురువు, ద్రౌపదికి రక్షకుడు, భక్తులకోరికలను తీర్చేవాడు, కృష్ణనామధేయుడై వ్యాసమహర్షి రూపుడు, అర్జునునికి మిత్రుడు, శ్రీకృష్ణ రూపి అయిన శ్రీనివాసుణ్ణి నిత్యం కొలుస్తాను.



**సూర్యప్రభవాహనం** **(30-09-2025, ఉదయం)**

బ్రహ్మోత్సవంలో ఏడవరోజుఉదయం మలయప్ప ఊరేగేవాహనం సూర్యప్రభ. సూర్యుడు కర్మసాక్షి. చరాచర ప్రపంచానికి వెలుగును ప్రసాదించే ప్రత్యక్షదైవం. శ్రీవేంకటేశ్వరుడు, సూర్య మండలమధ్యస్థుడని శంఖచక్రగదాయుధధారి అనే అర్థంలో 'సూర్యప్రభవాహనం" జరుపుతారు. "సూర్యుణ్ణికూడ శాసించేవాణ్ణి నేనే"- అనే అర్థంలో 'సూర్యప్రభవాహన' ఆరూఢుడై స్వామి ఊరేగుతారు.

తేజస్సులకు తేజోరూపుడు ఆ శ్రియఃపతి. సూర్యునియందు ఆ శ్రీనివాసుడు వ్యూహ రూపంలో ఉన్నాడు. నవగ్రహాల నన్నింటినీ ప్రార్థించి సర్వశుభాలు ఏ విధంగా పొందగలమో, పరమాత్ముడైన శ్రీవేంకటేశ్వరుణ్ణి సందర్శించి కూడా సకల ఆయురారోగ్యాది శుభఫలితాలు పొంద గలరనే అంతరార్థాన్ని అందించేదే సూర్యప్రభవాహనం.

**25)** **కృష్ణాఽహి మర్దనం గోపైః కృష్ణో పవన లోలుపం**
**కృష్ణాత్మం మహోత్కృష్టం శ్రీనివాసం భజేఽనిశమ్**

కాళీయుడనే కృష్ణసర్పాన్ని మర్దించినవాడు, గోప బాలురతో, గోపికలతో యమునాతీరంలోని ఉద్యానవనాలలో విహరించుటలో ఆసక్తిగలవాడు, కృష్ణవేణీనదికి జనకుడు, బ్రహ్మరుద్రాది దేవతలకంటే అధికుడైన శ్రీకృష్ణరూపుడైన శ్రీనివాసుణ్ణి ఎల్లప్పుడూ సేవిస్తాను.

**26)** **బుద్ధం సుబోధం దుర్బోధం బోధాఽత్మానం బుధప్రియం**
**విబుధేశం బుధైర్బోధ్యం శ్రీనివాసం భజేఽనిశమ్॥**

సజ్జనులకు తత్వజ్ఞానాన్ని బోధించేవాడు, దుర్జనులకు తెలియ నలవికానివాడు, జ్ఞానస్వరూపుడు, పండితులకు ప్రియుడు, జ్ఞానులకుమాత్రమే తెలిసేవాడు, బుద్ధరూపుడైన శ్రీనివాసుణ్ణి నేను నిరంతరం భజిస్తాను.

**27)** **కల్కినం తురగారూఢం కలికల్మష నాశనం**
**కల్యాణదం కలిఘ్నంచ శ్రీనివాసం భజేఽనిశమ్॥**

గుర్రాన్నెక్కినవాడు, భక్తుల కలిదోషాల్ని హరించేవాడు, శుభాలను ఇచ్చేవాడు, దుష్టుడైన కలిపురుషుని నాశనం చేసేవాడు, కల్కిరూపంలో అవతరించునట్టి శ్రీనివాసుణ్ణి నేను ఎల్లప్పుడూ కొలుస్తాను.

### శ్రీపదకేళి
### :: 116 – సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 శ | ర | న్న | 2 వ | రా | త్రు | లు | | 3 ఉ | | |
| మం | | | సు | | | | | 4 పా | ర్శ్వ | |
| 5 త | నూ | 6 భ | వు | డు | | 7 కెం | | ధ్యా | | 8 స |
| పం | | ర | | | 9 చం | పు | | య | | తి |
| చ | | తు | | | డి | | 10 ఇం | ది | ర | |
| క | | డు | | 11 శం | క | రి | | నో | | 12 య |
| ము | | | | బ | | | 13 ఉ | త్స | వ | ము |
| | 14 ఆ | ది | వ | రా | హ | ము | | వం | | న |
| 15 అ | | | | రి | | | 16 ద | | 17 ల | |
| 18 ల | క్ష | ణ | | | 19 గం | | 20 మ | హా | ల | య |
| క | | | 21 మ | తం | గ | ము | ని | | న | |

### ఫలశ్రుతి

**వక్తుః శ్రోతుః పాఠకస్య పారాయణపరస్య చ**
**పరాత్పరో వేంకటేశః ప్రసన్నో భవతి క్షణాత్॥**

ఈ శ్రీనివాసతారావళిని చెప్పేవారికి, వినేవారికీ, చదివేవారికి, శ్రద్ధతో పారాయణం చేసేవారికి, పరమపురుషుడైన శ్రీనివాసుడు (వేంకటేశ్వరుడు) క్షణంలో ప్రసన్నుడౌతాడు.

**స్తోత్రేణానేన సంతుష్టో వేంకటేశో రమాపతిః**
**యాన్ యాన్ కామాన్ కామయంతే తాంస్తా –**
**ముక్తిం దదాతి చ**

ఈ స్తోత్రంతో లక్ష్మీనాథుడైన శ్రీవేంకటేశ్వరుడు భక్తుల కోరికలన్నింటినీ తీర్చుతాడు. మోక్షాన్ని ప్రసాదిస్తాడు.



శ్రీవారి పాదాలే
మనకు శరణ్యం

**చంద్రప్రభవాహనం** **(30-09-2025, రాత్రి)**

ఏడవరోజు రాత్రి 'మలయప్ప' ఊరేగే వాహనం చంద్రప్రభ. చంద్రుడు ఓషధీశుడు. భగవంతుడు చంద్రుని రూపంలో ఓషధులను పోషిస్తున్నాడనే అర్థంలో చంద్రప్రభ వాహనం. అంతేగాక చంద్రుణ్ణికూడా శాసించేమూర్తి తానే అని చెప్పడం మరొక విశేషార్థం.

హృదయాకాశంలో వైశ్వానర జ్యోతిలో శుద్ధస్ఫటిక కాంతితో ప్రకాశించే శ్రీమన్నారాయణుని ఆహ్లాదకరమైన, నిర్మలమైన మనస్సుతో ధ్యానించాలని ప్రభవించింది. 'చంద్రప్రభ' వాహనం. ఆహ్లాదకరత్వం, ఆనందం, మనోవిశాలత, సత్సంతాన ప్రేరణ, శీతలస్పర్శవాయుసంయోగం, మోక్షప్రాప్తి, చంద్రప్రభ అధిష్ఠిత శ్రీశ్రీనివాస సందర్శనం.



# ఈ కావ్యంలో ఎన్నో విశేషాలు!!

**- శ్రీమతి డి.వి.లక్ష్మి**

శ్రేష్ఠలూరి వేంకటార్యుడు రచించిన 'శ్రీనివాసవిలాస సేవధి' అనే ద్విపదకావ్యం చక్కని భక్తిరసవత్కావ్యం. శ్రీనివాసుని విహారలీలలనూ, వైభవాన్నీ వర్ణించిన రసవత్ప్రబంధం. ఇది ఆరు ఆశ్వాసాల కావ్యం. ప్రతికవి దాదాపుగా తాను ఆ కావ్య రచన చేయడానికి కారణం చెప్పుకుంటాడు. భక్తికావ్యరచనకు కారణం జన్మరాహిత్యమూ, మోక్షకాంక్షే. మహాభాగవతకర్త పోతననుండి మొల్ల మొదలయిన అందరూ అదేదారిలో నడిచారు. అదే పరంపరగా శ్రీవేంకటార్యుడు కూడ చెప్పుకున్నాడు. స్వామి కవికి స్వప్నంలో దర్శనమిచ్చి కావ్యరచన చేసి తన కర్పించమని ఆదేశించాడు. తనకు కావలసిన కథ, కథనం, కావ్యపు తీరు అంతా ఆయనే ఆదేశించాడు. స్వామి ఆదేశాన్ని కవి త్రికరణశుద్ధిగా శిరసావహించాడు.

ఇతడు వరాహ వామనాది పురాణాంతర్గకథలను శోధించి ఈ గ్రంథంలో ద్విపదగా మలిచాడు. సాధారణంగా పురాణకథలన్నిట్లో సుక్షేత్రం నైమిశారణ్యమే ఇందులో ప్రస్తావించబడింది. నైమిశారణ్యంలో సకలపురాణవ్యాఖ్యాన వైఖరీసమేతుడైన సూతుడు శౌనకాది మహర్షులకు చెప్పినట్లే కథాసందర్భం కూడ ఉంటుంది. ఈ సన్నివేశంతో ఈ ద్విపద కావ్యం ప్రారంభమౌతుంది. భూలోకంలో అతిపుణ్యతమమైన క్షేత్రమేది? అని మునులు సూతుని ప్రశ్నించారు. సూతుడు "వేంకటాద్రే అలాంటి క్షేత్రమని, అదే జ్ఞానసాధన స్థానమనీ" వ్యక్తం చేశాడు.

మహావైభవోపేతుడు వైకుంఠవాసుడు అయిన విష్ణుదేవుడు లక్ష్మీమాతతో వచ్చి ఈ వేంకటాద్రిపై వసియించాడు. ఆ గిరి మాహాత్మ్యం అత్యద్భుతం. భూమిని, భూలోక వాసులను ఉద్ధరింపనెంచిన శ్రీమహావిష్ణువు ఆ గిరిలో వేంచేశాడు.

విష్ణుదేవుడు వరాహరూపంలో భూమిని నుద్ధరించి ఆ భూమిపైనే కొంతకాలంవసింప నెంచాడు. ఇందిరాదేవిని, తక్కిన తన పరివారాన్ని రప్పించి స్వామిపుష్కరిణి చెంత ఉంచాడు. ఇక్కడ స్వామి పుష్కరిణీవైశిష్ట్యాన్ని గూర్చి కూడా విశేషంగా చెప్పాడు కవి. వైకుంఠవిలసితోద్యాన ప్రవిష్టమైన ఈ స్వామి పుష్కరిణి స్వామి పిలువగా గంగతో కలిసి భూలోకానికి వచ్చింది. ఇలాంటి విశిష్టతీర్థాన్ని ప్రదక్షిణపూర్వకంగా పూజిస్తే సర్వజనులకు ఇష్టకామ్యార్థసిద్ధివరంగా లభిస్తుంది. రాజ్యభ్రష్టుడైన మాళవరాజు పుష్కరిణిస్నానమూ, శ్రీనివాసుని సేవతో రాజ్యప్రాప్తిని పొందాడు, అన్న కథను ఈ కావ్యంలో కవి తెలియజేశాడు.

స్వామి పుష్కరిణికి వాయువ్య కోణంలో వారాహతీర్థం; ఉత్తరదిశలో ధనదతీర్థం; ఈశాన్యంలో గాలవ తీర్థం; తూర్పున మార్కండేయతీర్థం; ఆగ్నేయంలో అగ్నితీర్థం; దక్షిణాన యమతీర్థం; నైఋతిలో వాశిష్ఠతీర్థం; పడమట అశ్వత్థవృక్షచ్ఛాయలో వాయుతీర్థం; నడుమ సరస్వతీతీర్థం ఉన్నాయని కవి తెలియజేశాడు.

భూలోకంలో ఉన్న పుణ్యతీర్థాలన్నీ స్వామిపుష్కరిణిలో కలుస్తాయి అని సూతుడు చెప్పినట్లు ఈ కావ్యంలో చెప్పబడింది. ఆత్మారాముడనే ఒక బ్రాహ్మణునికథతో ద్వితీయాశ్వాసం

**రథోత్సవం** **(01-10-2025, ఉదయం)**

బ్రహ్మోత్సవం ఎనిమిదవరోజు ప్రాతఃకాలం స్వామి రథంలో శ్రీభూసహితంగా ఊరేగుతారు. శరీరమే ఒక రథం. పంచేంద్రియాలే గుర్రాలు. మనసు వాటిని అదుపు చేసే



పగ్గం. ఆత్మరథచోదకుడు- స్వామి అని శాస్త్రం. ఇంద్రియాలను అదుపుచేసి, నరతత్త్వంనుండి నారాయణతత్త్వం వైపు పయనించ గలిగితే శరీరరథం భద్రంగా ఉంటుంది. ఈ భావాన్ని చాటి చెప్పడానికే రథంలో శ్రీవారిని తిరువీధులలో ఊరేగిస్తారు. రథారూఢుడైన శ్రీస్వామిని దర్శించి, భక్తివిశ్వాసాలతో రథంలాగుతూ, గోవిందనామస్మరణం చేస్తూ, భక్తులు ఆనంద పరవశులు కావడం ఈనాటివిశేషం. రమణీయమై కమనీయమై, శోభాయమానమై, కాంతిదాయకమై, నేత్రానందమై జిలుగు వెలుగులతో విరాజిల్లే సప్తగిరీశుడి రథోత్సవం అష్టదిక్పాలకులకు సైతం ఆనందదాయకం. రథంలో వేంచేసి ఉన్న శ్రీవారి దర్శనభాగ్యం పొందిన వారికి పునర్జన్మ ఉండదు.

మొదలౌతుంది. పదిహేడుతీర్థాల మహిమాభివర్ణనం, ఇందులో కన్పిస్తుంది. వైకుంఠ గుహ మహిమావర్ణనం, అంజనాదేవి రామునికి హితవుచెప్పడం, బ్రహ్మాదులు నారదునితో కలిసి శేషశైలానికి వెళ్లడం, బ్రహ్మాదులు వెన్నుని కానలేక తిరుగుట, దశరథుడు శ్రీమహావిష్ణువుని నాలుగుశ్లోకాలతో స్తుతించడం, నలుగురు పుత్రుల్ని పొందడం, లోకకంటకులను సంహరించడానికి స్వామి సుదర్శనుని ఆజ్ఞాపించడం వంటి అంశాలతో ద్వితీయాశ్వాసం పూర్తవుతుంది.

చక్రాయుధం తూర్పుదిక్కున ఉన్న రక్కసుల్ని చెండాడడం, ఆగ్నేయదిక్కులో మాయాక్షుడనే దానవుణ్ణి సంహరించడం, చక్రరాజు ఉత్తర దిగ్విజయం, చక్రరాజు వేంకటాద్రికి రావడం; బ్రహ్మ శ్రీనివాసునికి ఉత్సవము చేయడానికి అనుజ్ఞవేడుకోవడం, స్వామి వేంకటాచలంలోనే వసించేటట్లు బ్రహ్మవరం పొందడం, వేంకటాచలమహిమలతో తృతీయాశ్వాసం ముగుస్తుంది.

వేంకటాచలానికి శివపార్వతులరాక, శంభుడు, వసురాజు కథలు, వేంకటాద్రికి అనేకపేర్లు రావడానికి కారణం, వసంతవర్ణనం తదితరాలతో చతుర్థాశ్వాసం ముగుస్తుంది.

వకుళమాతతో శ్రీనివాసుడు తన విరహకారణం చెప్పుకోవడం, వేదవతి వృత్తాంతం, వకుళమాలిక తాను వచ్చిన కార్యం ఆకాశరాజుకు చెప్పడం, ముహూర్త నిర్ణయం, వివాహసన్నాహం, పద్మావతీశ్రీనివాసుల వివాహంతో పంచమాశ్వాసం పూర్తి అయింది.

భవిష్యత్కథలు, కలి విజృంభణం, వేంకటరమణుని అర్చావతారం, మహిమలు, పాండ్యదేశీయుడైన రంగదాసు స్వామికోసం పూలతోటవేయించి ఇవ్వడం, స్వామిని సేవించడం, రంగదాసుని మతిభ్రమ, తొండమానుని పట్టాభిషేకం, తొండమానుని వివాహాలు, వసుడనే నిషాదుడు శ్వేతవరాహాన్ని గూర్చి తెల్పడం, తొండమానుడు స్వామికి విమానాదులు నిర్మించి ఇవ్వడం, తిరునాళ్లవర్ణన, కృష్ణశర్మకథ, కుమ్మరికథ, స్వామి తొండమానునికి సాయుజ్యం కటాక్షించడం ఇందులో ప్రధానాంశాలు.



శ్రీనివాసుణ్ణి నమ్మినవారు ఎన్నటికీ చెడిపోరు

స్వామిపుష్కరిణికి సాటి తీర్థంబు
వేంకటాద్రికి నుద్ది విష్ణుస్థలం
వేంకటేశ్వరుబోలు వేరె దైవతము
సత్యంబు గానెచ్చట లేదు లేదు–అంటూ పరమయోగులు చెప్పిన పరమరహస్యాన్ని, బ్రహ్మవిద్యనూ తెలియచేశాడు కవి. ఇంతటితో షష్ఠాశ్వాసం కావ్యం రెండూ సంపూర్ణమైనాయి.

భక్తసులభుడు, లక్ష్మీవల్లభుడు అయిన శ్రీనివాసుని అనుగ్రహానికి కావ్యఫలసమర్పణతో ఈ కవి పాత్రుడయ్యాడు. పతితలైన భక్తులనూ ధన్యులను చేశాడు.

## అశ్వవాహనం

(01-10-2025, రాత్రి)



బ్రహ్మోత్సవంలో ఎనిమిదవరోజురాత్రి స్వామి ఊరేగేవాహనం 'అశ్వవాహనం'. ఇంద్రియాలను గుర్రాలుగా చెప్పడం, గుర్రాలను అదుపులోకి తెచ్చుకోవాలనడం, ఆధ్యాత్మిక విషయం. 'ఇంద్రియశాసకుణ్ణి నేనే' అనే అర్థంలో ఈ వాహనం. అలాగే అదుపు, ఆజ్ఞలేనిగుర్రాలలాంటి జీవుల్ని అదుపులో పెట్టగలనని నిరూపించడానికే అశ్వవాహనం. అన్ని దేశాలకు, అన్నిలోకాలకు అధిపతిని నేనే అనే అర్థంలో 'అశ్వవాహనం'.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవ రోజు ఉదయం రథోత్సవం జరుగుతుంది. అదే రోజు రాత్రి అశ్వవాహనంపై శ్రీవారు దర్శనమిస్తారు. ఉదయం రథం లాగేవీ అశ్వాలే! రాత్రికి వాహనంగా వచ్చేదీ అశ్వమే! జగద్రక్షకుడైన శ్రీనివాసుడు లోకహితం కోరి అశ్వారూఢుడై ఆయుధధారి అయ్యాడు. ఆయన గదాధరుడై ఉన్నాడు. ఆయన గదాధరుడై ఉన్నాడు. జనార్దనుడు మహాతేజస్సుతో, పరాక్రమంతో భయద సుందరంగా ఈ అశ్వవాహనసేవరోజు విరాజిల్లుతాడు.

# అనుమానం ఉండకూడదు!

– శ్రీ తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

**తిరుమలకొండలన్నీ అద్భుత ప్రకృతి రమణీయ సంపదతో నిండి ఉంటాయి. ఆ కొండలు నడిచి ఎక్కుతుంటే మన శరీరంలో ఏదో అనిర్వచనీయమైన దివ్య తేజస్సు ప్రవహిస్తున్నట్లు అనిపిస్తుంది. రోజూ ఏ మాత్రం వ్యాయామం అలవాటు లేని వారు సైతం ఈ కొండలను సునాయాసంగా ఎక్కగల్గుతారు. మొదటి కొండపై కాలుపెట్టడమే తరువాయి... ఆ స్వామే మనల్ని చెయ్యి పట్టుకుని పైదాకా లాగి వేస్తాడు... ఒక్కొక్క కొండ ఎక్కుతున్న కొద్దీ మనలో శక్తి ఇంకా పెరుగుతున్నట్లు అనిపిస్తుంది. ఆ దేవదేవుడి ఆనందనిలయం ఉన్న వేంకటాద్రికి దగ్గరౌతున్న కొద్దీ మనలో నూతనోత్సాహం కలుగుతుంది. భక్తులకు ఎన్నో దివ్యానుభూతులు కలుగుతాయి.**

పూర్వకాలంలో రామశర్మ, కృష్ణశర్మ అని ఇద్దరు భక్తులు ఉండేవారు. ఒకసారి వారిద్దరూ కలిసి శ్రీనివాసుని దర్శనార్థమై తిరుమల బయలుదేరారు. అలిపిరి చేరుకుని మొదట కొండపై కాలుపెడుతూ ఇలా ప్రార్థించారు. "స్వామీ! శ్రీనివాసా! ఈ కొండలన్నీ ఏ మాత్రం శ్రమ లేకుండా ఎక్కగలిగే శక్తి మాకు ప్రసాదించు తండ్రీ! ఓ ఆదిశేషా! నీవే ఈ కొండలరూపంలో ఉండి శ్రీస్వామికి శయ్యగా సేవ చేస్తున్నావు. నీ పై కాలు మోపుతున్నందుకు మమ్ము క్షమించవలసింది. ఆ దేవదేవుని దర్శనార్థం నీపై కాలు మోపక తప్పట్లేదు. మమ్ములను క్షమింప వలసింది" అని ప్రార్థించి కొండ నెక్కసాగారు.

కొండ ఎక్కుతున్నప్పుడు చుట్టూ ఉన్న అందమైన ప్రకృతిని చూసి మురిసిపోయారు. తిరుమలకొండపై మనకు కనిపించే చెట్లన్నీ ఎన్నోవేల సంవత్సరాలుగా తపస్సుచేస్తున్న మహర్షులే! ఇక్కడి చెట్లపై ఎగురుతూ, విహరిస్తున్న పక్షులన్నీ దేవతా గణమే! సర్వవేదాల స్వరూపమే ఈ కొండ. సర్వజ్ఞాన స్వరూపమే ఈ కొండ. సృష్టిలోని సర్వదేవతలకూ ఎంతో ప్రీతికరమైంది ఈ పవిత్ర వేంకటాద్రియే! ఈ వేంకటాద్రిపై చేసే ఏ పుణ్యకార్యమైనా వేయిరెట్లు ఫలితమీయగలదు.

స్వామివారి దివ్యవిశేషాలు తలచుకుంటూ కొండ నెక్కుతున్న ఆ స్నేహితులిద్దరు కొండపై వాలుగా ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు. చాలా జాగ్రత్తగా అడుగులో అడుగు వేస్తూ ఎక్కుతున్నారు. అలా ఎక్కుతుండగా ఒక్కసారిగా రామశర్మ పట్టుతప్పి



**మూఢులకు జ్ఞానాన్నిచ్చే బృందావనం స్వామివారి ఆనందనిలయం**



**చక్రస్నానం** **(02-10-2025, ఉదయం)**

**బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా తొమ్మిదవరోజు ఉదయం పల్లకీ ఉత్సవం అనంతరం 'చక్రస్నానమహోత్సవం' జరుగుతుంది.**

**శ్రీవరాహస్వామిఆలయప్రాంగణంలోనికి శ్రీదేవీ భూదేవీసహితశ్రీమలయప్పస్వామిని శ్రీసుదర్శనచక్రత్తాళ్వారుతో కూడ వేంచేపు చేయించి, పంచామృత స్నపన తిరుమంజనం చేస్తారు. తర్వాత శ్రీసుదర్శన చక్రత్తాళ్వారును శ్రీవారిపుష్కరిణిలో మూడుసార్లు ముంచి, పవిత్రస్నానం చేయిస్తారు. ఈ చక్రస్నాన సమయంలో వేదమంత్రోచ్చారణ సాగుతుండగా, భక్తులు ముక్త కంఠంతో గోవింద! గోవింద! గోవింద! అంటూ పుష్కరిణిలో 'మునకలు' వేస్తారు. చక్రస్నానానికే అవభృథ స్నానమని పేరు. బ్రహ్మోత్సవాలు పూర్తి అయినందుకు ఈ చక్రస్నానం గుర్తు కూడా!**

**ఈ సందర్భంలో భక్తులు స్నానం చేస్తే పాపవిముక్తి, శత్రుమర్దనం, వాగ్వృద్ధి, ధనధాన్య సంపత్తులు, విషమృత్యునాశనం, రాజ్యపదవులు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.**



జారిపడ్డాడు. కృష్ణశర్మపై తూలిపడడంతో అతడు కూడా జారికిందపడ్డాడు. ఇలా ఆ మిత్రులు ఇద్దరూ ఒక్కసారిగా జారి లోయలోనికి పడ్డారు. రామశర్మకు చిన్నగాయమైంది. కానీ, కృష్ణశర్మకు కాలు విరిగింది. విపరీతమైన నొప్పి కలిగింది. పైన ఆకాశంలో వెళు తున్న నారదమునీంద్రుడు ఇదంతా గమ నించాడు. ఇద్దరు భక్తులు ఒకసారి ఒకే చోట పడినా ఒకరికి ఏ దెబ్బ తగలక పోవడమేమిటి? మరొకరికి కాలు విరగడ మేమిటి? అని నారదుడు శ్రీస్వామినే అడిగాడు.

అప్పుడు స్వామి ఇలా చెప్పాడు. “నారదా! ఆ ఇద్దరు భక్తులూ ఒకేసారి పడినప్పటికీ వారిద్దరి భక్తిలో చిన్నతేడా ఉంది. రామశర్మ జారిపడగానే “స్వామి తప్పక ఉన్నాడు. నన్ను తప్పక రక్షిస్తాడు” అని మనస్సులో నన్ను ప్రార్థించాడు. కానీ కృష్ణశర్మ మాత్రం “ఆ స్వామి గనుక నిజంగా ఉంటే నన్నే రక్షిస్తాడు’ అను కున్నాడు. ఇతని భక్తిలో సంశయం ఉంది. కానీ, రామశర్మ భక్తి ఏ మాత్రం సంశయం లేని అనన్యభక్తి. అందుకే అతడికి ఏ గాయం కాలేదు” అని అన్నాడు.


శ్రీనివాసుని సంపూర్ణ శరణాగతి వేడిన వారికి ఎలాంటి ఆపదలూ దరి చేరవు. ఎలాంటి సంశయా లకు.. తావివ్వకుండా... సంపూర్ణభారం తన మీదే వేసే భక్తులను ఆ అమృత మూర్తి ఎల్లప్పుడూ కాపా డుతూ ఉంటాడు. శ్రీనివాసు నికి కావలసింది నిష్కలంక, నిర్మలమైన ప్రేమ. లేశమైనా అనుమానానికి తావివ్వకుండా పూర్తిభారం తనపై ఉంచే భక్తులను స్వామి తప్పక రక్షిస్తాడు.

**ధ్వజావరోహణం** **(02-10-2025, రాత్రి)**

**శ్రీవారి బ్రహ్మోత్సవాలలో తొమ్మిదోరోజు రాత్రి ధ్వజావరోహణోత్సవం జరుగు తుంది. ధ్వజావరోహణంనాడు మంత్రాలతో, గద్యలతో, మంగళవాద్యాలతో దేవతలం దరికీ సగౌరవంగా వీడ్కోలు చెప్తారు. శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీమలయప్పస్వామి వారి సమక్షంలో వేదపారా యణం జరుగుతుండగా, మంగళవాద్యాలూ, భేరీ మృదంగాలూ మ్రోగుతుం డగా, బ్రహ్మాది దేవతలకూ, దిక్పాలకులకూ వీడ్కోలు చెబుతూ, గరుడకేతనాన్ని ధ్వజస్తంభాగ్రం నుండి క్రిందికి దించుతారు. నివేదన కర్పూరనీరాజనాలన్నీ అయ్యాక, అర్చకస్వాములకూ, ఆచార్య పురుషులకూ సత్కారం జరిపి, వాళ్లను సగౌరవంగా వాళ్ల వాళ్ల విడుదులకు పంపుతారు. ఈ ధ్వజావరోహణంతో పదిరోజులు పాటు మహావైభవంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలు మంగళాంతం అవుతాయి.**



ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

**తెనుగు అనువాదకులు:**
**కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,**
**కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు**

*(గత సంచిక తరువాయి భాగం...)*

ఇతిహాస పురాణాదికంగా అనేక ప్రబంధాను సంధానం చేయడం సద్వృద్ధసంప్రదాయం. శ్రీవేంకటాచలపతి ధనుర్మాసంలో పెద్దఅధ్యయనోత్సవం తిరునాళ్లలో సాయంకాలంలో వెలుపలకు వేంచేయగా దేవేరులును ప్రత్యేకంగ 'తోళుక్కినియాన్' అనే చిన్న శిబికలో విజయం చేసి శ్రీగోపురమార్గంలో నిలచియుండగా, అప్పుడు ఇద్దరూ జరిపించే 'మిన్నిడై మడవార్' (తటిత్తనుమధ్యలు) ప్రణయకలహం, 'పందుంకళలుమ్ పతిప్పు' (బంతి, గచ్చకాయల అపహరణ) ప్రణయకలహం అనే ఈ రెండూ ఆళ్వారుకు, భగవంతునకు జరుగాల్సి ఉండగా దేవేరులకూ, స్వామివారికీ జరిగినట్లు ఉండడమెందుకంటే– "పై వైకుంఠలోకంనుండి రావడంచేత వైకుంఠాద్రియని చెప్పబడుతోంది అనీ, శ్రీవైకుంఠానికి పోయి సువర్ణమయమైంది, పెద్దపెద్ద శిఖరాలు గలది, పంచోపనిషదాత్మకమూ అనగా ఆ ప్రాకృతమూ అయిన క్రీడాశైలాన్ని ఇక్కడకు దెమ్ము."

– అని చెప్పిన చొప్పున శ్రీవీథిలో విజయంచేసి శ్రీగోపురద్వారాన బయలుదేరి, ఈ శేషాచలం పరమపదంలోని ఒక భాగమనీ, ఈ పర్వతమొకప్పుడు శ్రీనివాస స్వరూపంగానే భాసించెనని చెప్పబడియుండడంచేత శ్రీమన్నారాయణుని అర్చావతారవిగ్రహాల్లో ఈ తిరుమలకొండ కూడా ఒక దివ్య మంగళవిగ్రహమనీ, ఓ మహాదేవా! అనంతుడనైన నేను కొండ శిఖరంపై ఉందునని, నీ ఫణామండలప్రదేశంలో రమాదేవితో ఉండవలెనని చెప్పినరీతిగ నిత్యసూరుల అధిపతి అయిన ఆది శేషుని దేహమే ఈ కొండ అని, ఇలా భిన్నప్రకారాలైన అర్థాలు బ్రహ్మాండ, బ్రహ్మపురాణాల్లో సుస్పష్టంగా ఉన్నందువల్ల, మెల్లమెల్లగా గిరిప్రదక్షిణం చేస్తున్నవారు, భక్తితో వినమ్రమగు కిరీటం కలవారు, అన్ని అవసరాలను కోరుతున్న వారు అయిన దేవతల చేతకూడ గొప్పదైన ఈ పర్వతరాజం రాత్రింబగళ్లు సేవింపబడుతోంది. శ్రద్ధాభక్తులు గలిగి ఎవ్వరైతే ఈ కొండను సేవిస్తున్నారో', 'వేంకటాద్రిదర్శనం విశేషంగా ఎక్కడ ఉందో', 'వారు మెలమెల్లగా చక్కగా గిరిప్రదక్షిణ చేస్తున్నవారై', పురుషార్థాలు సిద్ధిస్తున్నాయి అని చెప్పినవిధంగా నిత్యముక్తులు, నిత్యసంసారులు కూడ భేదంలేక అందరూ ఈ ఆదిశేషుడే (తద్రూపమైన కొండ) ప్రదక్షిణ ప్రణామాలచేత ఆరాధనీయుడని, సర్వారిష్ట నివృత్తిపూర్వకంగ సకలఫలప్రదుడని, వరాహ మార్కండేయాది పురాణలలో సుప్రసిద్ధమై ఉంది.

శుకుడు, భృగువు మొదలైన తపోధనులు, ప్రహ్లాదాది పుణ్యాత్ములు, అంబరీషుడు మొదలైన రాజులు ఈ పర్వత రాజాన్ని శ్రీవిష్ణుదేవుని మూర్త్యంతరమనే భావిస్తూ, పాదాలతో పర్వతాన్ని అధిరోహించడానికి భయపడినవారై ఈ ప్రాంతాలందే నివసిస్తూ, ఈ కొండనుండి ప్రవహించే నదులలో స్నానతర్పణాలను ఆచరిస్తూ శ్రీమన్నారాయణుని సాక్షాత్కారాన్ని కోరుకుంటూ తపస్సు చేస్తున్నారు.

*(ఇంకా ఉంది)*




స్వామి దయవల్లే ప్రపంచానికి వెలుగు



# తిరుమలలో ఇవి కూడా చూడండి!

– 'గ్రీన్ జర్నలిస్ట్' శ్రీ బి.వి.రమణ

ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం, తిరుపతిజిల్లాలోని తిరుమల ఓ మహాపుణ్యక్షేత్రం. దేశంలోనే అతి పెద్దధార్మికధామం. కలియుగప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల ఆలయం కేంద్రంగా చుట్టుప్రక్కల పలు దర్శనీయస్థలాలు ఉన్నాయి. సముద్రమట్టానికి రమారమి 2800అడుగుల ఎత్తున ఉన్న అరణ్యసీమలో అంతర్భాగం తిరుమల. రెండు ఘాట్‌రోడ్డులు, రెండు ప్రధాన మెట్లదోవలు కలిగిన తిరుమల అనేక వింతలు, విశేషాలకు నెలవు.



**నారాయణగిరి స్వామిపాదాలు-** శ్రీమన్నారాయణుడు వైకుంఠం నుంచి భువిపై మొదట పాదం మోపిన దివ్యప్రదేశమే నారాయణగిరి. ఈ సంఘటనకు గుర్తుగా శ్రీస్వామివారి పాదద్వయం ఏర్పడి భక్తుల మ్రొక్కులు అందుకుంటోంది. నారాయణగిరి ఎత్తుకొండగా ప్రసిద్ధి. ఆషాఢశుద్ధఏకాదశి అంటే ద్వాదశతిథినాడు ఛత్రస్థాపనోత్సవం అంగరంగవైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా శ్రీస్వామి వారి పాదద్వయంపై ఒక భూచక్రగొడుగును ఉంచి, అర్చకస్వాములు పూజాదికాలు నిర్వర్తిస్తారు. తిరుమలకొండ పాదపీఠాన తిరుపతి పట్టణం నెలకొన్నట్టు నిజానికి నారాయణగిరి పాదపీఠంలో తిరుమల వెలసి ఉంటుంది. తిరుమల బస్టాండు నుండి యాత్రికుల కోసం బస్సుసౌకర్యం ఉంది.





**శిలాతోరణం-** తిరుమల ఆదిగాగల శేషాచలం కొండలశ్రేణి ప్రాచీనతకు అద్దంపట్టే శిలాతోరణం ఒక అపురూప భౌగోళికస్మృతి చిహ్నం. పురాణపరంగా శ్రీవేంకటవిభుడు భూమిమీదకు వచ్చినప్పడు తొలిపాదాన్ని నారాయణగిరిశిఖరంపై మోపగా తన రెండవపాదాన్ని శిలాతోరణం వద్ద ఉంచాడని అంటారు. ఈ తోరణమే ద్వారంగా భావించి, శ్రీస్వామి ఇక్కడి నుంచి బయలు దేరి వెళ్లి ప్రస్తుతం తిరుమల గుడి ఉన్నప్రదేశాన్ని చేరుకున్నారని ఐతిహ్యం. సుమారు 10అడుగుల ఎత్తు, 25అడుగుల వెడల్పు కలిగిన ఈ శిలాచాపం అరుదైంది, అద్భుతమైంది. కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతమంతా సముద్రంతో కప్పబడి ఉండేది. భూపరిణామక్రమంలో భాగంగా పలుమార్పులు, చేర్పులు జరిగి, సముద్రం దక్షిణానికి తరలిపోయింది. ఈ నేపథ్యంలో ఏర్పడ్డ ఒకానొక భౌగోళిక స్వరూపమే శిలాతోరణం.



**చక్రతీర్థం-** దివ్యతీర్థాల నిలయం కాబట్టి తిరుమలకు మరో పేరు తీర్థాద్రి. 108 తీర్థాలను పురాణాలు ప్రముఖంగా పేర్కొంటున్నాయి. వీటిలో మేటి శ్రీస్వామి చక్రాయుధం పేరిట వెలసిన తీర్థరాజం చక్రతీర్థం. తిరుమల ఆలయానికి వాయువ్యంగా 3 కి.మీ దూరంలో శిలాతోరణం సమీపంలో ఒక లోయలో దర్శనమిచ్చే దివ్యస్థలం చక్రతీర్థం.

పద్మనాభుడనే విప్రుడిని ఒక రాక్షసుడు మింగబోతుండగా తన భక్తుణ్ణి రక్షించేందుకు శ్రీహరి ఆ రాక్షసుణ్ణి చక్ర ప్రయోగంతో వధించాడు. ఈ సన్నివేశానికి ప్రతీకగా సుదర్శన చక్రత్తాళ్వార్ ఇక్కడి ఓ బండకు వెలశాడు. శ్రీలక్ష్మీనృసింహస్వామివారు కూడా ఇక్కడ దర్శనమిస్తారు. వృశ్చికమాసం శుద్ధద్వాదశినాడు స్వామివారు భాజాభజంత్రీలతో వేంచేపు చేస్తారు.



**శ్రీఅభయాంజనేయస్వామిమందిరం-** మూలవిగ్రహం ఎప్పటినుండో ఉన్నప్పటికీ ఇటీవలి కాలంలో కొందరు స్థానికభక్తుల సహాయసహకారాలతో పురుడుపోసుకున్న ఆలయనిర్మాణం శ్రీఅభయాంజనేయ స్వామిమందిరం. తిరుమలగుడినుండి వాయువ్యంగా వేదపాఠశాలకు వెళ్లే మార్గంలో ఆహ్లాదకర అరణ్యప్రకృతిలో కొలువై ఉంటుంది ఈ మహిమోపేత ఆలయం.

పూర్వం తిరుమలకొండకు ఉన్న కాలిదోవల్లో మదనపల్లె మార్గంలోని భాకరాపేట కనుమదారి ఒకటి. అటునుంచి వచ్చే యాత్రికులు మొదట భాకరాపేట దగ్గర ఉన్న బాలవేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని సందర్శించి, రాత్రి అక్కడ నిద్రించి వేకువనే లేచి స్వామికోన అడవిమార్గం గుండా పులిబోను, టెంకాయనెట్టు మీదుగా తిరుమల చేరుకునేవారు. ఈ క్రమంలో ఏర్పడిందే విజయనగరరాజుల కాలంనాటి ఓ శిలామండపం. ఆ మండపచ్ఛాయలోని ఆంజనేయస్వామే ప్రస్తుతం శ్రీఅభయాంజనేయస్వామిగా పూజలందుకుంటున్నాడు. అయితే, ఆ పురాతనదోవ ఇప్పుడు వాడుకలో లేదు. ఈ గుడి దాపులనేగల తిరుమలకు ఓవరహెడ్ ట్యాంకులాంటి మూర్తి నాయనిచెరువు సైతం దర్శనీయస్థలమే!



**నాగలబావి-** స్థానికులు నాగలబావిగా పిల్చుకునే ఈ ప్రదేశం పేరు నాగ తీర్థం. ఇక్కడ ఒక పెద్దరాతిగుండుకు విశేషరీతిలో నాగులశిల్పాలు చెక్క బడి ఉంటాయి. దాపులనేగల ఒక కోనేరు మనోజ్ఞంగా కనిపిస్తుంది. శేషా చలం పేరు రావడానికి కారణమైన ఆదిశేషుడి రూపం సర్పానికి ప్రతీక. నాగులచవితి ఇక్కడ విశేషపూజ.

తిరుమలగుడికి దగ్గరగల వరాహస్వామి అతిథిగృహాల మీదుగా వెళ్లి రోడ్డు దాటి బాటగంగమ్మ గుడిని చేరుకుని అక్కడి నుంచి కొంచెం ముందుకు సాగి ఎడమప్రక్కకు తిరిగితే నాగతీర్థం చేరుకోవచ్చు.

**నక్షత్రవనం-** జాతకరీత్యా నక్షత్రాలు 27. ఒక్కో నక్షత్రానికి ఒక్కో దైవిక చెట్టు ప్రతీక. అలాంటి 27 నక్షత్రాలకు అన్వయిస్తూ 27 వృక్షజాతులతో నక్షత్రాకృతిలో తీర్చిదిద్దిన దివ్యవాటికే నక్షత్రవనం. తి.తి.దే. వారి అటవీ శాఖ ఈ నక్షత్రవనాన్ని రూపొందించింది. తిరుమల పాపవినాశనం మార్గంలోని పారువేటమండపం దగ్గర ఈ వనం ఉంటుంది. సంక్రాంతిని పురస్కరించుకుని శ్రీమలయప్పస్వామి వేటవినోదార్థం విచ్చేయడానికి తాళ్లపాక పెద్దతిరుమలయ్య ప్రభృతులు నిర్మించిన మండపసముదాయమే పారువేటమండపం. ఇటీవలే ఈ మండపాన్ని పునరుద్ధరించారు. ఆహ్లాదకర పరిసరాల్లో నయనానందకరమైన నక్షత్రవనంతో పాటు పారువేట మండపాన్ని కూడా దర్శించవచ్చు.





**కాల్‌తేరు-** 'కల్' అంటే తమిళంలో రాయి అర్థం. తేరు అంటే రథం. రాతిరథం. శ్రీస్వామివారికి భోగతేరుగా పిలిచే చిన్న బ్రహ్మరథం, కొయ్యరథం తెలుసుగానీ చాలామందికి రాతిరథం గురించి తెలీదు. తిరుమల టి.బి.గార్డెన్స్‌లో శ్రీవారి మెట్టు నడకదారిలో వచ్చి తిరుమలలో ప్రవేశించేవారికి ఎదురయ్యే దృఢ మండప నిర్మాణమే ఒకప్పటి రాతిరథం. నిజానికి ఈ మనోహర శిల్పశోభితమండపం పెద్దపెద్దరాతిచక్రాలు ధరించి తిరుమల ఉత్తర, తూర్పు మాఢవీధుల కూడలిలో ధీరగంభీరంగా నిలబడి ఉండేది. భక్తుల సౌకర్యార్థం ఈ వీధిమార్గాలను వెడల్పు చేసే క్రమంలో తి.తి.దే. ఈ రాతితేరును తరలించింది. అయితే, దాని భారీచక్రాలు మాత్రం భూమిలో కూరుకుపోయి లేవనెత్త సాధ్యం కాలేదు. విజయనగరచక్రవర్తులు శ్రీకృష్ణదేవరాయలు, అచ్యుతదేవరాయల ఆంతరంగిక అధికారి ఎల్లప్పనాయకర్ దీని నిర్మాత. శా.శ.1527 సం॥లో ఈ రాతిరథాన్ని తిరుమలలో నిలిపారు.



**క్షేత్రపాలకుడి గుండు-** తిరుమల క్షేత్రపాలకుడు రుద్రుడు. పూర్వం శ్రీవారి ఆలయంలో క్షేత్ర పాలకుడి శిలపేరిట పెద్దరాయి ఉండేది. రాత్రిళ్లు ఈ శిలగుండ్రంగా తిరుగుతూ కాపలా కాసేదట. ఒకరోజు అనుకోకుండా ఒక బాలుడు ఈ గుండు క్రిందపడి చనిపోయాడు. దాంతో, ఈ గుండును గుడికిదూరంగా గోగర్భతీర్థం దగ్గరకు తరలించారు. శివరాత్రిరోజు ఈ క్షేత్రపాలకుడి గుండుకు అర్చనలు, అభిషేకాలు ఘనంగా జరుగుతాయి. తిరుమలగుడికి ఈశాన్యంగా ఉన్న గోగర్భతీర్థం, పాండవతీర్థాలు సైతం దర్శనీయస్థలాలే!

**హత్తీరాంజీమఠం-** శ్రీస్వామివారి గుడికి ఆగ్నేయంగా కొంచెం ఎత్తైన ప్రదేశంలో ఉన్న రాజ భవనం లాంటి పెద్దభవనమే హత్తీరాంజీ మఠం. ఈ మఠం మూలపురుషుడు హత్తీరాంజీబావాజీ. స్వామివారి పరమభక్తుడు. స్వామివారితో స్వయంగా పాచిక లాడేవాడని ప్రతీతి. ఆంగ్లేయులు తిరుమల తిరుపతి, ఇతర అనుబంధ ఆలయాల పాలనాబాధ్యతలను హత్తీరాంజీమఠం



మహంతులకు అప్ప జెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానాల విచారణకర్తలుగా మఠం మహంతులు 1933 సంవత్సరం వరకు పని చేశారు. వారి హయాంలోనే భక్తుల సౌకర్యాలకోసం ఎన్నో పథకాలు, సేవలు ప్రవేశపెట్టబడ్డాయి.

నిర్మాణపరంగా ఎంతో కళాత్మకంగా గోచరించే ఈ మఠంలో మహంతు గద్దె, శ్రీస్వామివారు హత్తీరాంజీ బావాజీ పాచికలు ఆడిన ప్రదేశం, శ్రీకృష్ణాలయం, దశావతారాలు, హనుమ విగ్రహాకృతి దర్శనీయస్థలాలు.

**అనంతాళ్వాన్ పూదోట-** తిరుమల ఆలయానికి నైరుతి దిక్కున ఉన్న చూడచక్కని ఉద్యానవనమే అనంతాళ్వాన్ పూదోట. ఇది ఒక మహాభక్తుడి గాథకు సంకేతం. వైష్ణవవాఙ్మయపరిభాషలో శ్రీరంగం, విష్ణుకంచి భోగ, త్యాగమండపాలైతే, తిరుమల పుష్పమండపం. తిరుమలలో పుష్ప కైంకర్యానికి ఆద్యుడు తిరుమలనంబి అయితే, ఆ సదాచారాన్ని కొనసాగించిన మరో మహానుభావుడు అనంతాళ్వాన్.



శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ధ్వజావరోహణా నంతర మరుసటిరోజు బాగ్‌సవారీ ఉత్సవం చాలా వేడుకగా జరుగుతుంది. బాగ్ అంటే తోట అని అర్థం. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు పురిశైవారి తోటగా కూడా పిలిచే అనంతాళ్వాన్ తోటకు వేంచేపు చేస్తారు. అనంతాళ్వాన్ బృందా వనంలో వెలసిన పొగడచెట్టుకు పూజ జరుగు తుంది.

అనంతాళ్వాన్ చెరువు త్రవ్వుతూ ఉండగా ఓ బాలకుడి రూపంలో సహాయానికి వచ్చిన శ్రీస్వామి వారిపై ఆగ్రహంతో గునపం విసిరి, గడ్డం గాయ పరుస్తాడు. నెత్తురోడుతూ అడ్డదిడ్డంగా పరిగెడుతూ ఆ బాలకుడు గర్భగుడిలోకి వెళ్లి మాయమౌతాడు. ఇలా అప్రదక్షిణంగా ఆలయప్రవేశం చేసిన సందర్భానికి గుర్తుగా అదే రీతిలో బాగ్‌సవారి ఉత్సవం నిర్వహించడం విశేషం.

భక్తివిశ్వాసాలు తెలుసుకోవాలని ఉత్సుకత ఉండాలే గాని తిరుమల పరిసరాల్లో దర్శనీయస్థలాలకు కొదవలేదు. ఇంకా శంకుతీర్థం, తరిగొండవెంగమాంబ బృందావనం, జపాలితీర్థం, ఆకాశగంగ, పాపవినాశనతీర్థం, డ్యాములు, శిలాతోరణం వద్ద రాక్ గార్డెన్..... తదితర ఎన్నో ప్రదేశాలు, పురాణాలు ఐతిహ్యాలు, స్వామివారిలీలలు, మాహాత్మ్యాలు, జానపదకథనాలు, స్థానికులకథలతో మిళితమై భక్తజనులను ఆకట్టుకుంటూ వస్తున్నాయి.

ఓం నమో వేంకటేశాయ



16-07-2025న శ్రీవారి ఆణివరఆస్థానం సందర్భంగా శ్రీరంగం (తమిళనాడు) నుండి శ్రీరంగనాథస్వామి తరపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఇందులో భాగంగా తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి మఠంలో శ్రీవారి సారెకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, తి.తి.దే. ఛైర్మన్ శ్రీ బి.ఆర్.నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., తమిళనాడు దేవదాయశాఖ కార్యదర్శి శ్రీ శ్రీధరన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




మైసూరుమహారాజు జయంతిని పురస్కరించుకుని తి.తి.దే. పల్లవోత్సవం (21-07-2025) నిర్వహించింది. ఈ కార్యక్రమంలో తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, మైసూరు సంస్థానం ప్రతినిధులు, ఇతర తి.తి.దే. పాలకమండలిసభ్యులు పాల్గొన్నారు.



28-07-2025న భారత మాజీ ఉపరాష్ట్రపతి శ్రీ ఎం.వెంకయ్యనాయుడు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్. వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్., వీరికి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తి.తి.దే. పాలకమండలి సభ్యులు శ్రీ జి.భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అన్నమయ్య భవనం (తిరుమల) ఎదురుగా శ్రీవాణి దర్శన టిక్కెట్ల నూతన కేంద్రాన్ని ఇటీవల తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., గార్లు ప్రారంభించిన చిత్రం







28-07-2025న తి.తి.దే. హిందూ ధర్మప్రచారపరిషత్ వారు 'సద్గమయ' శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మప్రచారపరిషత్ కార్యదర్శి శ్రీ శ్రీరామ్‌రఘునాథ్, తి.తి.దే. విద్యాశాఖాధికారి శ్రీ వెంకటసునీల్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మలగన్న అమ్మ

– శ్రీమతి చెవుటూరి కుసుమకుమారి

గృహ లక్ష్మి



"అమ్మా! భగవతీ! సర్వమంగళోపేతుడైన శివుడు జగన్నిర్మాణశక్తివైన నీతో కూడితేగాని జగత్తును ఆవిర్భవింపచేయ సమర్థుడు కాడు. సృష్టిస్థితికారకులైన బ్రహ్మ, విష్ణువులు కూడా కదలుటకైన సమర్థులు కారు. అలాంటి త్రిమూర్తుల చేత కూడా పూజించబడే నిన్ను స్తుతించాలన్న, కనీసం నమస్కరించాలన్నా పూర్వజన్మసుకృతం ఉండాలి." అన్నారు ఆది శంకరులు. అయితే ఆ శివుణ్ణి కూడా శక్తి యుక్తంచేసే ఆ శక్తి ఎవరు? ఆమే ఆది పరాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి అయిన జగన్మాత. ఆమె మూలశక్తి.

పూర్వం మార్కండేయమహర్షి సృష్టికర్త అయిన బ్రహ్మ వద్దకు వెళ్లి ఇలా అడిగాడు–" పితామహా! బ్రహ్మదేవా! లోకంలో అతిరహస్యమై, పండితులను, పామరులను, సకలభూతాలను రక్షించేది, మీరు ఇంతవరకు ఎవరికీ చెప్పకుండా గుప్తధనంలా దాచి ఉంచింది అయిన ఒకానొక విషయాన్ని నాకు చెప్పండి" అని అడిగాడు.

అంతట విధాత "నాయనా! బ్రహ్మవేత్తవు. లోకోపకార పారీణుడవు అయిన నీవు అడిగినట్లు గోప్యం, పావనం, స్మరణ మాత్రంచేతనే రక్షించి సమస్తకోర్కెలనూ తీర్చే నవదుర్గకవచముంది. ముందుగా నవదుర్గల పేర్లు చెప్పెదను విను" అన్నాడు.

దుర్గాదేవి మొదట "శైలపుత్రి". ఆమె భక్తవాత్సల్య పూర్ణ. పూర్వమెన్నడో హిమవంతుడు తపస్సు చేసి ఆమెను కుమార్తెగా కోరాడు. హిమవంతుడు మంచుగుట్ట అని కూడా తలచక అతనికి సుతగా జన్మించింది. అందుచేతనే ఆ హిమగిరి రాజు దేవతలలో మాననీయుడైనాడు. అనుపమానమైన భక్తవాత్సల్యం చేతనే ఆమె తొలినామం **"శైలపుత్రి"**.

ఒక్కొక్క నామానికి ఒక్కొక్క విశిష్టత, ఒక్కొక్క వైచిత్ర్యం, ఒక్కొక్క ఫలం ఈ నవదుర్గానామాలకు శ్రుతిస్మృతి పురాణాలలో చెప్పబడ్డాయి.

సదా తపో ముద్రాంకిత, వేదవేద్య, వేద విహారిణి అయిన ఆ దుర్గాదేవి రెండోనామం **"బ్రహ్మచారిణి"**. ఈమె శివుని పతిగా కోరి తపించిన నగరాజకన్య. ఈమె నారాధిస్తే మనస్సుకు ఏకాగ్రత కలుగుతుంది, సూక్ష్మమైన భగవత్తత్త్వం మీద మనస్సు స్థిరపడుతుంది. చెప్పనలవి కాని లావణ్యాతిశయంతో చంద్రునివంటి స్వచ్ఛమైన పానపాత్రను చేత ధరించి, నిత్యానందమనే రసపానం చేత సమస్తప్రాణికోటిని ఆహ్లాదంలో ముంచెత్తే ఆ తల్లి మూడవ పేరు **"చంద్రఘంటా"**. ఈ చంద్రఘంట సమారాధనం చేత మనస్సులోని కుత్సితం, క్రూరం అయిన భావపరంపర నశించి, స్వచ్ఛం, పవిత్రం అయిన స్వభావంతో లోకాన సిగపూవుగా వెలుగొందుతారని ప్రసిద్ధి.

ఆధ్యాత్మికం, ఆధిభౌతికం. ఆధిదైవికం అని లోకంలో దుఃఖాలు మూడు విధాలు. జ్వరాది శారీరకరోగాలు, శోక మోహాదుల వల్ల కలిగే మనోవ్యాధులు ఆధ్యాత్మికాలు. పాములు, తేళ్లు, క్రూరజంతువుల వల్ల కలిగే ఉపద్రవాలు ఆధిభౌతికాలు. అతివృష్టి, అనావృష్టి, కరవుకాటకాది ప్రకృతి వైపరీత్యాలు ఆధిదైవికాలు, ఈ మూడు

## శరన్నవరాత్రుల్లో అఖండ దీపం ఏ రోజున వెలిగించాలి?

**పూజ ఆరంభంలోనే అంటే తొలిరోజునే అఖండ దీపాన్ని వెలిగించాలి. ఉదయవేళలోనే దీపారాధన, కలశస్థాపన చేయాలి. రాత్రిపూట పూజలు చేసేవారు కూడా తొలిరోజు ఉదయ వేళలోనే దీపారాధన, కలశస్థాపన చేయాల్సి ఉంటుంది. మన సంప్ర దాయాన్ని అనుసరించి ప్రతిసారి దైవారాధనలో దీపం వెలిగించాల్సిందే! అఖండ దీపారాధనలో రెండు పెద్ద ప్రమిదలు తీసుకుని ఒకదానిలో ఒకటి ఉంచాలి. అందులో మూడువత్తులు వేయాలి. దీపాన్ని తూర్పువైపు వెలిగే విధంగా పెట్టాలి. దీపం తూర్పువైపు వెలిగితే శాంతి చేకూరుతుంది. ఉత్తరంవైపు ధనధాన్యవృద్ధి కలుగుతుంది. పడమటివైపు శత్రుపీడ, అనారోగ్యం. దక్షిణంవైపు పెట్టే దీపాన్ని యమదీపం అని పిలు స్తారు. మొత్తంమీద తూర్పు, ఉత్తరం దిక్కులలో దీపాన్ని వెలిగేలా ఉంచితే అన్ని విధాలా మంచిది. దీక్ష కొనసాగినన్ని రోజులూ అఖండదీపం కొండెక్కకుండా చూచుకోవాలి. రాత్రింబవళ్లు దీపాన్ని చూసుకుంటూ ఉండడం కష్టసాధ్యమైన వారు అఖండదీపాన్ని వెలిగించకపోవడం మంచిది. ప్రతివారూ తప్పని సరిగా అఖండదీపం వెలిగించాలన్న నియమం లేదు. ప్రతిసారి పూజాప్రారంభంలో దీపారాధన చేసినా సరిపోతుంది.**



తాపాలు గల సంసారమనే జగత్తుయొక్క అండాన్ని ఉదరంలో ధరించి రక్షించే మాయారూపిణి అయిన జగన్మాత నాల్గవ పేరు **"కూష్మాండ".**

ఈ ప్రపంచంలో గర్భస్పర్శలేని ప్రాణి ఉండదు. అమ్మ లేకపోతే "అహం" అనగా నేను అని చెప్పుకునే వీలులేదు. ప్రాణికి ఎన్నో జన్మలు. ఎందరో తల్లులు. ఏ అమ్మగురించి చెప్పాలి? ఏ అమ్మను పిలవాలి? ఏ అమ్మ పలకాలి? అందుకే చరాచరజగత్తుకే అమ్మ మూలపుటమ్మ, కడుపారడి ఎరిగిన అమ్మ ఆ దుర్గమ్మ. ఆమె "స్కందమాత", కుమారస్వామికి కార్తికేయుడు, స్కందుడు అని కూడా పేర్లు. ఆ స్కందుని మాత స్కందమాత. అలాంటి దివ్యగర్భ ఐదవనామం **"స్కందమాత".** జ్ఞానులై, జన్మరాహిత్యాన్ని కోరేవారు స్కందమాత గర్భంలో పుట్టాలని కోరుకుంటారు. ఈమెను పూజించిన స్త్రీలు సత్సంతా నవతులు అవుతారనీ, సర్పభీతి ఉండదనీ, గర్భశుద్ధి కలిగి చక్కని పాండిత్యం లభిస్తుందనీ జ్ఞానుల ఉవాచ.

ఆ దేవి, దేవతల కార్యార్థం ఒకసారి కతుదు అనే మునిపుంగవుని ఆశ్రమంలో పుట్టి పెరుగుట చేత, బ్రహ్మవేత్తల మనస్సులందు సదా వసించుటచేత, సమస్తదేవతలతేజస్సుతో ఆవిర్భవించడం చేత ఆ దివ్యదుర్గ ఆరవ నామం **"కాత్యాయని".**

ఈమెను కొలిచిన వారికి వేద విజ్ఞాన సర్వస్వమూ కరతలామలకమగునని ఋషివాణి. మృత్యువునకే భయకారిణి, ప్రళయకాలంలో యముణ్ణికూడా నశింప చేయగలదీ అయిన మూలశక్తి కాలస్య రాత్రిః **"కాలరాత్రి"** అని పిలువబడు తోంది. ఈ కాలరాత్రీదేవిని ఉపాసించి స్వాత్మా రామపంజరంలోని ఆత్మశక్తిని గ్రహించి నిర్భీతితో శివశక్తియుక్తులు కాగల రని ఈశ్వర ఉవాచ. ఈమె ఏడవ దుర్గ.

పుట్టుకచేతనే నల్లనివర్ణం కలిగిన పరమే శ్వరిని, భర్త అయిన పరమేశ్వరుడు ఒకసారి పరి హాసంగా "కాళీ" అని సంబోధించాడట. అంతట శివాని శంభునితో పంతగించి, బ్రహ్మను గూర్చి తపస్సుచేసి, ఆ నల్లని దేహకోశాన్ని వదలి, శివునకు ధీటుగా తెల్లనిఛాయతో **"మహాగౌరి"** అయింది ఈ ఎనిమిదవ దుర్గ. ఈమె నారాధిం చినవారికి అజ్ఞానాంధకారం పటాపంచలౌతుందని, స్త్రీలు దీర్ఘ సుమంగళులుగా కలకాలం జీవిస్తారనీ, అష్టైశ్వర్యాలు పొందు తారనీ ప్రసిద్ధి. గౌరీ ఉపాసనచేత మంత్రఫలం చాలా తర్వాత లభిస్తుంది.

అణిమ, లఘిమ, గరిమ, మహిమ, ప్రాప్తి, ప్రాకామ్య, ఈశత్వ, వశిత్వ మొదలైన అష్టసిద్ధులను, మోక్షసిద్ధినీ ప్రసాదిం చేదీ, లౌకిక, అలౌకిక సర్వార్థసిద్ధులకూ అధిష్ఠాత్రి అయిన తొమ్మిదవ దుర్గనామం **"సిద్ధిదా".** శరీరాంగాల సమూహంలాగా ఈ నామాలలో భేదం ఉన్నా, అన్నీ ఒకే దుర్గ అంశలే. ధ్యాన యోగ్యాలుగా అన్ని పేర్లూ శాస్త్రాలలో చెప్పబడ్డాయి. ఈ నవ దుర్గలను ఆరాధించిన వారికి, శరణుకోరిన వారికి ఎలాంటి కష్టాలూ ఉండవు.

దుర్గశత్రునాశకమైన శక్తివాచకం. కనుకనే దేవికి పర్యాయపదమైన "దుర్గా" శబ్దం ఉచ్చరించినా స్మరించినా పాపా లన్నీ నశిస్తాయని సాక్షాత్తు పరమశివుడు చెప్పిన మాట అని

సర్వలోకపితామహుడైన బ్రహ్మ, మార్కండేయమహామునికి విశదీకరించాడు. పూర్వం రురుడు అనే రాక్షసుని కొడుకు దుర్గముడు అనేవాడు తనకు మగవారి వల్ల చావులేకుండునట్లు బ్రహ్మనుండి వరాన్ని పొంది లోకాలను పీడించసాగాడు. వాడిని వధించ డానికి దేవి మహిషాసురమర్దినిగా ప్రభవించింది. మహిషా సురుణ్ణి వధించడానికి వెయ్యిచేతులతో దిక్కులన్నీ మూసేస్తూ, కిరీటంతో ఆకాశాన్ని గిరుతూ, పదఘట్టనల చేత భూమిని క్రుంగదీస్తూ మహోగ్రరూపిణి అయినది. అప్పుడు దేవతలు "అమ్మా! ఈ రూపం మహిషాసురుని వంటి రాక్షసుల వధకే గానీ, మాకు భరించశక్యంకాదు. ఈ దివ్యాస్త్రాలు, ఖడ్గాది ప్రహరణాయుధాలు నీ చేతిలో ఉండగా నీ ముఖాన క్రోధ జ్వాలలు ప్రజ్వరిల్లుతుంటే, మూలప్రకృతివి, లోకాల నేలే తల్లివి అయిన నిన్ను మేం ఎలా సమీపించగలమమ్మా! నీవు ఆర్తిని పోగొట్టే భవసాగర నౌకవు తల్లీ!" అని వేడుకోగా, కరుణారస సంపూర్ణ అయిన ఆ దేవి జగదధిష్ఠాత్రి అయిన రాజరాజేశ్వరిగా సింహాసనైశ్వర్యగా అవతరించింది.

"ప్రతిసంవత్సరం శరదృతువులో ఆశ్వయుజశుక్ల పాడ్యమి మొదలు నవమివరకు దుర్గోత్సవం పేర పూజోత్స వాన్నీ, సంవత్సరప్రారంభంలో చైత్రశుక్లపాడ్యమి మొదలు నవమివరకు వసంతనవరాత్రుల ఆరాధన చేసినా, ఆ తొమ్మిది రోజులూ నాచరిత్రను వినివా, ఇహలోకంలో ఆయురారోగ్య ఐశ్వర్యాలతో, సత్పుత్రపౌత్రులతో, సమస్తసుఖశాంతులు పొంద గలరని, వరమిచ్చింది. నాటినుండి తల్లి దుర్గమ్మ, శ్రీరాజరాజే శ్వరిగా లోకాలను పాలిస్తూ, బాలాత్రిపురసుందరిగా కోరిక లీడేరుస్తూ, అన్నపూర్ణగా ఆకలి తీరుస్తూ, లలితగా లాభిస్తూ, సరస్వతిగా సకలవిద్యలనూ ప్రసాదిస్తూ అనేక అంశలతో అర్చా మూర్తిగా ఆరాధించబడుతోంది.

త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు సీతావియోగ దుఃఖంలో ఉండగా, నారదమహర్షి ఆయనను శరన్నవరాత్ర పూజచేయమనీ, రావణవధకు సమృద్ధశక్తిని దుర్గాదేవి నీకు ప్రసాదిస్తుందనీ చెప్పగా సుగ్రీవాదుల అండతో దుర్గనర్చించాడు దాశరథి. దుర్గ సింహవాహినిగా రామునకు దర్శనమిచ్చి, దశమి నాడు దండెత్తుమని చెప్పిందని ప్రమాణం. పాండవులు అజ్ఞాత వాసానికి వెళ్లేముందు ధర్మరాజు చేత, కురుక్షేత్ర యుద్ధా రంభానికిముందు, శ్రీకృష్ణపరమాత్మ అర్జునుని చేత దుర్గాస్తవం చేయించాడు. ఈ విధంగా అనాదిగా ప్రతివ్యక్తీ శక్తి ఉపాసకుడే!



**దుర్గాదేవికి గల తొమ్మిది రూపాలే నవదుర్గలు**

శుద్ధస్ఫటికరూపిణి, బ్రహ్మ తేజస్విని, అయిన దేవి మహిషా సురమర్దనకై ఇంద్రకీలాద్రిపై కనక దుర్గ పేరున కృష్ణానదీతీరాన వెల సింది. ఆమె తూర్పున ఐంద్రి, పడమర వారుణి, ఉత్తరాన కౌమారి, దక్షిణదిక్కున శ్రేష్ఠధర్మదేవతాశక్తిగా హంసవాహని అయి లోకాలను కాపాడుతోంది.


అమ్మ దుర్గమ్మ అందాల మూలప్రకృతి. నగరాజపుత్రి. సౌకుమార్యసౌందర్యలహరి. మల్లేశ్వర హృదయసామ్రాజ్య పట్టమహిషి. ఆ తల్లి దయాదృష్టికోసం దూరదూరాలనుండి వచ్చే ఆమె బిడ్డలైన భక్తులమీద కరుణాంతరంగయై సుఖ శాంతుల్ని వర్షించే జ్ఞానసిద్ధిని ప్రసాదించమని నవరాత్ర శుభ దినాలలో దుర్గామాతను కొలిచి కోరుకుందాం!!

## జూలై నెల క్విజ్-36 సమాధానాలు

| | |
|---|---|
| 01) మృకండమహర్షి | 11) శ్రీకృష్ణపరమాత్మ |
| 02) తల్లి | 12) ఉపాయం |
| 03) విష్ణుసహస్రనామస్తోత్రం | 13) జెలోటాలజీ |
| 04) ఏనుగు | 14) సాందీపనిమహర్షి |
| 05) బృహస్పతి | 15) పళముదిర్చోలై |
| 06) గోపద్మవ్రతం | 16) మృత్యుంజయవిద్య |
| 07) గరుడమేరుపచ్చ | 17) దేగ |
| 08) కశ్యపప్రజాపతి | 18) కృష్ణజీరక |
| 09) శుక్రాచార్యుడు | 19) ఆషాఢశుద్ధఏకాదశి |
| 10) సరస్వతీదేవి | 20) కచుడు |

సరైన సమాధానాలు వ్రాసినవారు-1)చిప్ప చిన్మయి, పోచారం 2)పులికంటి చైత్ర, హైదరాబాదు 3)టి.ఎన్. అగస్త్యదర్శన్, చిత్తూరు 4)సూరంపూడి సత్యసూర్య అభయరామ్, అలంపురం 5)జె.పూర్వజ్, ధర్మవరం 6)వేదాన్ష్ సంపత్, గాజువాక 7)ఎన్.గౌతమ్ మహేష్, కాకరపర్రు 8)హ్రిదాన్‌రెడ్డి, బెంగళూరు 9)కోమటిరెడ్డి ఆదిత్య, కరీంనగర్ 10)జోగంటి చాద్విక్, ధర్మవరం 11)కె.హర్షిత్‌కుమార్, సిరిసిల్ల 12)క్రిష్టిపాటి భార్గవ్, హైదరాబాదు 13)భట్టిప్రోలు సూర్యకృష్ణవిరాజ్, బెంగ ళూరు 14)సుంకరి సాత్త్వికి, మెదక్ 15)జి.అతులిత్ రెడ్డి, హైదరాబాదు 16)జె.లక్ష్మణ్‌వీర్, కుప్పం 17)బి.అక్షయ, యానాం 18)జి.ప్రశాంతి, యానాం 19)బలివాడ సాధ్విక, రెడ్డిపేట 20)సాయిసాహిత్య, కుప్పం 21)బి.శివప్రణీత్, హిందూపురం 22)ఏ.సృజనగాయత్రి, ప్రొద్దుటూరు 23)మాచిరాజు విష్ణువందన, విజయవాడ 24)యామర్తి శ్రీనివాససత్కృత్, బెంగళూరు, 25)మేడపాటి కార్తిక, కుతుకులూరు 26)పి.ప్రేమ్‌కుమార్, ఖమ్మం 27)కె.అభయకృష్ణ, హైదరాబాదు 28)డి.ఎస్.వి.కె.లక్ష్మీసాహితి, తిరుపతి 29)టి.పి.ఎన్.ఆశ్రిత్, ఏలూరు 30)భట్టి ప్రోలు షణ్ముఖవిరాట్, బెంగళూరు 31)నగరం సుహాంత్ అమర్త్య, తిరుపతి 32)వై.సాయివాణి,బెంగళూరు 33)కె.వ్యాస,కె.పూజిత,డి.సుప్రియ,విజయవాడ.

ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్
97388 59553

*గత సంచిక తరువాయి భాగం....*

**యదుగిరి తిరునారాయణస్వామి సన్నిధి**

అందరూ ఆలయంలోకి ప్రవేశించారు. లోపలికి వెళ్లేటప్పుడు శెల్వనారాయణస్వామిని చూడగలిగారు. కానీ నేరుగా స్వామి సన్నిధికి వెళ్లలేదు. ముందుగా వారంతా అపార కరుణామయి యదుగిరి నాచ్చియార్ మూలవిగ్రహ సన్నిధికి చేరుకున్నారు. అమ్మవారు గంభీర ముద్రలో విరాజిల్లుతుండగా ఆమె ఎదురుగా శ్రీచెలువనాయకిగా కీర్తికెక్కిన మూలవిగ్రహ ప్రతిరూపం దర్శనమిచ్చింది.

చివరకు పేశుమ్ యతిరాజసన్నిధికి చేరుకుని వారి పక్కనే విరాజమానులైన పిళ్ళైలోకాచార్యులను దర్శిస్తారు. యాత్రికులు మొదట యదుగిరి నాయకి దర్శనానికి చేరుకున్న కారణమేమిటంటే జగత్పిత తిరునారాయణస్వామివారి పట్ల కినుకగా ఉంటే, తల్లి అపారకరుణామయి. ఆ అమాయకులను క్షమించి ఆశీర్వదించమని స్వామివారికి విన్నవిస్తుంది.

అప్పుడు అందరూ శెల్వనారాయణ లేదా తిరు నారాయణ సన్నిధిలోకి(గర్భగుడి) ప్రవేశిస్తారు; యదుగిరిస్వామి ఎంత మహిమాన్వితంగా దర్శనం ఇస్తున్నాడో! ఎంతో పొడవుగా, రాజగంభీరముద్రలో నిటారుగా నిలబడి ఉన్నాడు. మధురమైన మందహాసంతో భక్తులను స్వాగతిస్తూ, 'మిమ్మల్ని రక్షించడానికే నేను ఇక్కడ ఉన్నాను' అని చెబుతున్నాడు; పై చేతులలో శంఖుచక్రాలు, దిగువ ఎడమచేతిలో గద, క్రిందికుడి చెయ్యి అభయముద్రలో ఆశీర్వదిస్తూ 'నేను ఇక్కడే మీ చెంతన ఉన్నాను' అని ధైర్యం చెబుతున్నట్లుంది.

ఇక్కడ ఒక ప్రత్యేకత ఏమిటంటే, మహాలక్ష్మి వక్షః స్థలంలోనే గాక స్వామి పాదాలవద్ద కూడా ఉంది; పాదాల వద్ద ఉన్న అమ్మవారిని వరనంది అని కూడా పిలుస్తారు.

అందరూ భగవద్రామానుజాచార్యుల సన్నిధికి చేరుకుంటారు. అక్కడ వారి మూలమూర్తి ఉపదేశముద్రలో, ఉత్సవ మూర్తి అంజలిముద్రలో ఉన్నారు. ఈ మూర్తిని పేశుమ్ యతి రాజర్ అని కూడా అంటారు. మూర్తి నుండి ఆశ్చర్యకరమైన తేజస్సు వెలువడుతూ కనిపించింది. ఈ మూర్తిని 'తమరుగండ తిరుమేని' అని కూడా అంటారు.

భగవద్రామానుజులు మేల్కోటే విడిచి శ్రీరంగానికి తిరిగి వెళ్లాలనుకున్నారు. ఆయన వియోగం సహించలేక స్థానిక శిష్యులందరూ కూడా ఆయనతో వెళ్లాలనుకున్నారు; కానీ యతిరాజులు శిష్యులను తన మూర్తిని చెక్కమని కోరారు. ఒక శుభదినాన రామానుజులు ఆ మూర్తిని ఆలింగనం చేసుకోవడం ద్వారా ఆ మూర్తిలో తమ శక్తినంతటినీ పొందుపరచారు. "మీకు ఏ సందేహం వచ్చినా దయచేసి నా మూర్తిని అడగండి, వెంటనే మీకు సమాధానం లభిస్తుంద"ని ఆయన సెలవిచ్చారు. అందువలన ఆ మూర్తిని 'పేశుమ్ యతిరాజర్' అని అంటారు.

ఇక తర్వాతి సన్నిధి స్వామి పిళ్లైలోకాచార్యులది. వారు శ్రీరంగం మతద్వేషంతో అల్లకల్లోలంగా ఉన్న సమయంలో తాము వృద్ధులైనా రంగనాథుని ఉత్సవ విగ్రహాన్ని ఆక్రమణ దారులనుండి రక్షించారు. ఆయన త్యాగం, కృషి కారణంగా మాత్రమే మనం ఈ రోజు శ్రీరంగంలో నంబెరుమాళ్ ఉత్సవ మూర్తిని చూడగల్గుతున్నాం.

*(ఇంకా ఉంది)*

## శ్రీవేంకటేశ్వరలీలలు



# ఎప్పటికీ ఋణపడే ఉంటాం!

– శ్రీ బి.గురుకుమార్ రెడ్డి, 94400 07216

ఈ సంఘటన మే, 2021 కోవిడ్–19(సెకండ్‌వేవ్) నాటిది. మొదట నాకు జ్వరం వచ్చింది. నేను జ్వరానికి సంబంధించిన మాత్రలు వేసుకుంటూ ఇంట్లో వారికి దూరంగానే ఉన్నాను. తర్వాత రోజు మా పాపకు గొంతునొప్పి వచ్చింది. డాక్టరుకు చూపిస్తే "మీరు, మీ పాప కోవిడ్ టెస్ట్ చేసుకుని, వాట్సప్‌లో రిపోర్ట్సు పెట్టండి. దాన్ని చూసి ట్రీట్‌మెంట్ చెబుతాను. అంత వరకు ఇవి వాడండి" అని కొన్ని మందులు వ్రాసిచ్చారు. ఈ లోపల మా నాన్నగారికి కూడా ముక్కు వాసన జ్ఞానం కోల్పోవడంతో కోవిడ్‌పరీక్షలకోసం మేమంతా తిరుపతిలోని పద్మావతీ ఆసుపత్రిలో శాంపుల్స్ ఇచ్చి వచ్చాం.

ఆ తర్వాతి రోజు ఉదయం కోవిడ్ శాంపుల్స్ పరీక్షలో నాకు, మా నాన్నకు పాజిటివ్ అనీ, పాపకు నెగిటివ్ అనీ తెలిసింది. కొంతలో కొంత మా పాపకు నెగిటివ్ వచ్చిందనే సంతోషం, మరోపక్క నాతోపాటు, కిడ్నీ పేషంటైన మా నాన్నకు పాజిటివ్ వచ్చిందనే బాధ కూడా ఉంది. మా పాపను చూసిన డాక్టర్‌కు రిపోర్టులు పంపిస్తే, "ఇంతకు ముందు వ్రాసిచ్చిన మందులనే పాపకు వాడండి, మీరు, మీ నాన్నగారు వేరే డాక్టరును సంప్రదించండి. క్వారంటైన్‌లో ఉండండి" అని చెప్పారు.

ఇప్పుడు వచ్చిన ప్రధాన సమస్య ఏమిటంటే, ఏ డాక్టరును సంప్రదించాలి? ఏ మందులు వాడాలి? మా ఇల్లేమో చిన్నది. క్వారంటైన్‌లో ఉండాలంటే, ఉండడానికి అదనంగా గది లేదు. ఎలా చేయాలి? ఏమి చేయాలి? అని నా మదిలో ప్రశ్నలు మెదులుతూనే ఉన్నాయి. ఏమి చేయాలో దిక్కు తోచలేదు. మేము పద్మావతీశ్రీనివాసులనే తలచుకుంటున్నాం. అంతలో నా మనసుకు "మా నాన్నగారు స్విమ్స్‌లోని నెఫ్రాలజీ విభాగాధిపతి డా॥రామ్ గారి దగ్గరే చికిత్స తీసుకుంటున్నారు. ఆయనే ఇప్పుడు కోవిడ్ కేసులు కూడా పర్యవేక్షిస్తున్నారు. కాబట్టి, నాన్న గారికి ఏ ఇబ్బంది లేకుండా ఏ ఏ మందులు వాడాలో ఆయనను అడిగి తెలుసుకోవాలనిపించింది.



ఆకలికి అన్నం,
వేదనకు ఔషధం
పరమాత్మని సన్నిధి

వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ డాక్టరును సంప్రదించడానికి పద్మావతీ ఆసుపత్రికి వెళ్లాను. అక్కడి పరిస్థితి చూస్తే ఒక్కసారిగా భయం వేసింది. అక్కడి ప్రాంగణమంతా జనంతో నిండి ఉంది.

వీరంతా ఎవరని అక్కడున్న వ్యక్తిని అడుగగా– "ఆసుపత్రిలోనికి రోగి సహాయకులను ఎవరినీ అనుమతించడం లేదు. అక్కడ 'క్యూ'లు కనిపిస్తున్నాయి కదా! ఆ క్యూలో వెళ్లి వారికి సంబంధించిన పేషంటు వివరాలు చెప్పి రావాలి. కొంత సేపయ్యాక, ఆసుపత్రి సిబ్బంది ఆ రోగి పేరుని మైకులో అనౌన్సు చేస్తారు. అప్పుడు మనం ఆసుపత్రి ప్రవేశద్వారం దగ్గరకు వెళితే, రోగి పరిస్థితి వివరాలు చెబుతారు. ఇక్కడున్న వారంతా లోపలున్న రోగులకు సహాయకులుగా వచ్చినవారే!" అని చెప్పాడు. ఆసుపత్రిలో పడకలు సరిపోకపోతే, తి.తి.దే. వారే ఆసుపత్రి ముందున్న రోడ్లపైనే తాత్కాలికంగా జర్మన్ షెడ్స్ వేసి, అందులో కూడా రోగులను చూసుకుంటున్నారని తెలుసుకున్నాను. సమస్య ఎంత తీవ్రంగా ఉందో నాకు అర్థమైంది.

"ఇంతమందినీ దాటుకుని ఆసుపత్రిలో ఉన్న డాక్టరు గార్ని ఎలా కలవాలి స్వామీ! ఏదైనా దారి చూపించు స్వామీ!" అని వేడుకుంటున్నాను. కొంతసేపటికి డాక్టరుగారు ఆసుపత్రి

ప్రాంగణం రోడ్డులో వేసిన జర్మన్‌షెడ్స్‌లోని రోగుల దగ్గరకు వెళ్లారు. నేను తి.తి.దే.లోనే పనిచేస్తున్నాను. కనుక లాక్‌డౌన్ సమయంలో డ్యూటీకి రావడానికి కోవిడ్ డ్యూటీ పాస్ ఒకటి ఇచ్చారు. అది ఉండడం వల్ల ఏదోవిధంగా ఆ డాక్టరును కలవ గలిగాను. ఆయన మా నాన్నగారికి, నాకు ఏ మందులు వాడాలో రాసి ఇచ్చారు. అక్కడి నుండి బయటపడ్డాను. అంతలో అక్కడున్న ఒకరు "మీ నాన్న గారు తి.తి.దే. ఉద్యోగి కాబట్టి, శ్రీనివాసం దగ్గర ఉన్న మాధవం అతిథిగృహంలో మెడికల్ కిట్ ఇస్తున్నారు. వెళ్లండి" అని చెప్పారు. అక్కడ నుండి నేరుగా మాధవం వెళ్లి మెడికల్ కిట్ తీసుకున్నాను. అప్పుడు తెలిసిందేమిటంటే మాధవం అతిథిగృహాన్ని తి.తి.దే. ఉద్యోగుల కోసం క్వారంటైన్ కేంద్రంగా మార్చారని, అక్కడున్న రోగులకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారని, వారిని నిత్యం డాక్టర్లు పర్యవేక్షిస్తారని తెలిసింది.

ఇక ఆలస్యం చేయక ఇంటికి వెళ్లి విషయాలన్నీ చెప్పాను. అన్నీ సర్దుకుని, ఇంట్లో ఉన్న శ్రీపద్మావతీ అమ్మవారికి, శ్రీవేంకటేశ్వరస్వామివారి చిత్రపటాలకు హారతిచ్చి "ఈ సమస్య నుండి దాటించు స్వామీ!" అని మొక్కుకుని నేనూ, మా నాన్న మాధవం చేరుకున్నాం.

అక్కడ నాకు, మా నాన్నకు కలిపి ఒక గది కేటాయించారు. గదిలోకి వెళ్లగానే, కన్నీళ్లు వచ్చాయి. ఏ మందులు వాడాలో, ఏ డాక్టరును కలవాలో? ఎక్కడ 14 రోజులు క్వారంటైన్‌లో ఉండాలో? తెలియని మాకు ఓ దారి చూపించారా! అని అమ్మవారిని, అయ్యవారిని తలచుకుని అనాథరక్షక గోవిందా! ఆపద్బాంధవ గోవిందా!! అని స్తుతించాను.

అలా రెండు, మూడురోజులు బాగానే ఉన్నాం. ఓ రోజు మా నాన్నగారు ఉదయం బ్రష్ చేసుకోవడానికి వెళ్తూ కళ్లు తిరిగిపడిపోయారు. నేను ఆయన్ను తీసుకుని వచ్చి బెడ్ మీద పడుకోబెట్టాను. నావల్ల కాలేదు టిఫిన్ వద్దు, భోజనం వద్దు అనేవారు. జ్వరం కూడా ఎక్కువగానే వచ్చేది. నాన్నేమో అపస్మారకస్థితిలో ఉన్నారు. అక్కడి డాక్టర్లకు చెప్పగా ఉన్న మాత్రలు వాడండి తగ్గుతుంది అనేవారు. ఏమి చేయాలో తోచేది కాదు.

ఈ ఆపత్కాలంలో వేంకటేశ్వరస్వామిని తలచుకుంటూ '*తల్లివి నీవే.. తండ్రివి నీవే...*', పద్మావతీ అమ్మవారిని తలచుకుంటూ '*జననీ శివకామిని..*' అనే భక్తిపాటలు, ఇంకా మృత్యుంజయ మహామంత్రం, వేదమంత్రోచ్చారణలు నిత్యం మా నాన్న గారి చెవుల దగ్గర పెట్టేవాడిని. అవి ఆయన సబ్ కాన్షియస్‌మైండ్‌లోకి వెళ్లి అపస్మారకస్థితి నుండి బయటపడతారని నా భావన. రాత్రింబవళ్లు ఆయన దగ్గరే కూర్చుని తూలుతూ, నిద్ర ముంచుకొచ్చేస్తే అటు, ఇటు నడుస్తూ ఆయన్నే కనిపెట్టుకుని ఉన్నాను. తర్వాతర్వాత నిదానంగా జ్వరం తగ్గింది. క్వారంటైన్ ముగించుకుని ఇంటికి వచ్చాం. రెండు, మూడురోజులకు పూర్తిగా నయమైంది. ఇప్పుడు అంతా క్షేమంగా ఉన్నాము.




ఈ రోజు మాలాంటివారు ఎందరో కరోనా నుండి క్షేమంగా బయటపడి, ఆరోగ్యంగా ఉన్నారంటే అది ముమ్మాటికీ తి.తి.దే. వారి సహకారమే!

ఇదంతా ఆ అలమేలుమంగమ్మ, శ్రీవేంకటేశ్వరుల దయే తప్ప మరొకటి కాదు! వారు ఆపద్బాంధవులై, ఆరోగ్య ప్రదాతలై సదా మమ్మల్ని రక్షిస్తున్నారు. అందుకు మా కుటుంబమంతా ఆజన్మాంతం ఋణపడే ఉంటాం!

# బాధలు పోగొట్టే తల్లి!

- కుమారి ఆర్.జయశ్రీ కాశీకర్, 90140 45853

పశ్చిమసముద్రతీరకర్ణాటక రాష్ట్రం, దక్షిణ కన్నడజిల్లాలో ఎటుచూసినా ఒకదాని తరువాత మరొకటి పరుసగా పడమటి కనుమల మధ్య ఎత్తైన కొండలు కనువిందు చేస్తాయి. కొండల నిండా ముదురు ఆకుపచ్చ రంగు పులుముకున్న చెట్టు చేమలతో దట్టమైన అడవులు, ఆ అడవుల మధ్య కోనేరు, ఆ సమీపంలో వెలసిన అందమైన గ్రామం కొల్లూరు.


కుటచాద్రి కొండ కొల్లూరుకు మకుటంలా కనిపిస్తుంది. కొండచుట్టూ వెండివడ్డాణంలా గలగల పారుతున్న సౌపర్ణికా నది. ఆ నదికీ కొండకూ మధ్య కొల్లూరు గ్రామం నుదుటి తిలకంలా వెలుగొందుతోంది శ్రీమూకాంబికాదేవి ఆలయం!



ఆదిశంకరాచార్యుల 'సౌందర్యలహరి'లో ఆదిపరాశక్తిని స్తుతించారు

**దక్షిణ కన్నడజిల్లాలోని ఉడుపి క్షేత్రానికి అత్యంత సమీపంలో కొల్లూరు నుండి 30కి.మీ. దూరంలో ఉంది. ఈ గ్రామంలో ఆదిపరాశక్తి 'మూకాంబికా' అన్న పేరుతో వెలసింది.**

స్కందపురాణంలో ఈ కొల్లూరు క్షేత్రమహిమ వర్ణింపబడింది. కృత యుగంలో కోలమహర్షి విన్నపంమేరకు, ఆదిపరాశక్తి పరమేశ్వరునితో కూడి లింగరూపంలో ఉద్భవించి మూకాసురుడనే రాక్షసుణ్ణి వధించింది. అందుకే ఈ క్షేత్రానికి 'కోలాపురి' అని, అమ్మవారిని 'మూకాంబికా' అని పిలుస్తారు. వాడుకలో కోలాపురి కొల్లూరు అయింది.



శ్రీలక్ష్మి, శ్రీసరస్వతి, శ్రీమహాకాళి– ఈ ముగ్గురు దేవేరుల సమ్మిళితరూపంగా కొలిచిన కారణంగా ఈ దేవికి 'మూకాంబికా' అన్నపేరు వచ్చిందని ఒక కథనం ఉంది. అందుకే సంపదలు కోరేవారు, కళాకారులు, తంత్రవిద్యను అర్థించేవారందరూ ఈ దేవిని కొలిచి, తరిస్తారు. ఆ ఆలయాన్ని దర్శిస్తే మనసుకు ఆహ్లాదం, ఒక కొత్త స్ఫూర్తి కలుగుతుంది.

ఔషధగుణయుక్తమైన మూలికలకు నిలయం ఈ కుటచాద్రి కొండ. అందుకే ఈ పర్వతం నుండి ప్రవహించటం వలన సౌపర్ణికానది సకలరోగనివారిణిగా ప్రసిద్ధి గాంచింది. ఈ నది ఆలయం ముంగిటనే



## దసరా పూజలు రాత్రి సమయంలోనే ఎందుకు ఎక్కువగా చేస్తారు?

**నవరాత్రపూజాసంకల్పాన్ని గమనిస్తే తొమ్మిదిరోజుల పాటు అఖండదీపం ప్రజ్వరిల్లేలా చేయడం, కుమారీ పూజలు, చండీసప్తశతీపారాయణ, సువాసినీపూజ అనే నాలుగు విధా నాలను తప్పనిసరిగా పాటించాలని తెలుస్తుంది. దీపాన్ని ప్రత్యేకంగా అర్చించాలి. ఈ మాసంలో పగటికాలం తక్కువ, రాత్రి సమయం ఎక్కువగా ఉంటుంది.**

**ప్రత్యేకించి సూర్యుడు తులారాశిలో సంచారం చేస్తున్న ప్పుడు అది ఆయనకు నీచ స్థానం. ఈ కాలంలో సూర్యుడు అందించాల్సినంత శక్తిని అందించలేడు. కాబట్టి ఆయన అను గ్రహాన్ని సంపూర్ణంగా పొందేందుకు ఈ కాలంలో అమ్మవారిని శక్తిరూపంగా, జ్వాలారూపంగా, దీపరూపంగా ఆరాధించాలి. ఈ భూమ్మీద ప్రాణకోటి ఆవిర్భావం జరిగిన క్షణాన్ని రహి అంటుంది వేదం. రహి అంటే నిశిరాత్రి అని చెప్పుకోవచ్చు. 'హ్రీం' అనే బీజా క్షరంతో సృష్టిచైతన్యాన్ని పొందింది. ఈ సృష్టి వికాసం జరిగింది రాత్రి సమయంలోనే.**

**కాబట్టి దసరా నవరాత్రుల్లో సూర్యాస్తమయ సమయం అనంతరం రాత్రి సమయాల్లోనే అమ్మవారిని విశేషమైన పూజ లతో ఆరాధిస్తారు.**

ప్రవహిస్తూ ఉంటుంది. ఈ నదిలో స్నానమాచరిస్తే సకల రోగాలు నయమౌతాయని భక్తుల విశ్వాసం.

ఈ ఆలయం గర్భగుడిలో స్వయంభువుగా వెలసిన శివలింగం వెనుక దేవి పంచలోహవిగ్రహం దర్శనమిస్తున్నది. ఈ విగ్రహాన్ని ఆదిశంకరాచార్యులవారు ప్రతిష్ఠించారు. అమ్మవారు తన రెండుహస్తాలలో శంఖ చక్రాలు ధరించి, పద్మాసనియై మనకు దర్శనమిస్తుంది. నవరత్నాభరణాలతో మనోహరంగా కనిపించే దేవిని దర్శించడానికి రెండుకన్నులు చాలవు. ఈ అమ్మవారితో పాటు మహాకాళి, మహాసరస్వతి పంచలోహవిగ్రహాలు మనకు కన్పిస్తాయి.

ఈ దేవాలయ దక్షిణప్రాకారంలో దశహస్తాలతో ఉన్న విఘ్నేశ్వరునిమూర్తి భక్తుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది. శ్రీవాదిరాజులవారు ప్రతిష్ఠించిన ఆంజనేయవిగ్రహాన్ని ఈ దేవాలయంలో చూడవచ్చు.

ఫాల్గుణమాస నవమితిథిలో శ్రీమూకాంబికాదేవి విశేషఉత్సవాలు అత్యంత కోలాహలంగా జరుగుతాయి. అంతేకాక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పదిరోజులూ భక్తుల సందడి ఉంటుంది.


## గ్రంథసమీక్ష

### సమీర వృత్త తారావళి

(ప్రతిపదార్థ- తాత్పర్య - వ్యాఖ్యాన సమన్వితం)

మిత్రవ్యాఖ్య–ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి; పుటలు– 70; వెల– రూ. 125/–; సైజు–1/8 డెమ్మీ; ప్రతులకు– 301, రామన్న టవర్స్, 1వలైను, రామన్న పేట, గుంటూరు–522 007. చరవాణి: 93941 13848

జగతీక్షేమంకరుడైన వాయుదేవుని విశిష్టతను హృదయా లకు స్పర్శింపచేసిన కావ్యతారావళి 'సమీరవృత్త తారావళి'. దీని కర్త ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ. ఈ తారావళిలోని అతి సూక్ష్మతర రహస్యాలను, వాయుదేవుని వైభవాన్ని కూలంకషంగా చర్చించి మిత్రవ్యాఖ్య పేరుతో సరళమనోజ్ఞశైలిలో విశ్లేషించి సాధారణ పాఠకులకు అందించారు డా॥వెలువోలు నాగరాజ్యలక్ష్మి.




వర్షం పుడమిని సస్యశ్యామలం కావించి హరితవర్ణ శోభ లతో తీర్చిదిద్ది సమస్తజీవులకు ఆహారం సమకూర్చుతుంది. సూర్యుని తీవ్రమైన ప్రజ్వలనతో భువిపై సాగరజలాలు ఆవిరై నింగిలో మేఘరూపాన్ని సంతరించుకుంటాయి. అక్కడ స్వచ్ఛత పొందిన జలాలు వర్షరూపంలో భూమిని అభిషేకిస్తాయి. అనాదిగా సాగుతున్న ఈ ప్రక్రియకు వాయుదేవుడే సూత్రధారి అనే వైజ్ఞానిక సూక్ష్మాంశాలనెన్నింటినో ఈ తారావళి వ్యాఖ్యలో సప్రమాణంగా నిరూపించి, వాఖ్యాత్రి సమీరుని మహోపకారాన్ని ఆవిష్కరించారు.

వేదసూక్తాలను, శాస్త్రపరిశోధనలను, కవుల వర్ణనలను సమన్వయరూపంలో అందించిన ఈ మిత్రవ్యాఖ్య పఠితలకు విజ్ఞానదాయకం, కావ్యానందప్రదం. ప్రతి ఒక్కరూ తప్పక చదవాల్సిన వ్యాఖ్య ఇది.

– డా॥ కె.రాధారమణ

ఈ నెల 08వ తేదీ నుండి
మహాలయపక్షం
ప్రారంభం...

# కన్నవారి ఋణం తీర్చుకునే అవకాశం!

– శ్రీమతి పి. రమాదేవి



**భాద్రపదబహుళపాడ్యమి నుండి మహాలయపక్షం ఆరంభమని "స్మృతి కౌస్తుభం" చెబుతోంది. ఇది వేదకాలం నుండి ఆచరణలో ఉంది. దీన్ని 'పితృపక్ష'మని కూడా అంటారు. భాద్రపదపూర్ణిమతో ఆరంభమై ఆ మాసపు అమావాస్యతో ముగుస్తుంది. ఆ అమావాస్యను 'మహాలయ అమావాస్య' అని అంటారు.**

## ఎందుకు? ఎప్పుడు? చేయాలి ...!

మహాలయపక్షంలో శ్రాద్ధకర్మలు తప్పనిసరిగా నిర్వహించాలి. దానికి శక్తి, స్థోమత లేనపుడు యాచించైనా కర్మ చేయాలి అని పూర్వీకులు చెప్పారు. భాద్రపదబహుళ పాడ్యమినుండి అమావాస్యవరకు ఈ పదిహేనురోజులూ పితృకర్మలకు అత్యంత పవిత్రదినాలు. ఈ రోజుల్లో తల్లిదండ్రుల తిథిరోజున లేదంటే మహాలయ అమావాస్యరోజున తర్పణాలు, పిండప్రదానాలు చేయాలి. దీనివల్ల వంశాభివృద్ధి కలుగుతుంది. పితృదేవతలపట్ల తెలిసో తెలియకో చేసిన అపరాధాలకు క్షమాపణ లభిస్తుందనీ, వారి ఆశీస్సులతో సర్వశుభాలూ చేకూరుతాయనీ పురాణాలు చెబుతున్నాయి.

గతించిన పూర్వీకులను స్మరిస్తూ, వారి ఆత్మలకు సద్గతులు చేకూరేందుకు ఆచరించే శ్రాద్ధ, తర్పణాది విధులు భారతీయసంస్కృతిలో ప్రధానమైన భాగం, కొన్నివర్ణాలవారికి ఆబ్దికాల్లాంటి విధులున్నాయి. కొన్ని వర్ణాలవారికి ఉండవు. కానీ అన్నివర్ణాలవారు తమపెద్దలను స్మరిస్తూ మహాలయ పక్షంలో పిండప్రదానాలు చేస్తారు. తర్పణాలు వదులుతారు.

భాద్రపదశుద్ధచవితి ఆదిపూజ్యుడు గణపతిని కొలిచే వినాయకచవితి మొదలుకుని భాద్రపదమాసంలోని మొదటి



పక్షం దైవకార్యాలకు, వినాయకచవితి మరుసటిరోజైన ఋషి పంచమిని ఋషుల ఋణం తీర్చుకోవడానికి పూర్వులు (ఆర్యులు) నిర్దేశించారు. అన్నిటికన్నా ముఖ్యమైంది కన్నవారి ఋణం తీర్చుకోవడం, దానికోసం భాద్రపదమాస కృష్ణపక్షాన్ని నిర్ణయించారు. అదే 'మహాలయపక్షం'.

ప్రతి అమావాస్యకు వాయు రూపంలో పితృదేవతలు తమ వారసుల ఇళ్లకు వస్తారనీ, వారు నిర్వహించే శ్రాద్ధకర్మలకూ, అన్న దానాలకూ సంతృప్తులై, ఆయురా రోగ్యాలతో, సర్వసంపదలతో, పిల్లా పాపలతో వర్ధిల్లమని మనసారా ఆశీస్సులు అందించి వెళ్తారనీ 'గరుడుపురాణం' చెప్తోంది. ప్రతి అమావాస్యకూ ఇలా చేయడం సాధ్యం కాని వారు మహాలయపక్షం లోనైనా పితృకర్మలు నిర్వర్తించాలనేది శాస్త్రవచనం.



తిరుమల శ్రీవారిని చూస్తే మన బాధలన్నీ మరచిపోతాం

సూర్యరుద్రవసువులే పితృదేవతలనే శ్రుతి ఒకటి కలదు. కనుకనే పితరులను వసు రూపులుగా, పితామహులను రుద్రరూపులుగా, ప్రపితామహులను ఆదిత్యరూపులుగ ధ్యానించాలి. ఈ ప్రకారం ఎవరు భావించి శ్రద్ధతో పితరులను అర్చిస్తారో, వారికి వసురుద్రాదులు సంప్రీతులౌతారు.

శ్రద్ధాభక్తులతో కూడినవాడై, మానవుడు ఏవస్తువైనా శాస్త్రప్రకారం ఇస్తాడో అది తరగని పుణ్యాన్ని ఇచ్చి ఇహ పరాలలో పితరులకు గొప్పమేలు కలిగిస్తుంది. కృష్ణపక్షంలో

ఒక చతుర్దశి తిథి తప్ప దశమి మొదలు అమావాస్య వరకు గల తిథులు పితృకర్మలకు శ్రేష్ఠమైనవి. మిగిలినవి వాటితో సమానం కానివి.

### 'మహాభారతం' ఏమని చెప్పిందంటే...!

భగవంతుణ్ణి ఆరాధించడం కన్నా, జన్మ నిచ్చిన తల్లి దండ్రులను, పెద్దలను పూజించడమే గొప్పదని భీష్ముడు ధర్మ రాజుతో చెప్పాడు. పితృదేవతలను స్మరించి, పూజిస్తే పితృ దేవతలకు సంతృప్తికల్గుతుందనీ, దేవతలు కూడా ఆనంది స్తారనీ, దైవపూజ పరిపూర్ణం కావాలంటే పితృపూజ చేయా ల్సిందేననీ భీష్ముడు పేర్కొన్నాడు. పితృకార్యాలను ప్రతిమాసంలో అమావాస్యనాడు నిర్వహిస్తే ఏడాదంతా వాటిని జరిపిన ఫలం చేకూరుతుందనీ తెలిపాడు.

మహాలయపక్షంలో.. ఈ పితృయజ్ఞాలు ఎప్పుడు ప్రారంభమయ్యాయో తెలిపే ఒక కథ ఉంది. మహాభారత యుద్ధంలో మరణించిన కర్ణుడు స్వర్గానికి ప్రయాణిస్తుండగా అతనికి ఆకలిదప్పులు కలిగాయి. దారిలో పండ్లనూ, నీటినీ తీసుకుందామంటే అవి బంగారమైపోయాయి. తన జన్మకు కారకుడైన సూర్యుణ్ణి కర్ణుడు ప్రార్థించాడు. అపుడు సూర్యుడు ప్రత్యక్షమై కర్ణునితో ఇలా అన్నాడు. "ఎన్నిదానాలు చేసినా అన్న దానం చేయకపోవడంవల్లనే ఈ పరిస్థితి ఎదురైంది. కాబట్టి అన్నదానం చెయ్యి" అని చెప్పాడు. ఈ ప్రకారం కర్ణుడు భూమిపైకి తిరిగివచ్చి 15 రోజుల పాటు అన్నదానాలూ, పితృకర్మలూ ఆచరించి, స్వర్గానికి చేరుకున్నాడు. ఆ పదిహేను రోజులు "మహాలయపక్షాలు"గా స్థిరపడ్డాయని పెద్దలు చెబుతున్నారు. ఈ పక్షంలో వారసులు విడిచిపెట్టే తర్పణాలు అతని పూర్వులైన పితృదేవతల ఆకల్నీ, దాహాన్నీ తీరుస్తాయనీవారు సంతృప్తి చెందితే వారసులకు ఉన్నతి కలుగు తుందని భారతం చెప్తోంది.



భక్తులకు ఆధారం
శ్రీవేంకటేశ్వరుడు

అదేవిధంగా అన్నదానాలతో పాటు సరుకులు, ధన వస్తు రూపంలో దానాలు చేయడంవల్ల సత్ఫలితాలు సిద్ధిస్తాయి. పూర్వజన్మలో, ఈ జన్మలో తల్లిదండ్రు లకు, పెద్దలకు ఏదైనా కష్టంగానీ, హాని కానీ కలిగించినా, లేదా పూర్వీకులు పాపకార్యాలకు పాల్పడినా వాటి ఫలితాలనూ ఈ జన్మలో అనుభవించాల్సి ఉంటుంది. వాటినే "పితృ దోషాలు" అంటారు. ఈ దోషాలకు గురైనవారు జీవితంలో అనేకకష్టాలను, ఆటంకాలను శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదుర్కోవాల్సి వస్తుంది. వాటిని నివారించుకోవడానికి పితృకర్మలు ఆచరించాలి. దానికి 'మహా లయం' అత్యంత అనువైన కాలం. ఈ పక్షంలో మహావిష్ణువును ఆరాధించడం, గోమాతను సేవించడం, ఆపన్నులను ఆదు కోవడం, విరివిగా దానాలు ఇవ్వడం వల్ల పితృదేవతలు సంతృప్తి చెందుతారు.


### శ్రాద్ధం... విశిష్టత...!!

'శ్రాద్ధం' అంటేః "శ్రద్ధయాదీయతే శ్రాద్ధం" ఇత్యమరః శ్రద్ధ చేత ఇయ్యబడేది అని అమరసింహుడు చెబుతున్నాడు. శాస్త్రోక్తమైన దేశకాలపాత్రాది నియమం చేత పితృదేవతల గూర్చి చేయబడే బ్రాహ్మణ భోజనాదికం.

సనాతమైన శ్రాద్ధధర్మం పరంపరగా లభించింది. దేవ కార్యంకంటే పితృకార్యం విశేషంగా ఆచరింపదగింది. అందు వల్ల పండితులచేత, మహాత్ములచేత శ్రాద్ధం శ్రేష్ఠమైందిగా చెప్ప బడింది. లోకాలు దానియందే నెలకొని ఉన్నాయి. ఇది గొప్ప యోగమని స్కాందపురాణం చెబుతోంది.

### అనంతపద్మనాభ వ్రతం (06-09-2025)

**భాద్రపదమాసంలో పూర్ణిమకి ముందొచ్చే చతుర్దశినాడు అనంతపద్మనాభవ్రతాన్ని చేస్తారు. దీన్నే అనంతవ్రతమని కూడా వ్యవహరిస్తారు. కొన్ని వంశాల్లో ఇది పరంపరాగతంగా అంటే, ఏ శుభకార్యాన్ని చేయదలిచినా ముందుగా ఈ వ్రతాన్ని చేయడం అనేది అనాది సంప్రదాయంగా కనిపిస్తూ ఉంటుంది. శ్రీవిష్ణుసహస్రనామాలను చదువుతూ 24 ముడులని కొద్దికొద్ది దూరంలో వేసిన తోరానికి పూజచేసి దాన్ని ధరిస్తారు మణి కట్టుకి. అనంతుణ్ణి ఈ తోరంలోనికి ఆవాహన చేసి పూజిస్తారు. పద్మ అంటే ఈ విశాల బ్రహ్మాండమని అర్థం. 'నాభుడు' అంటే, ఆ విశ్వాన్ని తన బొడ్డు నుండి సృష్టించిన వాడు అని భావం. విష్ణువు నాభినుండి పుట్టిన కమలమే 'అనంతపద్మం'అంటే.**



### శ్రాద్ధవిధి

బ్రహ్మచర్యంలో శ్రద్ధకలిగి, ఇంద్రియనిగ్రహం కలవాడై కోపస్వభావంలేకుండా, అసూయలేకుండా, పవిత్రత, మంచి నడవడిక, ధైర్యం, మనోనిగ్రహం, శాస్త్రజ్ఞానం కలిగినవాడై శ్రాద్ధం చేస్తాడో, విశేషంగా తీర్థస్థలంలో చేసినప్పటికంటే అధికతర ఫలం క్షయమాసం (కృష్ణపక్షం) దినమున చేసిన శ్రాద్ధానికి కల్గుతుంది. వృద్ధిశ్రాద్ధమందు కూడా అలాంటి ఫలితముంటుంది. మహాలయపక్షములో శ్రాద్ధం నూరురెట్లు అధికంగా లభిస్తుంది. పితృదేవతలకు అర్పించింది అక్షయమౌతుంది.

నంద, విరజ, మహాలయాలందు శ్రాద్ధం ఆచరించిన వారు తమ్ము తరింపచేసుకుంటారు. అంతేకాక పదితరాలవారు కూడా ఇటు, పదితరాలవారినటు తరింపజేయడానికి కారణులవుతారు. శ్రాద్ధమాచరించినవారు బంగారంతో కూడిన శరీర కాంతిని పొందుతారు. అంతేకాక అమితమైన శక్తిసామర్థ్యాలు పొందుతారు. అన్ని అక్షరాల రూపమైంది ఓంకారం, అందరు దేవతలమయమైన విష్ణువు, అన్ని తీర్థాల స్వరూపులైన దేవతలు, వీని అన్నింటి స్వరూపమైన 'గయా' తీర్థం శ్రేష్ఠమైంది. అక్కడకు వెళ్లి శ్రాద్ధకర్మ ఆచరించినట్లైతే గొప్ప ఫలసిద్ధిని పొందుతారు. అక్కడకు ప్రవేశించినంతమాత్రాన నరకంలో ఉన్న పితృదేవతలందరు స్వర్గానికి వెళ్తారు. బ్రహ్మత్వాన్ని పొందాడానికి సమర్థులౌతారు.

# విశ్వనాయకుడు

– డా॥ పోరంకి దక్షిణామూర్తి

ధరించేది ధరణి. భూమిఅన్న అర్థంలో ఈ మాట వాడుతాం. దీనికి బదులుగా ధరిత్రి, ధాత్రివంటి మాటలను కూడా మనం ప్రయోగిస్తుంటాం. భూమి ధరించేది దేన్ని? అవి చాలా ఉన్నాయి. వాటిల్లో కొన్ని మనకు కనిపిస్తాయి. కొన్ని కనిపించవు. కొండలు, గుట్టలు, నదులు, సముద్రాలు, చెట్లు, చేమలు, మనుష్యులు, జంతువులు, పక్షులు, క్రిమికీటకాలు మొదలైన సమస్త జీవరాసులను, ఖనిజాది సంపదలను భూమి ధరిస్తుంది. పెంచి పోషిస్తుంది. వాటి పుట్టుకకు, పెరుగుదలకు, మనుగడకు కావలసిన సమస్త పదార్థాలను ధరిస్తుంది, భరిస్తుంది కాబట్టి భూమికి ధరణి అన్నది సార్థకమైన నామం.



చిత్రకారుడు- బొమ్మకంటి పవన్ యశస్వి, వరంగల్

బిడ్డను కని పెంచేది తల్లికదా! కాబట్టి భూమి సమస్త చేతనా చేతనాలకూ తల్లి. అందువల్లనే అథర్వణవేదంలోని పృథివీసూక్తంలో భూమిని తల్లిగా మన్నిస్తూ, నమస్కరిస్తూ పఠించే మంత్రాలున్నాయి. ఆ తల్లి ఏదో ఒకరూపంలో మనకిక్కడ కూడా కనిపిస్తూంటుంది. మరి తండ్రి మాటేమిటి? మనం తెలుసుకోగలిగినా, తెలుసుకోలేకపోయినా, ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కచోట ఏదో ఒకరూపంలో ఆయన కనిపించవచ్చు. కానీ, అవసరం లేనప్పుడు కనిపించకుండానూ ఉంటాడు. అన్నీ తన సంకల్పానుసారంగా జరిగేటట్లు చూస్తాడు. అందుకు అనుగుణమైన ఏర్పాట్లూ చేస్తాడు.

భూమండలంలో మనిషికి కనిపించేది, తెలియవచ్చేది కొద్దిపాటి మాత్రమే. మానవుడికి దేన్ని గురించి ఎప్పుడు ఎంత మటుకు తెలియాలన్నది నిర్ణయించేవాడు ఒకడు వేరే ఉన్నాడు. అన్నింటినీ ఆయనే నడిపిస్తాడు, జరిపిస్తాడు. కాబట్టి ఆయనే నిర్వాహకనాయకుడు.

శ్రీవేంకటేశ్వరుడు శ్రీదేవీ, భూదేవీసమేతుడు. అంటే లక్ష్మీపతి అయిన గోవిందుడే భూ–పతి కూడా! కాబట్టి ధరణీ నాయకుడన్న పేరు ఆయనకు బాగా నప్పింది. నడిపించేవాడు నాయకుడు అన్న మాట అన్ని సందర్భాలలోనూ వస్తుంది. మనం ఏ పేరు పెట్టినప్పటికీ భగవంతుడొక్కడే పరిపూర్ణజ్ఞాని. అతడే సమస్త చరాచరాల స్థితిగతులను నిర్దేశించేవాడు, నియమించేవాడు, నడిపించేవాడు. కాబట్టి ఆయనే ధరణీ నాయకుడు! విశ్వపాలకుడు!!



# సమర్పించేది కురులు - అనుగ్రహించేది సిరులు

– శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

కరుణాసింధువు, ఆశ్రితభక్తపారిజాతం అయిన శ్రీవేంకటప్రభువును దర్శించడానికి దేశవిదేశాలనుంచి నిరంతరం నిరంతరాయంగా భక్తజనులు తిరుమల పుణ్యక్షేత్రానికి వస్తుంటారు. అత్యంత భక్తిప్రపత్తులతో తమకు నచ్చినరీతిలో, తాము మొక్కిన రీతిలో మొక్కులు చెల్లిస్తూ ఉంటారు.

తిరుమలక్షేత్రానికి వచ్చిన భక్తులు శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించటానికి ముందుగా సమర్పించే అత్యంత ప్రధానమైన మొక్కు “తలనీలాల సమర్పణ”.



> తిరుమలలో కనిపించేవి గుళ్లు, లడ్లు, గుండ్లు. ఎవరు గుండుతో కనిపించినా వచ్చే మొదటి ఆలోచన.. ఓహో! వీరు తిరుమలకు వెళ్లి వచ్చారు కాబోలని! మన అహంకారాన్ని స్వామివారి దగ్గర వదిలే గుర్తుగా భక్తులు తలనీలాలు అర్పిస్తారు.

తిరుమలక్షేత్రంలో తలవెంట్రుకలను మొక్కులుగా సమర్పించటమనే సంప్రదాయం ఎప్పటినుంచి వస్తున్నదో, ఏనాటి నుంచి కొనసాగుతున్నదో ఇదమిత్థంగా తేల్చి చెప్పటం కష్టం. 1830 సం॥ నాటికే తిరుమలలో తలనీలాల సమర్పణ మొక్కును భక్తులు చెల్లించేవారు.

తిరుమల పుణ్యక్షేత్రంలో, శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో చంటిపిల్లలనుంచి వృద్ధులవరకు, స్త్రీలు సైతం... కుటుంబ సభ్యులు లింగభేదం లేకుండా తమ తమ తలవెంట్రుకలను ఆనందంగా శ్రీస్వామివారికి మొక్కులుగా సమర్పించటం విశేషం, క్షేత్రమాహాత్మ్యం.

భక్తులు, కోరికలు నెరవేరినవారు గానీ, కోరికలు నెరవేరవలసినవారు గానీ, ఏకభుక్తం, భూశయనం, బ్రహ్మచర్యం వంటి నియమాలతో పాటు శిరోజాలను తీయకుండా దీక్ష వహించి నియమితకాలంపాటు శ్రీనివాసుణ్ణి ఉపాసిస్తారు, ఆరాధిస్తారు. ఇలా నియమితకాలం పూర్తి అయిన వెంటనే దీక్షగా యాత్ర చేస్తూ తిరుమలక్షేత్రాన్ని చేరుకుంటారు.

శ్రీవారిసన్నిధిలో తమ దీక్షావ్రతంలో అత్యంతప్రాధాన్యం



సాధారణ రోజుల్లో 25 వేల నుండి 30 వేలమంది భక్తులు, రద్దీ రోజుల్లో, పర్వదినాలలో 35 వేల నుండి 45 వేలమంది భక్తులు తలనీలాలు ఇస్తున్నారు. ఇందుకోసం డిస్పోజబుల్ పద్ధతిలో బ్లేడ్లు వినియోగిస్తోంది తి.తి.దే. 24గంటలూ మూడుషిఫ్టుల్లో భక్తులకు ఉచితంగా తలనీలాలు తీస్తుంటారు.

వహించిన శిరోజాలను భక్తిప్రపత్తులతో సమర్పించి తమ దీక్షావిరమణచేస్తారు. ఆ తర్వాత స్నానదర్శనాదులు ముగించుకుని, కానుకలు వగైరావాటిని హుండీద్వారా సమర్పించుకుంటారు.

ఇలా, తిరుమలక్షేత్రంలో ఒక పవిత్రయజ్ఞంగా భావింపబడుతూ ప్రతినిత్యం ఈ తలనీలాలసమర్పణ పుణ్యప్రదమైన శుభకార్యంగా కొనసాగుతూ ఉంది. అందువల్లే దీన్ని 'తిరుక్షవరం' అనీ, "కల్యాణప్రదమైన క్షవరం" అనీ అనటం అనూచానంగా వస్తోంది.



తిరుమలలో మొదట దర్శించాల్సింది శ్రీవరాహస్వామివారిని

భక్తులు అలౌకిక ఆనందానుభూతులతో కల్యాణప్రదంగా తలనీలాలు సమర్పిస్తున్న దివ్యస్థలాన్ని "కల్యాణఘట్టం" అని అప్పట్లో పిలిచేవారు. అదే నేడు "కల్యాణకట్ట"గా వ్యవహరింపబడుతోంది.

ఈ 'కల్యాణకట్ట'లో యాత్రికులు కొందరు తమ పిల్లలకు పుట్టువెంట్రుకలు తీస్తారు. మరికొందరు ఏండ్ల తరబడి దీక్షాధారులై వచ్చి తమ తలనీలాలను (శిరోజాలు) సమర్పిస్తారు.

స్త్రీలు కొందరు పూర్తిగా తమ తలనీలాలను సమర్పించుకుంటే, మరి కొందరు స్త్రీలు మూడుకత్తెరలుగా కొద్దిగా సమర్పించుకుంటారు. అసలు తిరుమల యాత్రలోనే స్వామివారికి సమర్పింపబడే ప్రధానమైన మొక్కుబడి "తలనీలాల సమర్పణ". తిరుమలక్షేత్రంలో తల వెంట్రుకలివ్వడమనే పవిత్రకార్యంవల్ల భక్తులకు ఎన్నో శుభాలు కలుగుతాయి.


### తిరుమల లడ్డూకు తిరుగులేదు

లడ్డు అనగానే గుర్తొచ్చేది తిరుమల లడ్డే. కోనేటి రాయునికి ప్రీతిపాత్రమైన ఈ లడ్డూ ఏడుకొండలంత కీర్తిని సొంతం చేసుకుని విశ్వవ్యాప్తంగా విస్తరించింది. తిరుపతి వెళ్తున్నాం అని చెప్పగానే "లడ్డూ ప్రసాదం తీసుకురండి!" అని, వెళ్లొచ్చాం అనగానే "లడ్డూ ఎక్కడ?" అని ఎవరైనా వెంటనే అడిగే ప్రశ్నలివి. తిరుమల లడ్డూ ప్రసాదం అన్ని ప్రసాదాల్లోకి రుచిలో, శుచిలో ప్రథమస్థానాన్ని ఆక్రమించుకుంది. తిరుమలకెళ్లిన భక్తులు తమ ముడుపులు చెల్లించుకున్న తర్వాత తప్పకుండా శ్రీవారి ప్రసాదమైన లడ్డూను ఊర్లకు తీసుకువెళ్లి 'సమారాధన' పేరుతో పూజ చేసి బంధుమిత్రులకు పంచిపెట్టడం ఆనవాయితీ!




భగవంతుడు సర్వావయవసౌందర్యసంపదతో మధురాతిమధురమైన మూర్తి. అందుకే మధురాష్టకంలో శ్రీకృష్ణుని వర్ణిస్తూ ప్రతి అవయవమూ మధురమైందే అన్నారు. అలాంటి భగవంతునికి నివేదించిన ప్రసాదం 'లడ్డు' మధురాతిమధురంగాక వేరుగా ఉంటుందా? ఆనాటి కృష్ణుడే కదా ఈనాటి మన శ్రీవారు! ఆ మాధుర్యం మాటలకు, మనస్సుకు అందనిది. కేవలం ఆత్మైకవేద్యం. ఆబాలగోపాలానికి ప్రియమైన 'లడ్డు'ను గుర్తించి భారత తపాలాశాఖ స్టాంపు (03-11-2017)ను కూడా విడుదల చేసింది. ఇంతగా గుర్తింపు పొందిన దేవుడి ప్రసాదం చరిత్రలో మరోటి లేదు.

తీర్థక్షేత్రాల్లో విధిగా తలవెంట్రుకలు తీయించుకోవాలి. అలా సమర్పించినట్లయితే శిరస్సులో ఉన్న పాపాలన్నీపోతాయి, బుద్ధిపూర్వకంగా చేసిన పాపాలన్నీ నశిస్తాయి, రోగాలు నివారింపబడతాయి, అహంకారం తగ్గుతుంది అని పద్మ పురాణం చెబుతోంది.



పూర్వం పాత కల్యాణకట్టభవనం దగ్గర ఉన్న పెద్దరావిచెట్టు క్రింద తలనీలాలు తీసే వారు. ఆ తర్వాత ఆ రావిచెట్టు పక్కనే ఒక కల్యాణకట్ట నిర్మింపబడింది. నానాటికీ పెరుగుతున్న యాత్రికజనాన్ని దృష్టిలో ఉంచుకుని తిరుమలతిరుపతిదేవస్థానం పాతకల్యాణకట్ట పక్కనే నాలుగు అంతస్థుల పెద్దకల్యాణకట్ట భవనాన్ని నిర్మించింది. అప్పట్లో ఈ భవననిర్మాణానికి సుమారు 30 లక్షల రూపాయల ఖర్చు అయింది. నవీనంగా నిర్మింపబడ్డ ఈ కల్యాణకట్టభవనంలోనే పాదరక్షల గది, సామానులు భద్రపరుచుకునే గది, స్నానాల గదులు, కార్యాలయం... వగైరా ఏర్పాట్లు ఉన్నాయి.



**మొదట్లో కేవలం పురుషులు మాత్రమే భక్తుల తలనీలాలు తీసేవారు. అయితే, మహిళలకు తలవెంట్రుకలు తీసేందుకు సుమారు 20 సంవత్సరాలకు ముందునుండి తి.తి.దే. మహిళాక్షురకుల్ని నియమించింది. ప్రస్తుతం 1250మంది మహిళా, పురుషక్షురకులు తి.తి.దే. కల్యాణకట్టలో విధులు నిర్వర్తిస్తున్నారు.**



**ప్రధాన కల్యాణకట్ట కాకుండా తిరుమలలో చిన్న కల్యాణకట్టలున్న ప్రదేశాలు- జి.ఎన్.సి., హెచ్.వి.సి., పద్మావతి, ఎస్.వి.గెస్టుహౌస్, నందకం, సప్తగిరి, కౌస్తుభం, పి.ఏ.సి-1, పి.ఏ.సి-2, పి.ఏ.సి.-3.**

అహరహం ఆర్తిగా, ఆర్ద్రంగా, ఆనందంగా తనను చేరుతున్న భక్తుల తలచిక్కులను (తలనీలాలను) మరింత ఆనందంగా స్వీకరిస్తూ, ఆ భక్తుల చిక్కు (సమస్య) లన్నింటినీ తీరుస్తూ, తద్వారా ఆ భక్తుల చేతికి చిక్కుతూ అరచేతిమాణిక్యమై వెలుగుతున్న కరుణాసింధువు ఏడు కొండల వేంకటరమణుడు!







# అమ్మ అన్ని కొరతలు తీర్చుతుంది

– డా॥ నల్లాని రాజేశ్వరి, 99086 02443

పూర్వం సింధుద్వీపంలో మాహిష్మతి అనే నగరాన్ని విప్రజిత్తు అనే రాక్షసరాజు పరిపాలిస్తుండే వాడు. అతని కూతురు మహిష్మతి చాలా అందమైంది. మహిష్మతి ఒకసారి తన చెలికత్తెలతో కూడి మందరగిరి ప్రాంతంలోని అరణ్యంలో విహరించ సాగింది. అక్కడొక్క మునీశ్వరుడు తపస్సుచేసు కుంటూండగా, మహిష్మతి బాల్య చాపల్యంతో చెలికత్తెలతో బాటుగా అడవిగేదెలరూపాలు ధరించి రంకెలేస్తూ, ఆ మహర్షికి ధ్యానభంగం కలిగించింది. మహర్షి తన తపశ్శక్తి చేత అవి సహజమైన గేదెలు కావని తెలుసుకుని, “ఈ అడవిలో ఈ రూపాల్లోనే ఉండండి” అని వాళ్లను శపించాడు. ఆ శాపం విని, మహిష్మతీ, ఆమె చెలికత్తెలూ గడగడ వణికిపోయి, ఆ మహర్షిపాదాలపై పడి, శాపవిమోచనం కోరారు.

మహర్షి కరుణించి “నీకు ఒక కొడుకు పుట్టగానే యథారూపాన్ని పొందుతావు” అని చెప్పాడు. అప్పటినుండి వాళ్లంతా అడివి గేదెలరూపంలో అక్కడే సంచరించసాగారు. కొంతకాలానికి మహిషరూపంలో ఉన్న మహిష్మతి రంభాసురుడనే దానవుడివల్ల గర్భంధరించి మహిషాసురుడనే కొడుకును కని శాపవిముక్తురాలైంది.





దసరారోజుల్లో దుర్గాదేవి ప్రధానదేవత

మహిషాసురుడు పెరిగి పెద్దవాడై, మహాపరాక్రమశాలి అయ్యాడు. అతడు గొప్పతపస్సు చేసి బ్రహ్మనుండి అనేక వరాలు పొందాడు. ఆ వరగర్వంతో లోకాల్ని బాధించసాగాడు. అతడి బాధలు దేవతలు తట్టుకోలేక పోయారు. బ్రహ్మదేవుని దగ్గర తమ బాధలు చెప్పుకున్నారు. ఆయన పరమేశ్వరునితో కలిసి శ్రీమహావిష్ణువు దగ్గరకు వచ్చాడు. త్రిమూర్తులు మహిషాసురుణ్ణి అంతమొందించే మార్గం గురించి ఆలోచిస్తూ ఉండగా, ముగ్గురి చూపులనుండి దివ్యసుందర మంగళస్వరూపంతో ఒక మహిళ ఉద్భవించింది. ఆమె త్రివర్ణాలతో, కోటిసూర్యకాంతితో వెలిగిపోతోంది. ఆమెను చూచి త్రిమూర్తులు “నువ్వెవరవు?” అని అడిగాడు.

అందుకు ఆమె, “నేను త్రిమూర్తులశక్తిని! మీ ముగ్గురి కళలచేత పుట్టినదాన్ని!” అని సమాధానమిచ్చింది. వాళ్లు ఆమెకు ‘త్రికళ’ అని పేరు పెట్టి– “తల్లీ! నువ్వు మా కష్టాల్ని తీర్చటానికి పుట్టిన జగదంబవే అయి ఉండాలి. నువ్వు మహిషాసురుణ్ణి చంపి, దేవతలకు మహోపకారం చెయ్యి!” అని చెప్పారు. ఆమె “చూద్దాం” అని చెప్పి, తపస్సు చేసుకోవడానికి మందరగిరికి పోయింది. కొంతకాలం గడిచింది.

రురుడు అనే రాక్షసుడి కొడుకు దుర్గాసురుడనే వాడు మహాబలవంతుడు. మహిషాసురుడు అతణ్ణి తనతో కలుపుకుని దేవతలపై దండెత్తి, స్వర్గాన్ని ఆక్రమించుకున్నాడు. ఇంద్రుడు తన సైన్యాలతో సహా మందరగిరి చేరి, అక్కడి గుహలలో తలదాచుకున్నాడు. వరుణుడు మాత్రం వేగంగా పరుగెత్తలేక దుర్గాసురుడి చేత చిక్కాడు. దీంతో మందరగిరిప్రాంతంలోని వాగులూ, వంకలూ, తటాకాలూ, సరస్సులూ అన్నీ ఎండి పోయాయి. ఆకాశంలో మేఘాలు కమ్ముకోక వానలు పడలేదు.



**దేవీభాగవతంలోని సప్తమస్కందాన్ని 'దేవీగీత'గా పరిగణిస్తారు**

దీంతో అనావృష్టి సంభవించి దేవతలు మలమలమాడి పోయారు. దేహతాపాలతో వాళ్లు గుహనుండి బయటకు రాగానే, దుర్గాసురుడు వాళ్లను పట్టుకుని చిత్రహింసలు పెట్టాడు.

దేవతలు మందరగిరిలో ఉన్న త్రికళ దగ్గరకు వెళ్లి తమ గోడు వెళ్లబోసుకుని, తమను కాపాడమని పరిపరివిధాల వేడుకున్నారు. త్రికళ వాళ్లకు అభయమిచ్చింది. దుర్గాసురుడు దేవతలకోసం అన్వేషిస్తూ, త్రికళ ఉన్నచోటికి వచ్చాడు. అతణ్ణి చూడగానే త్రికళ రౌద్రమూర్తిని దాల్చింది. ఆమెకు వచ్చిన కోపం అగ్నిగా మారింది. ఆ కోపాగ్ని బయటకు రావడానికి, ఆమెకు నూరునేత్రాలు వచ్చాయి. దుర్గాసురుడి సైన్యంలో సగం మంది ఆ నిప్పులవానకే మాడి మసైపోయారు. దుర్గాసురుడి ఆయుధాలన్నిటినీ ఆమె నలిపి నుగ్గునుగ్గు చేసేసింది. ఆమె శరీరంలో నుంచి పుట్టిన భీకర శక్తులు రాక్షసులందరినీ హతమార్చాయి. త్రికళ శతాక్షులతో పదిరోజులపాటు భీకరయుద్ధం చేసి, దుర్గాసురుణ్ణి శూలంతో పొడిచి సంహరించింది.

వరుణుడు విముక్తుడై వానలు కురిపించాడు. మందరగిరిప్రాంతాలన్నీ జలకళతో ప్రకాశించాయి. త్రికళ యథాప్రకారం తన దివ్యసుందరరూపాన్ని పొంది, తపస్సులో నిమగ్నురాలైంది. దుర్గాసురుడి మరణవార్త మహిషాసురుడికి తెలిసింది. ఒక స్త్రీ ఇంత సాహసకార్యం చేసిందంటే అతడు నమ్మలేకపోయాడు. నారదుడు వచ్చి త్రికళే దుర్గాసురుణ్ణి చంపిందని తెలియజేశాడు. అంతటితో ఆగకుండా ఆమె అతిలోక సౌందర్యాన్ని వర్ణించి అతనిలో మోహం కల్గించాడు. నారదుడి మాటలతో ప్రభావితుడైన మహిషాసురుడు త్రికళను పెళ్లాడటానికి అన్ని ఏర్పాట్లుచేసుకుని, అవసరమైతే యుద్ధం చేసైనా ఆమెను దక్కించుకోవాలని సైన్యంతో సహా మందరగిరికి బయలుదేరాడు. ఈలోగా నారదుడు త్రికళ దగ్గరకు వచ్చి మహిషాసురుడి ఉద్దేశ్యాన్ని వివరించి, ఏం జరుగుతుందో చూద్దామని గుట్టలచాటుకు వెళ్లి దాక్కున్నాడు. మహిషాసురుడు త్రికళ దగ్గరకు ఒక రాయబారిని పంపి విషయాన్ని తెలియజేశాడు. త్రికళ ఆ రాయబారి చెప్పిందంతా విని "ఓరీ! నేను మృత్యువునని మీ మహిషాసురుడితో చెప్పు! మృత్యువును పెళ్లాడగల ధైర్యం ఉంటే అతణ్ణి ఇక్కడకు రమ్మను!" అని చెప్పింది. ఆ రాక్షస రాయబారి వెళ్లి విషయం చెప్పగానే మహిషాసురుడు యుద్ధభేరీ మ్రోగించాడు.

త్రికళ పైకి లేచి నిలబడింది. దిక్కులు అదిరిపోయేలా ఒక్క కేకవేసి, దేవతలందరినీ పిలిచింది. త్రిమూర్తులతో సహా దేవతలందరూ వచ్చి ఆమె ముందు నిలబడ్డారు. "మీ ఆయుధాల నన్నిటినీ నాకు ఇచ్చి, మీరంతా నా వెనుక నిలబడండి" అంది ఆమె. త్రికళకు అనేక బాహువులు పుట్టుకు వచ్చాయి. ఒక్కొక్కచేతిలో ఒక్కొక్క ఆయుధాన్ని ధరించి, సింహ వాహనాన్ని అధిరోహించింది ఆమె.

మహిషాసురుడు ఆమె భీకరాకృతిని చూచి విస్తుపోయి, "ఈమె చేతులు తెగనరకండి" అని తన సైన్యాలకు ఆజ్ఞ ఇచ్చాడు. త్రికళకూ, రాక్షసులకూ ఘోరమైన యుద్ధం జరిగింది. ఆమె మృత్యుదేవతలా దూకుతూ, రాక్షసులను తన ఆయుధా

## నవరాత్రి రోజుల్లో ఏ ఏ రోజు ఏ ఏ నైవేద్యం

**భగవంతునికి మనం నివేదించే పదార్థాల్లో అనేక రకాలుంటాయి. వాటిలో ముఖ్యంగా సాత్త్వికం, రాజసం, తామసం అని మూడురకాలుగా చెప్పుకుంటాం. అమ్మవారికి ఈ తొమ్మిది రోజులూ వివిధరకాలైన పదార్థాలను నివేదన చేయవచ్చు.**

| | |
|---|---|
| **తొలిరోజు** | **: నెయ్యి, కట్టు పొంగలి, చలిమిడి, వడపప్పు, పాయసం** |
| **త్రిపురసుందరి** | **: పంచదార కలిపిన నెయ్యి, పులిహోర, వడపప్పు** |
| **గాయత్రి** | **: పంచదార, కొబ్బరి అన్నం, రవ్వకేసరి** |
| **లలిత** | **: అరటిపళ్లు, రవ్వకేసరి, పులిహోర, పెసర బూరెలు** |
| **సరస్వతి** | **: బెల్లం, బెల్లం కలిపిన అన్నం గారెలు, నిమ్మరసం** |
| **అన్నపూర్ణ** | **: పాలు, అల్లం గారెలు, పొంగలి నైవేద్యం** |
| **మహాలక్ష్మి** | **: తేనె- కదంబం- అటుకులు, బెల్లం, కొబ్బరి** |
| **మహిషాసురమర్దిని** | **: పేలాలు- పెరుగన్నం- గారెలు, పులిహోర** |
| **దుర్గాదేవి** | **: కొబ్బరికాయ- పరమాన్నం- చక్కెర పొంగలి** |
| **రాజరాజేశ్వరి** | **: పెరుగు- షడ్రసోపేతమైన భోజనం, లడ్డూలు- పంచభక్ష్యాలు** |

**వీటిలో అన్నీ లేదంటే తన శక్తికొద్దీ భక్తుడు దేవికి వీలైనవి సమర్పించవచ్చు.**

లతో నరికి పోగులు పెట్టింది. మహిషాసురుడు ఒక్కడు మాత్రం మిగిలాడు. అతడు ఆమెతో తొమ్మిదిరోజులపాటు మహాభయంకరమైన యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో ఆ అసురుడు తన ఆయుధాలన్నింటినీ పోగొట్టుకున్నాడు. కొండ శిఖరాలను పెళ్లగించి, ఆమె పైకి విసరసాగాడు. వాటిని త్రికళ తన ముష్టి ఘాతాలతో మోది, పిండిచేసింది.

పదోరోజున మహిషాసురుడు ఇక నిరాయుధంగా పోరాడలేక తన కామరూపవిద్యాప్రభావంతో సింహంగా మారి, త్రికళను చంపబోయాడు. ఆమె శ్రీమహావిష్ణువు ఇచ్చిన చక్రాయుధంతో ఆ సింహాన్ని సంహరించింది. ఆ అసురుడు మదపుటేనుగా మారి, కుంభస్థలంతో ఆమెను ఢీ కొన్నాడు. కుబేరుడు ఇచ్చిన ఖడ్గంతో ఆమె దాన్ని తొండాన్ని నరికింది. ఇలా రకరకాల క్రూరమృగాలరూపాలు ధరించి ఒక్కొక్క ఆయుధం చేత హతమౌతూ, చివరికి ఆ రాక్షసుడు మహిష రూపాన్ని ధరించి, కొండలావెళ్లి ఆమె మీదపడ్డాడు. యమ దండంతో ఆమె అతణ్ణి కొట్టగా, ఆ దెబ్బకు అతడు మందర గిరిపై నుంచి ఎగిరికిందపడ్డాడు. మళ్లీ లేచి తుఫానులా ఉరుకుతూ వచ్చి, మందరగిరిని తన కొమ్ములతో కదిలించడం ప్రారంభించాడు. అతడి బలానికి మందరగిరి సమూలంగా కదలిపోసాగింది.




చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తే విజయదశమి

అప్పుడు త్రికళ కళ్లు ఎఱ్ఱబడగా, ఆమె మహా రౌద్రాకారం దాల్చి మహిషాసురుణ్ణి తన కేశపాశాలతో బంధించి లాగి, తన ముందర పడేసుకుని కాలితో తొక్కి పట్టి శివుడిచ్చిన త్రిశూలంతో అతని తలను నరికి, ఆ తలను చేతపట్టుకుంది. మహిషాసురుడు నేలకొరగగానే దేవతలు త్రికళను మాతృస్వరూపంగా కీర్తించి, తమ కొరతలు తీర్చిన తల్లిగా స్తుతించారు. త్రికళ వాళ్లవాళ్ల ఆయుధాలు వారికి తిరిగి ఇచ్చేసి "ఓ దేవతలారా! నేను జగదంబను. మీకష్టాల్ని తీర్చడానికే నేను త్రిమూర్తుల చూపుల నుంచి ఇలా త్రికళగా అవతరించాను. నా పని పూర్తయింది. ఇక మీరు మీప్రదేశాలకు వెళ్లి హాయిగా జీవించండి" అని చెప్పి అంతర్థానమైంది.

---

**విశ్వదాభిరామం** **వేమన పద్యసూక్తి**



## ప్రాప్తంకొద్దీ ఫలితం

చిప్పలోన బడ్డ చినుకు ముత్యం బాయె;
నీళ్లబడ్డ చినుకు నీట గలసె;
ప్రాప్తమున్నచోట ఫలమేల తప్పురా!
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** చిప్ప= ముత్యపుచిప్ప; ప్రాప్తము= రాదగియున్నది; ఫలము= ఫలితం.

**భావం:** ముత్యపుచిప్పలో పడ్డచినుకు ముత్యం అయింది. నీటిలో పడ్డనచినుకు ఆ నీళ్లలో కలిసిపోయింది. రాదగ్గఫలం ఎందుకు తప్పిపోతుంది?


**వివరణ:** సముద్రంలో ఆలిచిప్పలుంటాయి. అవి గవ్వల జాతిలోనివి. స్వాతికార్తెలో ఆలిచిప్పలో చినుకు పడితే ఆ చిప్ప మూసుకుంటుంది. అందులో నీరు ముత్యంగా మారుతుంది. ఆ నీటిచినుకుకు ముత్యంగా మారే ప్రాప్తం ఉండి ముత్యంగా మారింది. వర్షం వస్తే ఎన్ని చినుకులు రాలడం లేదు. అన్ని చినుకులకు ఆలిచిప్పలో పడే అదృష్టం ఉందా! ప్రాప్తం ఉన్నచినుకుకే ఆ యోగం పడుతుంది. అట్టిప్రాప్తమున్నవారికి ఫలమెందుకు తప్పుతుంది? ఆవిధమైన ప్రాప్తంలేని చినుకు నీళ్లలో పడి వాటిలో కలిసిపోతుంది. నేలమీదనో ఇంకెక్కడనో పడినా అంతే. మానవుడు తనకు తనకు మంచి అవకాశం రాలేదని బాధపడకుండా కర్తవ్యం నిర్వహించాలి. ప్రాప్తమున్నపుడు తప్పకుండా ఫలితం దక్కుతుంది.


– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

చిత్ర కథ

# గురువు పైకి కఠినంగా ఉన్నా...

కథ– 'కళారత్న' డా॥ కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు– శ్రీ తుంబలి శివాజీ





నాయనా! గోవులు దయాస్వభావం కలిగినవి. అందులోనూ దూడలు మరీను. అందుచేత నీవు ఆరగిస్తున్నావు కదా అని అవి తమ కడుపుల్ని మాడ్చుకుని నీకోసం నురగను అధికంగా వదిలిపెడుతూ ఉండవచ్చు. కాబట్టి నీవు అలా నురగను త్రాగడం మంచిది కాదు.
బాగా పొద్దు పోయింది. చీకటి పడుతోంది. గోవులు వచ్చాయి. కానీ ఉపమన్యుడు రాలేదేమీ?
గురువు ఉపమన్యుడుని వెతుక్కుంటూ వెళ్ళాడు
నాయనా! ఉపమన్యూ..! ఉపమన్యూ!
గురుదేవా! ఇక్కడ స్వామీ! ఇక్కడ.. ఈ దిగుడుబావిలో..
ఉపమన్యూ! ఇంత అఘాయిత్యం ఎలా జరిగింది?
గురుదేవా! మీరు నురగను కూడా ఆరగించవద్దన్నప్పటి నుండీ ఉపవాసం చేస్తున్నాను. పగలు ఆలమందను మేపుకొని సాయంత్రానికి ఆశ్రమానికి చేరుకునేవాడిని. కొన్ని రోజులు గడిచాయి. ఇక ఆకలి బాధ భరించలేక అర్కపత్రాలు తిన్నాను. విషభరితమైన ఆ పత్రాలు తినేసరికి నా శరీరమంతా విషమయమై నా నేత్రాలు పోయాయి. అయినా ఆవులు నడుస్తుంటే వాటి చప్పుళ్ళను బట్టి వాటి వెనుకగా వెళుతుండేవాడిని. ఈరోజు అనుకోకుండా ఈ దిగుడుబావిలో పడిపోయాను. గోవులన్నీ సురక్షితంగా ఆశ్రమానికి చేరాయో లేదోననే విచారంలో ఉన్నాను. ఈ లోగా మీరొచ్చారు.
నాయనా! ఇప్పుడు నీకు మంత్రోపదేశం చేస్తాను.ఆ ప్రభావంతో అశ్వినీదేవతల్ని ప్రసన్నం చేసుకుని వాళ్ళు ఇచ్చే పాలు త్రాగు. పోయిన చూపు తిరిగి వస్తుంది.
ఉపమన్యువుకి అశ్వినీదేవతలు ప్రసన్నమయ్యారు
కుమారా! ఈ పాలు స్వీకరించు..
ఓ అశ్వినీదేవతలారా! మా గురువుగారికి నివేదించకుండా నేను ఆరగించలేను.
2
ఉపమన్యూ! నీ గురుభక్తికి మెచ్చాము. నీ కళ్ళు తిరిగి చూడగలుగుతాయి.
నాయనా! నేను పెట్టిన పరీక్షలో నెగ్గావు. నాకు తెలిసిన వేదశాస్త్రాలన్నీ నీకు నేర్పుతాను.
మీ ఆశీర్వాదం గురుదేవా! మీరు పైకి కఠినంగా ఉన్నా లోపల వెన్నలాంటి మనసున్నవారని గ్రహించాను. ధన్యోస్మి!

ఆయుర్వేదం

# ఇలా చేస్తే గుండె పదిలం

– డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

మన ఆరోగ్యపరిరక్షణలో అత్యంతప్రాధాన్యత సంత రించుకున్న ప్రధాన అవయవం గుండె. వివిధకారణాల వల్ల గుండెకు సంబంధించిన అనేక అనారోగ్యసమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయి.

**కారణాలు :** అవసరానికి మించి ఆహారం తీసుకోవడం, ఫాస్ట్‌ఫుడ్స్, జంక్‌ఫుడ్స్‌లాంటి ఆహారాలు, బయటి తినుబండారాలు తీసు కోవడం, అధికంగా నూనెలు, క్రొవ్వుపదార్థాలు, మసాలాలు, వేపుళ్లు తీసుకోవడం, మద్యపానం, ధూమపానం, మానసిక వత్తిడి, వ్యాయామరహితజీవితం, అధికబరువు, మధుమేహం, రక్తపోటు లాంటివి ప్రత్యక్షంగా, పరోక్షంగా గుండెజబ్బులకు కారణాలు. వీటి నన్నింటిని దృష్టిలో ఉంచుకుని మన ఆయుర్వేదం నిదాన పరి వర్జనం అనే అంశానికి అధిక ప్రాధాన్యతని ఇచ్చింది. స్థూలంగా చెప్పుకోవాలంటే గుండెజబ్బులకు కారణమయ్యే వివిధఅంశాల ప్రభావం మనదేహం, మనస్సుపై పడకుండా జాగ్రత్తపడటంవల్ల ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని దీని అర్థంగా గ్రహించవచ్చు.

గుండెజబ్బులు రాకుండా ఉండేందుకు, వచ్చినా ప్రమాద కరంగా మారకుండా ఉండేందుకు సనాతన కాలం నుంచి ఆచరణ యోగ్యంగా ఉన్న ఋషిప్రోక్త వైద్యం చాలా చక్కగా ఉపకరిస్తుంది.

**వంటింటి ఔషధాలు:** రోజూ ఒకట్రెండుసార్లు పూటకు ఒక గ్రాము దాల్చినచెక్క చూర్ణాన్ని తగినంత తేనెతో లేదా 50 మి.లీ. పలుచటి మజ్జిగలో కలిపి సేవించటం వల్ల రక్తం చిక్కబడి గడ్డకట్టే స్వభావం తగ్గి గుండెజబ్బుల నుంచి రక్షణ కలుగుతుంది.

రోజూ ఒకసారి 10మి.లీ. అల్లంరసాన్ని, 10 మి.లీ. తేనెతో లేదా 50మి.లీ. నీటిలో కలిపి సేవిస్తున్నా ఎలాంటి అవ రోధాలు లేకుండా గుండెకు మంచి రక్తప్రసరణ జరిగి క్రియా సామర్థ్యం బావుంటుంది.

పసుపుపొడి, దాల్చిన చెక్కపొడి సమానంగా కలిపి ఉంచు కుని రోజూ ఒకసారి ఒక గ్రాము పొడి వంతున తగినంత తేనె లేదా నీటితో కలిపి తీసుకోవడం వల్ల కూడా గుండె పరిరక్షించ బడుతుంది.

200 మి.లీ. తేనెలో 100 గ్రాముల వెల్లుల్లి రెబ్బలు వేసి కలిపి వారం పదిరోజులు అలాగే ఉంచి రోజూ ఉదయం రెండు మూడు వెల్లుల్లిరెబ్బల్ని తింటున్నా లేదా రోజూ ఒకసారి భోజన సమయంలో మొదటి అన్నం ముద్దలో రెండు వెల్లుల్లిరెబ్బల్ని ఉంచి నమిలితింటున్నా మన దేహానికి, ఆరోగ్యానికి మేలుచేసే హెచ్.డి.యల్. కొలెస్ట్రాల్ పెరుగుతుంది. హానిచేసే యల్.డి.యల్., వి.యల్. డి.యల్., ట్రైగ్లిజలైడ్స్‌లాంటివి తగ్గుతాయి. అందువల్ల గుండెపోటు లాంటి సమస్యలనుంచి బయటపడవచ్చు.

ప్రొద్దుతిరుగుడు, పిస్తా, బాదంపప్పులు రెండుమూడు స్పూన్లు లేదా వీటిలో ఏదో ఒకటి 5–6 స్పూన్లు తీసుకుని 7–8 గంటలు నీటిలో నానించి తినటంవల్ల కూడా గుండెజబ్బుల నుంచి రక్షణ కలుగుతుంది.

**ఆయుర్వేద ఔషధాలు:** అర్జునారిష్ట, అర్జునచూర్ణం, అమలకి రసా యనం, శృంగిభస్మ, ప్రభాకరవటి, లశునాదివటి, అజమోదారం, శృంగారాభ్రరస, నిశ అమలకి, చ్యవనప్రాశ, హృదయార్ణవరసం లాంటి వివిధరకాల ఔషధాలు నిపుణులైన ఆయుర్వేద వైద్యుల పర్యవేక్షణలో వాడుకోవడంవల్ల కూడా సత్ఫలితాలు ఉంటాయి.

**ఇవి పాటించాలి :**

01) రోజుకి 3–5 లీటర్లవరకు వారి వారి వయసు, శరీరతత్వం, వాతావరణం, బరువు, శారీరకశ్రమ, ఇతర సమస్యలు మొద లైనవి దృష్టిలో ఉంచుకుని కొద్ది కొద్దిగా నీటిని సేవిస్తుండాలి.


02) వేళకు ఆహారసేవన ముఖ్యం. ఒకేసారి కడుపునిండా ఆహార సేవన కూడా మంచిది కాదు.

03) తగినంత విశ్రాంతి, నిద్ర చాలా అవసరం.

04) రోజూ అరగంట నుంచి గంట వరకు వారి వారి వయసు, ఆరోగ్యపరిస్థితుల ననుసరించి వ్యాయామం చేస్తుండాలి.

05) మానసికవత్తిడి లేకుండా జాగ్రత్తపడాలి.

06) ధ్యానం, యోగ, ప్రాణాయామంలాంటివి కూడా గుండె ఆరోగ్యం పదిలంగా ఉండేందుకు సహాయపడతాయి.



# క్విజ్ 38

01) దుర్గాదేవి మొదటి పేరు? జ)....................

02) సమీరవృత్త తారావళి వ్యాఖ్య రచించింది? జ)....................

03) విష్ణువు నాభి నుండి పుట్టిన కమలం? జ)....................

04) శ్రాద్ధకర్మకు శ్రేష్ఠమైన తీర్థం? జ)....................

05) విప్రజిత్తు కూతురు? జ)....................

06) రురుడి కొడుకు? జ)....................

07) చినుకు ముత్యంగా మారే కార్తె? జ)....................

08) దేవీభాగవతంలోని సప్తమస్కంధాన్ని ఏమంటారు? జ)....................

09) ఉపమన్యుడి గురువు? జ)....................

10) వేదమయుడు ఎవరు? జ)....................

11) కొడిక్కంబం అంటే...? జ)....................

12) అరుంధతి చేసిన శ్రీనివాస స్తోత్రం ఎందులో ఉంది? జ)....................

13) సూర్యునిలో శ్రీనివాసుడు ఉన్న రూపం? జ)....................

14) నిత్యసూరుల అధిపతి? జ)....................

15) మల్లకుమార అనంతరాయలు స్వామివారికి సమర్పించిన వాహనం? జ)....................

16) భరతుడి భార్య? జ)....................

17) మహాభారత ఖిలపర్వం? జ)....................

18) స్వామివారు భూమిపై పాదం మోపిన మొదటి ప్రదేశం? జ)....................

19) తిరుమలలో పుష్పకైంకర్యానికి ఆద్యుడు? జ)....................

20) తిరుమలలో మహంతుల పరిపాలన ముగిసిన సంవత్సరం? జ)....................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్స్‌ప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-09-2025.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .................... వయస్సు: ....................

పాఠశాల: .................... తరగతి: ....................

పేరు: ....................

చిరునామా: ....................

....................

....................

.................... పిన్‌కోడ్: ....................

ఫోన్ సంఖ్య: ....................

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

## పంచశుద్ధులు




వస్త్రశుద్ధి 1



స్థలశుద్ధి 2



పాత్రశుద్ధి 3



కాయశుద్ధి 4



వాక్‌శుద్ధి 5

## వర్షానికి మీకు గొడుగు కావాలా? అయితే.. చుక్కలు కలపండి!



## రంగులు వేద్దాం..!!



సెప్టెంబర్, 2025

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** అన్ని విషయాలలో మంచి కలుతుంది. పోటీ పరీక్షలలో రాణిస్తారు. వ్యాపారాలలో ప్రత్యర్థులు ఎటువంటి నష్టం కలిగించలేరు. మాసాంతంలో అన్నిప్రయత్నాలలో విజయం సాధిస్తారు. ఆర్థిక పరిస్థితిలో పెరుగుదల ఉంటుంది.



**వృషభం–** కళాత్మకభావాలను వ్యక్తీకరించడం, తోబుట్టువులతో సామరస్యసంబంధాలు. రచనా వ్యాసంగాలలో మనోహరమైన పదవిన్యాసశైలీ నైపుణ్యాలు ప్రదర్శిస్తారు.



**మిథునం–** కొన్ని ఆరోగ్య సమస్యలు మీ తండ్రిని ఇబ్బంది పెట్టవచ్చు. కాబట్టి మీరు వారి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. మరియు అవసరమైతే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలి.



**కర్కాటకం–** దృఢసంకల్పం పట్టుదల కలిగి కార్యోన్ముఖులైయుంటారు. ఆత్మవిశ్వాసం మొక్కవోని ధైర్యంతో ఆశయం సాధిస్తారు. స్వావలంభన కలుగుతుంది. ఎన్ని కష్టాలు ఎదురైనా అన్నింటినీ ఛేదించుకుని విజయం సాధిస్తారు.



**సింహం–** స్వస్థతగా ఉంటారు. ఆస్తుల క్రయ విక్రయమార్పులకు అవకాశం ఉంది. ఈ లావా దేవీలతో లాభపడతారు. చక్కటి ప్రణాళికతో అన్ని ప్రాజెక్టులు పూర్తిచేస్తారు. ధన, కుటుంబవిషయాల్లో లాభపడ తారు.



**కన్య–** అధికారయోగం, అధికారవిస్తరణ కల్గుతుంది. కచ్చితత్వాన్ని పాటించి సకాలంలో లక్ష్యాలను సాధిస్తారు. మీ దురుసుతనానికి ఇతరులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. వాహనాలు నడపడంలో జాగ్రత్త అవసరం.



**తుల–** ప్రయాణాలు ఫలవంతంగా, ఆనంద దాయకంగా ఉంటాయి. కుటుంబసభ్యులు విజయాలు సాధిస్తారు. ఆరోగ్యకరమైన జీవనాన్ని ఆస్వాదిస్తారు. విలాసవంతమైన జీవితాన్ని గడుపుతారు.



**వృశ్చికం–** చైతన్యవంతంగా, ఏ విధంగానైనా పోటీ ఎదుర్కొనేలా దృఢంగా ఉంటారు. ఇన్ఫెక్షన్స్ జ్వరం మలేరియావంటి రుగ్మతలవల్ల బాధపడేలా ఉంటుంది.



**ధనుస్సు–** అదృష్టాన్ని, ఉన్నతవిద్య అవకాశాలు పొందుతారు. ధార్మికంగా ఉంటూ ఆధ్యాత్మికత వైపు మొగ్గుచూపుతారు. అదృష్టం కలసివస్తుంది.



**మకరం–** జీవితంలో పరివర్తన, అవగాహన కలుగుతాయి. అంతర్లీనంగా బలమైన దృక్పథాన్ని పెంచుతుంది. అనుభవంతో రాబోవు అడ్డంకులు పసిగట్టి అధిగమించగలరు.



**కుంభం–** బంధుమిత్రుల కలయిక, ధనాగమం అధికారపనులపై వెళ్లుట వల్ల లాభపడతారు. ఆర్థికస్థిరత్వం కల్గుతుంది. సామాజికంగా గౌరవం, పేరుప్రఖ్యాతులు కల్గుతాయి.



**మీనం–** ఇల్లు లాంటి స్థిరాస్తిని కొనుగోలు చేస్తారు. ఆదాయమార్గాలు పెరుగుతాయి. విద్యా విషయంలో గుర్తింపు, పోటీపరీక్షలలో ఉద్యోగ నియామకపు విషయాల్లో ముందంజవేస్తారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
.................................................................. తేది :...................

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.


3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# శ్రీపదకేళి

116



నిర్వహణ: శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024


**అడ్డం** 1)ఆశ్వీయుజశుద్ధపాడ్యమి నుండి ప్రారంభమయ్యే రాత్రులు(7); 4)భాద్రపదశుద్ధ ఏకాదశి(2); 5)కొడుకు(5); 9)గద్యపద్యాల సమ్మిశ్రంతో కూడిన కథను చెప్పే రీతి(2); 10)భాద్రపద కృష్ణఏకాదశి(3); 11)శంకరుని భార్య కనుక(3); 13)పండుగ(4); 14)దశావతారాల్లో ఒకటి(6); 18)దుర్యోధనుని కూతురు(3); 20)భాద్ర పద బహుళపాడ్యమి నుండి ప్రారంభమయ్యే పితృపక్షాలు(4); 21)ప్రసన్ను ని తండ్రి. ధర్మవ్యాధుని వియ్యంకుడు(5)

**నిలువు** 1)ఇక్కడ కురుక్షేత్రయుద్ధం జరిగింది(7); 2)జమదగ్ని కుమారుడు(3); 3)సెప్టెంబరు 5 ప్రత్యేకత(8); 6)నాట్య శాస్త్రకర్త(4); 7)పద్మరాగమణి(2); 8)దక్షప్రజాపతి కుమార్తె(2); 9)పార్వతి అవతారం(3); 11)మన్మథుడు(4); 12)ఒక నది (3); 15)కుబేరుని పట్టణం(3); 16)హ్లాదుని భార్య. వాతాపీ ఇల్వల తల్లి(3); 17)స్త్రీ(3); 19)శివుని నెత్తిమీద ఉన్న నది(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.



Printed by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., and Published by Dr.V.G.Chokkalingam, M.A., Ph.D. on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



దసరా ఉత్సవాన్ని పురస్కరించుకుని మైసూరు మహారాజ సంస్థానంలో నిర్వహించిన దుర్గాపూజ & ఆయుధపూజకు సంబంధించిన ఓనాటి అపురూప తైలవర్ణచిత్రం ఇది.
1934-1945 మధ్యకాలంలో అప్పటి సంస్థాన చిత్రకారుడు వై.సుబ్రహ్మణ్యరాజు గీసిన చిత్రమిది.
సప్తగిరి పాఠకులకు దసరాపర్వదిన ప్రత్యేక కానుక!

చిత్ర సౌజన్యం: మైసూర్ ప్యాలెస్ బోర్డు, మైసూరు, 2007

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthnams
Printing on 25-08-2025 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under
RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT
No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 1st of Every Month.



దేవీనవరాత్రులు ఆరంభం (22-09-2025)